www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 19-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 274 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 7.53 తదుపరి దశమి; నక్షత్రం: భరణి రా. 2.51 తదుపరి కృత్తిక; వర్జ్యం: మ. 12.31-2.07; దుర్ముహూర్తం: ఉ. 9.06-9.51, మ. 12.48-2.33; అమృతఘడియలు: రా. 10.04-11.40; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.59 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్ షూటౌట్

సెమీస్‌లో జర్మనీ గెలుపు
ఓడినా..మనోళ్లకు చాన్స్
ఒలింపిక్ హాకీ మహిళల క్వాలిఫయర్స్

రాంచీ: పారిస్ విశ్వక్రీడల స్థానమే లక్ష్యంగా క్వాలిఫయింగ్ టోర్నీ బరిలోకి దిగిన భారత మహిళలకు చుక్కెదురైంది. పటిష్ట జర్మనీతో గురువారం ఉత్కంఠభరితంగా జరిగిన సెమీస్ షూటౌట్‌లో మన అమ్మాయిలు 3-4తో పరాజయం పాలయ్యారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. భారత్ తరపున దీపిక (15), ఇషికా చౌధురి (59) గోల్స్ చేయగా, చార్లోటి (27, 57) జర్మనీకి రెండు గోల్స్ అందించింది. ఇక పెనాల్టీ షూటౌట్‌లోని ఐదు అవకాశాల్లో ఇరుజట్లు 3-3 గోల్స్ చేయడంతో సడన్‌డెత్ అనివార్యమైంది. సడన్‌డెత్ తొలి ప్రయత్నంలో ఇరుజట్లూ గోల్ చేయలేక పోయాయి. రెండో ప్రయత్నంలో సోనిక విఫలం కాగా, జర్మనీ క్రీడాకారిణి లీసా గోల్ సాధించి తమ దేశానికి ఒలింపిక్ బెర్త్‌ను ఖరారు చేసింది. అయితే పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యే చాన్సు భారత జట్టుకు ఇంకా ఉంది. శుక్రవారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో జపాన్‌పై గెలుపొందితే మనోళ్లకు పారిస్ టిక్కెట్ లభిస్తుంది. ఈ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఒలింపిక్స్‌కు క్వాలిఫై అవుతాయి. శుక్రవారం జరిగే ఫైనల్లో అమెరికాతో జర్మనీ అమీతుమీ తేల్చుకుంటుంది.

క్వార్టర్స్‌లో ప్రణయ్

- సాకేత్-చిరాగ్ జోడీ కూడా..
- ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. అలాగే పురుషుల డబుల్స్‌లో వరల్డ్ నెంబర్ టూ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అంచనాలకు తగ్గట్టుగానే రాణిస్తున్నారు. గురువారం జరిగిన పోరులో ప్రణయ్ 20-22, 21-14, 21-14 తేడాతో భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌పై నెగ్గాడు. రెండో గేమ్‌లో కాలి మడమ గాయానికి గురైన రజావత్ లయ తప్పాడు. దీంతో ప్రణయ్ సునాయాసంగా రెండు గేమ్‌లను గెలిచి మ్యాచ్‌ను ముగించాడు. క్వార్టర్స్‌లో ప్రణయ్ చైనీస్ తైపీకి చెందిన వాంగ్ జు వీతో తలపడతాడు. ఇక సాత్విక్-చిరాగ్ జోడీ 21-14, 21-15 తేడాతో చింగ్-యంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గింది.

కుర్రాళ్ల విశ్వపోరు

నేటి నుంచి అండర్-19 వన్డే ప్రపంచకప్



డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి భారత్
మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బ్లూమ్‌ఫోంటీన్ (దక్షిణాఫ్రికా): ఈ ఏడాది జరిగే భారీ ఈవెంట్లలో మొదటగా కుర్రాళ్ల సందడి చేయనున్నారు. భవిష్యత్ సూపర్ స్టార్లను నిర్దేశించే అండర్-19 వన్డే ప్రపంచకప్‌నకు శుక్రవారం తెర లేవనుంది. ఆరంభ మ్యాచ్‌లో ఐర్లాండ్-అమెరికా, దక్షిణాఫ్రికా-విండీస్ జట్లు తలపడనున్నాయి. ఫిబ్రవరి 11 వరకు అభిమానులను అలరించే ఈ టోర్నీలో మొత్తంగా 16 జట్లు నాలుగు గ్రూప్‌ల వారీగా తలపడనున్నాయి. గత షెడ్యూల్ ప్రకారం శ్రీలంకలో జరగాల్సిన ఈ టోర్నీ ఆ దేశ క్రికెట్ బోర్డుపై ఐసీసీ నిషేధం కారణంగా సౌతాఫ్రికాకు మారింది. మరోవైపు రికార్డు స్థాయిలో ఐదు సార్లు (2000, 2008, 2012, 2018, 2022) విజేతగా నిలిచిన భారత జట్టు తమ టైటిల్‌ను కాపాడుకునేందుకు బరిలోకి దిగబోతోంది. రెండేళ్లకోసారి జరిగే అండర్-19 ప్రపంచకప్ టోర్నీపై గతంలో అభిమానులు పెద్దగా దృష్టి సారించకపోయినా.. కొంతకాలంగా ఆ పరిస్థితి మారింది. యువరాజ్ (2000), రోహిత్ శర్మ (2006), విరాట్, జడేజా (2008), పంత్, ఇషాన్ (2016), గిల్ (2018) ఈ టోర్నీ ద్వారా వెలుగులోకి వచ్చి అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకున్న వాళ్లే. ఇంకా మరెంతో మంది కొద్దికాలమైనా జాతీయ జట్టుకు ఆడగలిగారు. అయితే ఉన్ముక్త్ చంద్, మనీశ్ పాండే, రవికాంత్ శుక్లా, యష్ ధుల్, మన్‌జోత్ కల్రా, నాగర్‌కోటిలాంటి వారు అండర్-19లో విశేషంగా రాణించినా ఆ తర్వాత ఆ స్థాయి ఆటతీరును ప్రదర్శించలేక వెనుకబడ్డారు.

ఇదీ ఫార్మాట్..

మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడివడి తలపడనున్నాయి. ఇందులో ప్రతి గ్రూపునుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన మొత్తం 12 టీమ్స్ సూపర్ సిక్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇక్కడ ఆరు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లుగా విడదీస్తారు. ఒక్కో గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన మొత్తం నాలుగు జట్లు సెమీస్ బరిలో నిలుస్తాయి. ఫిబ్రవరి 6, 8న బినోయ్‌లో ఈ సెమీస్ జరుగుతాయి.

భారత గ్రూప్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి
జనవరి 20	బంగ్లాదేశ్‌తో
జనవరి 25	ఐర్లాండ్‌తో
జనవరి 28	అమెరికాతో

నేటి మ్యాచ్‌లు : ఐర్లాండ్-అమెరికా
దక్షిణాఫ్రికా-వెస్టిండీస్

టైటిల్ నిలబెట్టుకునేనా?

గ్రూప్ 'ఎ'లో ఉన్న యువ భారత్ శనివారం బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది. అమెరికా, ఐర్లాండ్ ఇతర జట్లు. అయితే **ఉదయ్ సహరన్ కెప్టెన్‌గా** వ్యవహరిస్తున్న ప్రస్తుత జట్టు ఇటీవల ఆడిన ఆసియాకప్ సెమీస్‌లో ఓడినా.. ముక్కోణపు సిరీస్‌లో మాత్రం ఓటమి లేకుండా దూసుకెళ్లింది. ఇక జట్టులో తెలంగాణకు చెందిన అవనీశ్ అరవెల్లి ఏకైక తెలుగు క్రికెటర్ కావడం విశేషం. అతడితో పాటు అర్షిన్ కులకర్ణి, ముషీర్ ఖాన్, కెప్టెన్ ఉదయ్‌లపై బ్యాటింగ్ ఆధారపడి ఉంది. బౌలింగ్‌లో రాజ్ లింబాని, సౌమీ పాండే ఇటీవలి ట్రై సిరీస్‌లో మెరుగ్గా రాణించారు. వీరి అండతో టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే ఆలోచనలో జట్టు ఉంది.

రిబకినా, పెగులా ఇంటిబాట

- అల్కారజ్, స్వియటెక్ ముందంజ
- ఆస్ట్రేలియన్ ఓపెన్



ఎలెనా రిబకినా

అనా బ్లింకోవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనాల జోరు కొనసాగుతోంది. గత ఏడాది మెల్‌బోర్న్ పార్క్ రన్నరప్ ఎలెనా రిబకినా, ఐదో సీడ్ జెస్సికా పెగులా, యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ ఎమ్మా రదుకాను తిరుగుముఖంపట్టారు. ఇక..టాప్‌సీడ్ ఇగా స్వియటెక్, రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్ ముందంజ వేశారు.

సుదీర్ఘ టైబ్రేకర్‌తో చరిత్ర..: మూడో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్)-అనా బ్లింకోవా (రష్యా) మధ్య రెండో రౌండ్ మ్యాచ్ మూడో సెట్ టైబ్రేకర్ మహిళల గ్రాండ్‌స్లామ్‌ల్లో సుదీర్ఘంగా సాగినదిగా రికార్డులకెక్కింది. ఈ టైబ్రేకర్‌లో ఇద్దరూ కలిసి 42 పాయింట్లు స్కోరు చేశారు. ఈ మ్యాచ్‌లో బ్లింకోవా 6-4, 4-6, 7-6 (22-20)తో రిబకినాను ఓడించింది. ఐదో సీడ్ పెగులా (అమెరికా) 4-6, 2-6తో బౌరెల్ (ఫ్రాన్స్) చేతిలో, ఎమ్మా రదుకాను (బ్రిటన్) 4-6, 6-4, 4-6తో వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. టాప్ సీడ్ స్వియటెక్ (పోలెండ్) 6-4, 3-6, 6-4తో కొలిన్స్ (అమెరికా)పై, ఒస్టాపెంకో (లాత్వియా) 6-0, 3-6, 6-4తో టోమ్లజనోవిక్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్) 6-4, 6-7 (7), 6-3, 7-6 (3)తో లోరెంజో (ఇటలీ)పై, ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 7-5, 3-6, 4-6, 7-6 (5), 7-6 (7) క్లీన్ (స్లొవేకియా)పై విజయం సాధించారు. అలాగే హోల్గర్ రూన్ (డెన్మార్క్) ఫ్రాన్స్ ప్లేయర్ ఆర్థర్ చేతిలో ఓటమి పాలవగా, మూడో సీడ్ మెద్వెదేవ్ ముందంజవేశాడు.

రెండో రౌండ్‌లో బోపన్న ద్వయం

పోరాడి ఓడిన నగాల్

ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్ జతగా బరిలో దిగిన వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో రెండో రౌండ్‌కు దూసుకుపోగా..సింగిల్స్‌లో సుమిత్ నగాల్ జోరుకు బ్రేక్ పడింది. బోపన్న తొలి రౌండ్‌లో 7-6 (5), 4-6, 7-6 (2)తో స్థానిక జోడీ డక్వర్త్/పోల్‌మన్స్‌పై నెగ్గాడు. ఇదే విభాగంలో మరో భారత ద్వయం విజయ్ సుందర్ ప్రశాంత్/అనిరుధ్ చంద్రశేఖర్ 3-6, 4-6తో మార్టన్ /ఫాబియన్ (హంగేరీ) చేతిలో ఆరంభ రౌండ్‌లో ఓడింది. ఇక ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)కు షాకిచ్చిన సుమిత్ నగాల్ చైనాకు చెందిన జున్‌చెంగ్ చేతిలో 6-2, 3-6, 5-7, 4-6తో ఓటమిపాలయ్యాడు.

హైదరాబాద్‌లో నేటినుంచి కబడ్డీ.. కబడ్డీ

హైదరాబాద్: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10 హైదరాబాద్ అంచె పోటీలు ప్రారంభమవనున్నాయి. ఈ సందర్భంగా పీకేఎల్ ప్రచారకర్త, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలుగు టైటాన్స్ జట్టు సీఈఓ త్రినాథ్, కెప్టెన్ పవన్ సెహ్రావత్, కోచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి టైటాన్స్ జెర్సీని అందించారు..



బాలకృష్ణతో కెప్టెన్ పవన్

ఓటమి అంచున విండీస్

ఆసీస్‌తో తొలి టెస్ట్

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ పరాజయం దిశగా సాగుతోంది. మ్యాచ్‌కు రెండో రోజైన గురువారం ఆట ముగిసే సమయానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. హాజెల్‌వుడ్ మళ్లీ నాలుగు వికెట్లు తీశాడు. ఓవర్‌నైట్ స్కోరు 59/2తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 283 రన్స్‌కు ఆలౌటై 95 పరుగుల ఆధిక్యం అందుకుంది. ట్రావిస్ హెడ్ శతకం (119) సాధించాడు. షామర్ జోసెఫ్‌కు ఐదు వికెట్లు లభించాయి. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో మరో 4 వికెట్లే మిగిలివున్న విండీస్ కేవలం 22 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వరల్డ్ మోటార్ సైకిల్ రేసులో భారత జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్జాతీయ మోటార్ సైకిల్ సమాఖ్య (ఎఫ్ఐఎం) నిర్వహించే పోటీల్లో ఈ ఏడాది నుంచి భారత్ తరపున కంకణాల స్పోర్ట్స్ గ్రూప్‌నకు చెందిన ఇండీ జట్టు పాల్గొననుంది. గురువారం హైదరాబాద్‌లో ఇండీ జట్టు జెర్సీని కంకణాల గ్రూప్ వ్యవస్థాపకుడు అభిషేక్ రెడ్డి, ఎఫ్ఐఎం సహ వ్యవస్థాపకురాలు కేరిన్ ముంటె ఆవిష్కరించారు. ఈ ఏడాది రేసింగ్ సీజన్ ఫిబ్రవరి నుంచి ఆరంభమవనుంది. ఈ సీజన్‌లోని తొలి నాలుగు రేసులు జపాన్, నార్వే, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. సీజన్ ఫైనల్ రేసుకు భారత్ ఆతిథ్యమివ్వనుంది.

సౌత్‌జోన్ వైస్ కెప్టెన్ స్నేహ దీప్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ వన్డే ట్రోఫీ సౌత్‌జోన్ జట్టు వైస్ కెప్టెన్‌గా ఆంధ్ర అమ్మాయి వి.స్నేహ దీప్తిని బీసీసీఐ నియమించింది. సౌత్‌జోన్ జట్టులో ఏకంగా ఏడుగురు తెలుగు క్రీడాకారులకు చోటు లభించడం విశేషం. తెలంగాణ క్రికెటర్లు త్రిషా రెడ్డి, ఎం.మమత, అరుంధతి రెడ్డి, ఆంధ్ర నుంచి స్నేహ, ఎం.దుర్గ, ఎండీ షబ్నమ్‌కు జట్టులో స్థానం దక్కగా, హైదరాబాద్ అమ్మాయి ప్రణవి చంద్ర స్టాండ్‌బైగా ఎంపికైంది. వీరితో పాటు శ్రేయాంక పాటిల్ (కెప్టెన్), యువశ్రీ, సంజన, సహాన, వినయ, కీర్తన, తర్నుమ్, అక్షర, సొనాల్ ఉన్నారు.

2,840 విమానాలు.. 41,000 పైలెట్లు అవసరం

భారత విమానయాన మార్కెట్‌పై ఎయిర్‌బస్ అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత విమానయాన రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. వచ్చే ఇరవై ఏళ్లలో భారత విమానయాన రంగానికి 2,840 కొత్త విమానాలు అవసరం అవుతాయి. 41,000 మంది పైలెట్లు కావాలి. 47,000 మంది టెక్నికల్ స్టాఫ్ అవసరం ఉందని ఎయిర్‌బస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ రెమి మైలార్డ్ అన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన వింగ్స్ ఇండియా 2024లో ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌బస్‌కు 2023 ఏడాది రికార్డు సంవత్సరం. గత ఏడాది భారత్‌లోని విమానయాన సంస్థలకు 75 విమానాలను అందించాం. 750 విమానాలకు ఆర్డర్లు పొందాం. అంతర్జాతీయ గమ్యస్థానాలకు భారత విమానయాన సంస్థలు అందిస్తున్న సేవల్లో ఏ350 విమానం కీలకం కానుందని.. ఇప్పటికే ఎయిరిండియాకు 6 విమానాలను అందించామని చెప్పారు. కాగా దేశంలోనే తొలి, ఎయిరిండియా మొదటి ఎయిర్‌బస్ ఏ350 విమానాన్ని వింగ్స్ ఇండియాలో పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు.

ఎయిరిండియాతో కలిసి పైలెట్ శిక్షణా కేంద్రం ఏర్పాటు

పైలెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఎయిరిండియాతో ఎయిర్‌బస్ చేతులు కలిపింది. 50:50 సంయుక్త సంస్థ ఏర్పాటు చేసి హరియాణాలోని గురుగ్రామ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. రానున్న 20 ఏళ్లలో పైలెట్ల అవసరం బాగా ఉన్నందున ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రెమి తెలిపారు. 2025 ప్రారంభంలో అందుబాటులోకి వచ్చే ఈ శిక్షణ కేంద్రం ఏ320, ఏ350 విమానాలను నడిపేందుకు శిక్షణ ఇస్తుంది. 10 ఏళ్లలో 5,000 మంది పైలెట్లను తయారు చేస్తుంది. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో కూడా ఎయిర్‌బస్ చేతులు కలిపింది.



ఎయిర్‌బస్ ఇండియా ఎండీ రెమి మైలార్డ్

150 బోయింగ్ విమానాలకు ఆకాశ ఎయిర్ ఆర్డర్

దేశీయ, అంతర్జాతీయ సేవలను విస్తరించడానికి ఆకాశ ఎయిర్ 150 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డరు ఇచ్చింది. ఈ విమానాలను 2032 వరకూ డెలివరీ చేస్తారు. కొత్త డీల్‌తో మొత్తం 226 విమానాల కోసం ఆర్డర్ ఇచ్చినట్లవుతుందని ఆకాశ ఎయిర్ వ్యవస్థాపకుడు, సీఈఓ వినయ్ దుబే తెలిపారు. ప్రస్తుతం ఆకాశ ఎయిర్ 22 విమానాలతో సేవలందిస్తోంది. ఎనిమిదేళ్లలో 204 విమానాలను పొందనుంది. ఈ స్థాయి విమానాలతో దశాబ్ద కాలం నాటికి ప్రపంచంలోని 30 ప్రముఖ విమానయాన కంపెనీల్లో ఆకాశ ఎయిర్ ఒకటి అవుతుందని తెలిపారు. సమీప భవిష్యత్తులో అంతర్జాతీయ మార్గాల్లో ఆకాశ ఎయిర్ సేవలను అందించనుంది.

జీఎంఆర్ గ్రూప్, ఇండిగో ఒప్పందం

భారత విమానాయాన రంగంలో డిజిటల్ టెక్నాలజీ వినియోగాన్ని పెంచడానికి జీఎంఆర్ గ్రూప్, ఇండిగో ఎయిర్‌లైన్స్ సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందుకు అనుగుణంగా డిజిటల్ కన్సార్షియంను ఏర్పాటు చేస్తాయి. కన్సార్షియంలో విమానయాన రంగ భాగస్వాములు ఉంటారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడం, నిర్వహణ సామర్థ్యాలను పెంచడానికి కన్సార్షియం డిజిటల్ టెక్నాలజీలను వినియోగిస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.

మహీంద్రా, టాటా అడ్వాన్స్‌డ్‌తో తయారీ కాంట్రాక్టులు

భారత్ నుంచి మరింతగా విమాన విడిభాగాలను పొందే కార్యక్రమంలో భాగంగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), మహీంద్రా ఏరోస్పేస్ స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎయిర్‌బస్ అదనపు తయారీ కాంట్రాక్టులను కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి అనుగుణంగా ఏ320 నియో, ఏ330 నియో, ఏ350 విమానాలకు అవసరమైన మెటాలిక్ డీటైల్డ్ విడిభాగాలు మొదలైన వాటిని టీఏఎస్ఎల్, మహీంద్రా ఏరోస్పేస్‌లు అందిస్తాయి. దేశంలోని దాదాపు 100 కంపెనీలు ఎయిర్‌బస్‌కు విడి భాగాలను అందిస్తున్నాయి. ప్రస్తుతం 75 కోట్ల డాలర్ల విలువైన విడిభాగాలను ప్రతి ఏడాది పొందుతుండగా.. దీన్ని 150 కోట్ల డాలర్ల (దాదాపు రూ.12,150 కోట్లు)కు పెంచుకోవడానికి భారత్‌లో మరింత మంది వెండార్లతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు రెమి తెలిపారు.

మూడో రోజూ నష్టాలే..

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. మార్కెట్ దిగ్గజ షేర్లలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పతనం కావడంతో పాటు కన్స్యూమర్ డ్యూరబుల్స్, యుటిలిటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణం. గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో 835 పాయింట్లకు పైగా పతనమై 70,665 స్థాయికి జారుకున్న సూచీ మళ్లీ కోలుకుని 71,000 స్థాయిని తిరిగి నిలబెట్టుకోగలిగింది. చివర్లో 313.90 పాయింట్ల నష్టంతో 71,186.86 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 286 పాయింట్ల మేర క్షీణించి 21,300 దిగువకు పడిపోయినప్పటికీ, చివరికి 109.70 పాయింట్ల నష్టంతో 21,462.25 వద్ద స్థిరపడింది.

ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్ ఎక్స్ఛేంజీగా ఎన్ఎస్ఈ: ఫ్యూచర్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ తాజా డేటా ప్రకారం.. గత ఏడాదిలో జరిగిన ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్ట్ లావాదేవీలపరంగా ఎన్ఎస్ఈ ప్రపంచంలోనే అతిపెద్ద డెరివేటివ్ ఎక్స్ఛేంజీగా నిలిచింది. ఈ విషయంలో ఎన్ఎస్ఈకి అగ్రస్థానం దక్కడం వరుసగా ఐదో సంవత్సరమిది. కాగా, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్ఛేంజెస్ (డబ్ల్యూఎఫ్ఈ) ప్రకారం.. 2023లో ఎన్ఎస్ఈ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఈక్విటీ ట్రేడింగ్ ఎక్స్ఛేంజీగా నిలిచింది. గత ఏడాది ఎన్ఎస్ఈ చాలా కొత్త రికార్డులను నమోదు చేసింది. ఎక్స్ఛేంజీలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని దాటింది. అలాగే, ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణ విలువ రూ.లక్ష కోట్లను మించిపోయింది. అంతేకాదు, నిఫ్టీ-50 తొలిసారిగా 20,000 మైలురాయికి చేరింది. 2023 డిసెంబరు చివరినాటికి ఎక్స్ఛేంజీలో రిజిస్టర్ చేసుకున్న ఇన్వెస్టర్ల సంఖ్య 8.5 కోట్లకు చేరుకుంది.

- ఐసీఐసీఐ బ్యాంక్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరించింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో బ్యాంక్ కొత్త శాఖను ప్రారంభించింది. కొత్త శాఖ ప్రారంభంతో రాష్ట్రంలో బ్యాంకు శాఖల సంఖ్య 235కు చేరింది.
- ప్రీమియం బైక్ తయారీ సంస్థ బెనెల్లీ/కీవే ఇండియా.. నెల్లూరులో ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ప్రారంభించింది. సంస్థకిది భారత్‌లో 59వ షోరూమ్. ఈ షోరూమ్‌లో 125 సీసీ నుంచి 500 సీసీ సామర్థ్యం కలిగిన కీవే శ్రేణి బైక్స్‌తో పాటు బెనెల్లీ శ్రేణి మోటార్‌సైకిళ్లు అందుబాటులో ఉంటాయి.
- సామ్‌సంగ్ ఇండియా.. ఫ్యూచర్ ఫెస్ట్ పేరుతో ప్రీమియం స్మార్ట్ టీవీలపై ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్‌ను తీసుకువచ్చింది. ఈ నెల 31 వరకు అన్ని ప్రముఖ స్టోర్లలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. నియో క్యూఎల్ఈడీ 4కే, 8కే, ఒఎల్ఈడీ, క్యూఎల్ఈడీ, క్రిస్టల్ 4కే యూహెచ్‌డీ టీవీల కొనుగోలుపై గెలాక్సీ ఎస్23 అల్ట్రా స్మార్ట్‌ఫోన్స్, 50 అంగుళాల క్యూఎల్ఈడీ 4కే ది సెరిఫ్ టీవీ, వైర్‌లెస్ సౌండ్‌బార్స్ వంటి బహుమతులతో పాటు సామ్‌సంగ్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై అదనంగా 10 శాతం క్యాష్‌బ్యాక్‌ను అందించనుంది.

ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించం..

సంకేతాలిచ్చిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: ఈ ఏడాది ద్వితీయార్ధంలో కీలక వడ్డీ (రెపో) రేట్లు మళ్లీ దిగిరావచ్చన్న విశ్లేషకుల అంచనాల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో రెపో రేటును తగ్గించే ప్రతిపాదనే కాదు, ఆ అంశం మా చర్చల్లో కూడా లేదని బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దాస్ స్పష్టం చేశారు. రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తగ్గించడంపైనే ఆర్‌బీఐ ప్రధానంగా దృష్టిసారించిందన్నారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత అంతర్జాతీయంగా కమోడిటీల ధరలు అనూహ్యంగా పెరగడంతో 7.8 శాతానికి ఎగబాకిన ద్రవ్యోల్బణం.. ప్రస్తుతం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన నియంత్రణ శ్రేణి 2-6 శాతంలోకి దిగివచ్చింది. కానీ మా లక్ష్యం 4 శాత"మని ఆయన పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం క్రమంగా 4 శాతం దిశగా తగ్గుముఖం పడుతున్నదని.. దీర్ఘకాలం పాటు ద్రవ్యోల్బణం 4 శాతం స్థాయికి పరిమితం కానంతవరకు రెపో రేటు తగ్గించే అవకాశాల్లేవని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సంకేతాలిచ్చారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,620 ▼	57,400 ▼	77,000 ▼
ముంబై	61,970 ▼	56,765 ▼	70,898 ▼

సామ్‌సంగ్ నుంచి ఏఐ ఆధారిత గెలాక్సీ ఎస్ 24



ప్రారంభ ధర రూ.79,999

న్యూఢిల్లీ: కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ కృత్రిమ మేథ (ఏఐ) ఆధారంగా పని చేసే గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి తెచ్చింది. ఈ ఫోన్ల అమ్మకాలు ఈ నెల 31 నుంచి ప్రారంభమవుతాయి. ఆసక్తి గల వారు ఈ ఫోన్ల కోసం బుక్ చేసుకోవచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్ ధరలు రూ.79,999 నుంచి రూ.1,59,999 మధ్యలో అందుబాటులో ఉంటాయి. దేశీయ, ఎగుమతి మార్కెట్ల కోసం ఈ ఫోన్లను భారత్‌లోనే ఉత్పత్తి చేయనున్నట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రెసిడెంట్ జేబీ పార్క్ తెలిపారు. ఏఐ అప్లికేషన్లతో పని చేసే ఈ ఫోన్లు రియల్ టైమ్ వాయిస్ కాల్, హిందీ సహా ఎంపిక చేసిన భాషల్లో మెసేజ్ అనువాదం, కంటెంట్ సృష్టికర్తలను ఆకర్షించేందుకు మెరుగైన ఇమేజ్ ఎడిటింగ్, కెమెరా ఎఫెక్ట్ కలిగి ఉంటాయి. అలాగే డిస్‌ప్లేలో స్పష్టతను పెంచేందుకు కార్నింగ్ గొరిల్లా ఆర్మర్ గ్లాస్ దోహదపడుతుంది. 8జీబీ రామ్, 256 జీబీ మెమెరీ, 12 జీబీ రామ్, ఒక టెరాబైట్ మెమరీతో ఈ ఫోన్లను తీసుకువచ్చింది. భారత కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్‌గా గెలాక్సీ ఎస్24 అల్ట్రా 512 జీబీ స్మార్ట్‌ఫోన్‌ను గెలాక్సీ ఎస్23 అల్ట్రా 256 జీబీ వెర్షన్ ధరకే అందిస్తున్నామని సామ్‌సంగ్ మొబైల్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ తెలిపారు. ఇతర గెలాక్సీ ఎస్24 ఫోన్లపై కూడా ఇదే తరహా ఆఫర్లు అందించనున్నట్లు రాజు చెప్పారు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఎల్ఎస్ఈజీ ఎక్సలెన్స్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎల్ఎస్ఈజీ (లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీ గ్రూప్) హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా నిపుణుల లభ్యతను పరిగణనలోకి తీసుకుని హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎల్ఎస్ఈజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన ఇంజనీరింగ్ సొల్యూషన్లను అందించడానికి ఈ కేంద్రం దోహదం చేస్తుంది. ప్రస్తుతం 300 మంది నిపుణులతో దీన్ని ఏర్పాటు చేశారు. 2025 చివరి నాటికి మరో 1000 మంది ఇంజనీర్లు, నిపుణులను నియమించుకోనున్నట్లు హుస్సేన్ చెప్పారు.

నోయిడాలో లేబొరేటరీల ఏర్పాటు

నాట్కో ఫార్మా ఆసక్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా ప్రాంతంలో లేబొరేటరీలను ఏర్పాటు చేయడంపై నాట్కో ఫార్మా ఆసక్తి చూపుతోంది. పెట్టుబడులను ఆకర్షించడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మా పరిశ్రమ వర్గాలతో ఇక్కడ ఫార్మా కాంక్లేవ్‌ను నిర్వహించింది. ఈ కాంక్లేవ్‌లో నాట్కో ఫార్మా సీఈఓ రాజీవ్ నన్నపనేని మాట్లాడుతూ.. నోయిడా ప్రాంతంలో లేబొరేటరీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఫార్మా పరిశ్రమకు ఉత్తరప్రదేశ్ కీలక కేంద్రంగా మారిందని.. క్లినికల్ పరీక్షలు, ఇంటర్మీడియెట్స్, స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి ద్వారా యూపీ ఫార్మా కేంద్రంగా మారిందని భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణ ఎల్లా అన్నారు. ఉమ్మడి వ్యర్థాల శుద్ధి ప్లాంట్ ఏర్పాటు వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్, సీఈఓ వెంకట్ జాస్తి తెలిపారు. దాదాపు 100 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

- స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్.. ఈ ఏడాది కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 2024లో ఎంపిక చేసిన కాలానికి టికెట్ ధరలు రూ.4,288 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. బాలి, బ్యాంకాక్ సహా మొత్తం 55 ప్రాంతాల కోసం ఈ నెల 22 వరకు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఆఫర్‌లో భాగంగా విశాఖపట్నం, చెన్నై, కోయంబత్తూర్ నుంచి టికెట్లు కొనుగోలు చేసిన వారు ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 23 వరకు, మే 20వ తేదీ నుంచి 11 డిసెంబరు మధ్య కాలంలో ఎప్పుడైనా ప్రయాణించవచ్చని స్కూట్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
19 జనవరి		విశాఖపట్నం	550
చిత్తూరు	548	వరంగల్	522
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


శుక్రవారం | 19-1-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

| విజయవాడ సిటీ**

రాముడొచ్చాడు!

- అయోధ్య గర్భాలయంలోకి రాముడి విగ్రహం
- పవిత్ర నదీ జలాలతో అభిషేకించిన అర్చకులు
- రామమందిరంపై పోస్టల్ స్టాంపులు విడుదల
- 22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు హాఫ్ డే
- ఐదు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు 10
- కోర్టులకూ సెలవు ఇవ్వాలి: సీజేఐకి బీసీఐ లేఖ



బడుగులను బుగ్గిచేసి..

ఎన్నికల ముందు బాబాసాహెబ్‌కు విగ్రహం

- నాలుగున్నరేళ్లుగా జగన్ సర్కారు ద్రోహం
- దళితులు, గిరిజనుల పథకాలన్నీ రద్దు
- ఉన్నత విద్య, స్వయం ఉపాధికి తూట్లు
- నిధుల్లేక కార్పొరేషన్లు నిర్వీర్యం
- సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు
- దళితవాడల్లో కనిపించని అభివృద్ధి
- ఎస్సీ, ఎస్టీలపైనే అట్రాసిటీ కేసులు
- పైగా దాడులు చేసినవారికే వత్తాసు
- ఇప్పుడు అంబేడ్కర్ పేరిట గాలం
- హడావుడిగా బెజవాడలో స్మృతివనం

• ఏదీ చిత్తశుద్ధి?

గతంలో దళితులు, గిరిజనులకున్న పథకాలన్నీ జగన్ సర్కారు రద్దు చేసింది. స్వయం ఉపాధి, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలకు గండికొట్టింది. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించింది. బడుగుల అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధి అంటే ఇదేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బాబాసాహెబ్ అంబేడ్కర్ బతికుంటే.. నాలుగున్నరేళ్లుగా దళితులు, గిరిజనులకు తీవ్ర ద్రోహం చేసిన జగన్ సర్కార్‌ను క్షమించేవారా? రాజ్యాంగపరంగా బడుగులకు లభించిన

మిగతా 12వ పేజీలో...

బాబా సాహెబ్‌తో సమానంగా సీఎం పేరు

సీఎం జగన్మోహన్ రెడ్డి 'పేరు' పిచ్చి... అంబేడ్కర్ సాక్షిగా మరోసారి బయటపడింది. ఏదైనా ప్రాజెక్టును, పథకాన్ని ఆవిష్కరించిన వారి పేరు, హోదాను శిలాఫలకంపై రాయడం రివాజు. కానీ.. జగన్ తీరే వేరు. మహనీయుడు అంబేడ్కర్‌తో సమానంగా తన పేరూ పెద్దగా రాసుకున్నారు. శుక్రవారం విజయవాడలో ఆవిష్కరించనున్న అంబేడ్కర్ విగ్రహం కింద... "భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం'.. అని రాశారు. 'ఆవిష్కర్త' అంటూ.. 'శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గౌరవ ముఖ్యమంత్రివర్యులు' అని కూడా రాసుకున్నారు. ఇదీ... జగన్ పేరు పిచ్చి!

జగన్‌కు.. అధికారం అంటే దోపిడీ!

ఇసుక, మద్యం, మట్టి దోచేస్తున్నాడు: బాబు


కృష్ణా జిల్లా గుడివాడలో 'రా కదలి రా' సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

- సిగ్గులేకుండా పేదలు, పెత్తందారులకు జరుగుతున్న పోరాటం అంటున్నాడు
- ఈయన దేశంలోనే సంపన్న సీఎం
- ఎంపీలు ఎన్ని నిధులు తెచ్చారో అడగరు
- చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను ఎంత తిట్టారో మాత్రమే అడుగుతారు
- జగన్ తప్పులు చేశాడు కాబట్టే పరదాలు కట్టుకు తిరుగుతున్నాడు
- టీడీపీ అధినేత ఆగ్రహం
- గుడివాడలో 'రా.. కదలిరా' సభ

బూతుశ్రీ బిరుదు ఉంటే ఎమ్మెల్యే
బూతు రత్న అయితే ఎంపీ
బూతు సామ్రాట్ అయితే మంత్రే
వైసీపీలో పదవులకు ఇవే అర్హతలు

"దేశంలోనే అత్యంత ధనిక సీఎం జగన్. దోచుకోవడం తప్ప మరే పదమూ తెలియని వ్యక్తి పేదలకు మంచి చేస్తాడా? పాత సినిమాల్లో నాగభూషణం అనే విలన్ ఉండేవాడు. తడిగుడ్డతో గొంతులు కోసే విలనీ ఆయనది. జగన్ కూడా అలాంటి వాడే." - చంద్రబాబు

(గుడివాడ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'జగన్ ఓ రాజకీయ వ్యాపారి. ఆయనకు అధికారం అంటే దోపిడీ, రాజకీయం అంటే వ్యాపారం' అని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. బ్రిటిష్ వారి ఈస్టిండియా కంపెనీ తరహాలో జగన్ రాష్ట్రంలో సొంత కంపెనీలను ఏర్పాటు చేసుకుని ఇసుక, మద్యం, మట్టి వంటివన్నీ దోచుకుంటున్నాడని ధ్వజమెత్తారు. ఇన్ని చేసి మళ్లీ సిగ్గులేకుండా పేదలకు పెత్తందారులకు

మిగతా 11వ పేజీలో...

175 మందిని మార్చినా..

'టీడీపీ-జనసేన కలిసిన వెంటనే.. గేమ్ ఈజ్ ఓవర్ అని జగన్‌కు అర్థమైపోయింది. ఆయనకు భయం పట్టుకుంది. ఆ భయంతోనే ఎమ్మెల్యేలను మార్చేస్తున్నారు. నియోజకవర్గాల బదిలీలు ఎప్పుడన్నా చూశారా? ఇక్కడ చెత్తను అక్కడ.. అక్కడ చెత్తను ఇక్కడ పోస్తే ఉపయోగం ఏముంది? వైసీపీ అభ్యర్థులు అందరినీ మార్చినా వైసీపీ గెలవడం కల్ల. జగన్ 'వైనాట్ 175' అంటున్నాడు.. నేను వైనాట్ పులివెందుల అంటున్నా. పులివెందుల ప్రజలు జగన్‌కు ఎందుకు ఓటు వేయాలి? బాబాయిని చంపించినందుకా? సాగు నీరు ఇవ్వనందుకా..?'

అన్నమయ్య జిల్లాలో ఆయనో

అరాచకం

తాలిబన్‌ను మరిపించే చర్యలు

తాలిబన్ పాలన అంటే.. ప్రపంచ వ్యాప్తంగా అందరికీ తెలుసు.. అక్కడ ప్రజాస్వామ్యం అన్న మాట వినపడదు. ప్రజలు.. హక్కులు అనే ఊసే ఉండదు. ఇదేంటని ప్రశ్నిస్తే.. దాడులు.. కేసులు.. జైలు. దాదాపు ఇలాంటి పరిస్థితే.. అన్నమయ్య జిల్లాలోని ఆ నియోజకవర్గంలోనూ ఉంది.





- పెద్ద ఎమ్మెల్యే.. చెప్పిందే వేదం
- ప్రశ్నిస్తే కేసులు.. దాడులు
- గ్రామగ్రామానా ప్రైవేటు సైన్యం
- కాంట్రాక్టు పనులన్నీ సొంత కంపెనీకే
- ఇసుకతో 300 కోట్లు కొల్లగొట్టిన వైనం
- నిత్యం సెటిల్‌మెంట్లు, దందాలు
- పేదల భూముల్లో ద్వారకా సౌధాలు
- యథేచ్ఛగా కర్ణాటక మద్యం అమ్మకాలు
- టీడీపీపై దాడులు చేసి వారిపైనే కేసులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

పక్క రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న అన్నమయ్య జిల్లాలోని ఆ నియోజకవర్గాన్ని అధికార పార్టీ ఎమ్మెల్యే తన సొంత జాగీరులా మార్చుకున్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా.. ఇక్కడ ప్రజాస్వామ్యం ఆ ఎమ్మెల్యే, ఆయన అనుచరుల చేతుల్లో బందీగా మారింది. పోలీసులు, అధికారులు ఎవరైనా సరే ఆయన చెప్పినట్లు వినాల్సిందే.. ఆయన

మిగతా 9వ పేజీలో...

నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడిన వాళ్లపై.. ఎమ్మెల్యే సొంత ఊరుకు చెందిన గ్యాంగ్ దాడులకు దిగుతోంది. బహిరంగంగానే దాడులకు దిగి.. మిగిలిన వాళ్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎమ్మెల్యే అనుచరులు కొందరు.. ఉద్యోగాల పేరుతో పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మైనింగ్ చేసే కంపెనీలు పెద్ద ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందే. రియల్ ఎస్టేట్ వెంచర్లలో దక్షిణ చెల్లించుకోవాల్సిందే. నియోజకవర్గం మొత్తం ఎమ్మెల్యే కనుసన్నల్లో నడిచే ప్రైవేటు సైన్యం ఉంటుంది. తమకు ఎదురు తిరిగిన వాళ్లు స్వపక్షం అయినా దాడులు, దౌర్జన్యాలు, కేసులు తప్పవు. నియోజకవర్గం నుంచి గ్రానైట్, మరో ప్రత్యేక రాయిని మైనింగ్ చేసి విదేశాలకు తరలించేవారు కూడా ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందే.



దూరం.. దూరంగానే!

- అన్నతో కలివిడిగా ఉండలేని షర్మిల
- మేనల్లుడి నిశ్చితార్థానికి జగన్, భారతి
- ఫొటో కోసం పదేపదే అన్న పిలుపు
- వేదికపై నిమిషంలోపే జగన్ దంపతులు

◀ వేదికపై ఫొటో కోసం షర్మిల, అనిల్‌ను పిలుస్తున్న జగన్ 11

ఓట్ల దొంగలు

కలెక్టర్‌పై వేటు సరే..

కుట్రదార్ల మాటో!

లాగిన్ అయిందెవరు.. లబ్ధి పొందిందెవరు?



- ఓట్ల స్కామ్ జరిగితే ఆ ఎన్నిక చెల్లుతుందా?
- తిరుపతి లోక్‌సభ ఉపఎన్నికలో దండెత్తిన దొంగ ఓటర్లు
- అప్పటి కమిషనర్ లాగిన్‌తో 30 వేల దొంగ ఓట్ల సృష్టి
- ఏకంగా ఓటర్ ఐడీ కార్డులతో రంగంలోకి 'దొంగలు'
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, నిలదీసిన విపక్ష నేతలు
- కలెక్టర్‌పై వేటు సరే.. అసలు సూత్రధారి ఎవరు?
- ఎన్నికల కమిషన్ గుర్తించి చర్యలు తీసుకుంటుందా?
- బయటపడిందొక్కటే.. ఇంకెన్ని చేశారో.. చేస్తున్నారో!
- జగన్ 'వైనాట్ 175' అన్నది ఈ ధైర్యంతోనేనా?

(తిరుపతి, అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వై నాట్ 175' అన్న ముఖ్యమంత్రి జగన్ ధీమా వెనుక ఉన్న రహస్యం బయటపడింది. ఓటర్లను మంచి చేసుకోవడం చేతకాక, అధికారులను అడ్డదార్లు తొక్కించిన జగనన్న.. ఓటరు కార్డుల మాయాజాలంతో వికృత రాజకీయాలు చేస్తున్నారనేందుకు తిరుపతి ఉప ఎన్నికలు జరిగిన తీరే నిదర్శనం. ఈ వ్యవహారంలో ఐఏఎస్ అధికారి గిరీషాను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్‌చేయడంతో జగన్ మార్క్ రాజకీయం బట్టబయలైంది. ఐఏఎస్ అధికారి గిరీషాను సస్పెండ్ చేశారు సరే.. మరి తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న దొంగ ఓట్ల కుంభకోణం సూత్రధారి ఎవరన్న అంశం ఇప్పుడు చర్చగా మారింది. అధికార పార్టీ కీలక నాయకుల ఆదేశం లేకుండా, కేవలం అధికారులు మాత్రమే ఇందుకు సిద్ధపడే అవకాశం ఉండదని అంటున్నారు. సాధారణంగా దొంగ ఓట్లు అంటే ఒకరి ఓటును మరొకరు వేయడం. అయితే ఏకంగా ఓటరు ఐడీలనే సృష్టించడం అన్నది తిరుపతి ఉప ఎన్నికల్లో బయటపడిన పెద్ద కుంభకోణం. అదీ 30 వేలకుపైగా దొంగ ఓటరు ఐడీలను తయారు చేశారనే విషయాన్ని స్వయంగా కేంద్ర ఎన్నికల సంఘమే బయటపెట్టింది. అప్పటికప్పుడే ఆనాటి

మిగతా 9వ పేజీలో...

యాంటీబయాటిక్ రాస్తే..

కారణం చెప్పాల్సిందే!



- ఎందుకు అవసరమో ప్రిస్క్రిప్షన్‌పై రాయాలి
- వైద్యులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం.. మెడికల్, ఫార్మా సంఘాలకు డీజీహెచ్ఎస్ లేఖ
- యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వాడకంతో ఔషధాలకు లొంగని రోగకారక క్రిములు
- లక్షల సంఖ్యలో రోగుల కన్నుమూత
- మానవాళికి ముప్పుగా ఏఎంఆర్ సమస్య
- ప్రిస్క్రిప్షన్ లేనిదే మెడికల్ షాపులు యాంటీబయాటిక్‌లను అమ్మొద్దని 1న డీజీహెచ్ఎస్ 'అత్యవసర విజ్ఞప్తి'

న్యూఢిల్లీ, జనవరి 18: యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వినియోగంపై కేంద్రం కొరడా ఝుళిపించింది. ఇక మీదట ఏ రోగికైనా యాంటీబయాటిక్ లేదా యాంటీ మైక్రోబియల్ ఔషధాలను సూచిస్తే వాటిని ఎందుకు సిఫారసు చేయాల్సి వస్తోందన్న కారణాలను, సూచనలను తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ మీద రాయాలని వైద్యులను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) అతుల్ గోయల్ అన్ని మెడికల్, ఫార్మసిస్ట్ సంఘాలకు, వైద్యకళాశాలలకు 'అత్యవసర విజ్ఞప్తి' పేరిట లేఖ రాశారు. ఈ నెల 1వ తేదీన రాసిన ఈ లేఖలోని వివరాలు గురువారం వెల్లడయ్యాయి. యాంటీబయాటిక్‌ల విచ్చలవిడి వినియోగం కారణంగా 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత' (ఏఎంఆర్) అనే రుగ్మత ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న టాప్ 10 అనారోగ్య సమస్యల్లో ఇది ఒకటని, 2019లో 12.7 లక్షల మంది ఏఎంఆర్

మిగతా 10వ పేజీలో...

గుజరాత్‌లో బోటు బోల్తా

16 మంది మృతి

- మృతుల్లో 14 మంది బడి పిల్లలు, ఇద్దరు టీచర్లు
- హర్ణీ సరస్సులో విషాదంగా మారిన విహారయాత్ర
- సామర్థ్యానికి మించి పిల్లల్ని ఎక్కించడంవల్లే ఘటన
- లైఫ్ జాకెట్లు లేకపోవడంతోనే మరణాలు 10
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అలుపెరుగని పోరాటం

- 38వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- ఎస్మా, షోకాజ్‌లకు బెదిరేదిలేదని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో దీక్షలు
- విజయనగరంలో ఐసీడీఎస్ కార్యాలయ ముట్టడి
- విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు


ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు 12

ఐదుగురు సిటింగ్‌లు ఔట్

వైసీపీ నాలుగో జాబితా విడుదల



- కొవ్వూరు నుంచి గోపాలపురానికి హోం మంత్రి వనిత బదిలీ!
- నారాయణస్వామి చిత్తూరు లోక్‌సభకు.. ఎంపీ రెడ్డెప్ప గంగాధర నెల్లూరుకు
- కనిగిరిలో బుర్రా మధుసూదన్ అవుట్.. జొన్నలగడ్డ పద్మావతి, ఆర్థర్, రక్షణనిధి, తిప్పేస్వామి కూడా.. జగన్‌తో మహీధర్‌రెడ్డి భేటీ 11
- మార్కాపురంలో పోటీకి శిద్దా సుధీర్ నో.. అక్కడ నాగార్జునరెడ్డికే చాన్స్?

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్ ప్రతీకారం!

ఇరాన్ చేసిన దాడులకు ప్రతీకారం తప్పదన్న హెచ్చరికకు తగినట్టుగానే, పాకిస్థాన్ 24గంటల్లోనే ఆ పనిచేసింది. గురువారం తెల్లవారుజామున పాకిస్థాన్ విమానాలు ఇరాన్ భూభాగాల్లోని 'ఉగ్రవాద' స్థావరాలపై బాంబులు కురిపించాయి. ఇరాన్‌లోని సియోస్థాన్–ఒ–బలూచిస్థాన్ ప్రావిన్సులోని కొన్ని ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. మార్గ్ బర్ సర్మచార్ పేరిట నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో పలువురు ఉగ్రవాదులు మరణించారని, ఇరాన్ ప్రజలకు ఏ ముప్పూ లేకుండా ఎంతో కచ్చితత్వంతో ఈ పనిచేశామని పాకిస్థాన్ చెప్పుకుంది. ఇరాన్ సోదరదేశమని, మా దేశభద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ పనిచేశామని అంటూనే, పాక్ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే ఏ చర్యనూ ఉపేక్షించేది లేదని పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించింది. పాకిస్థాన్‌లోని జైష్ అల్ అదిల్ స్థావరాలపై ఇరాన్ క్షిపణిదాడులు చేసినందుకు ఇలా ప్రతీకారం తీర్చుకోవడంతో పాటు, ఇరాన్‌లోని తన రాయబారిని వెనక్కుపిలవడం, ప్రస్తుతం స్వదేశంలో ఉన్న ఆ దేశరాయబారిని అక్కడే ఉండమనడం, భవిష్యత్ ద్వైపాక్షిక పర్యటనలన్నీ రద్దుచేసుకోవడం వంటి నిర్ణయాలు కూడా పాకిస్థాన్ తీసుకుంది.

ఇరాన్–పాకిస్థాన్ మధ్య మంచి స్నేహమూ లేదు, అలాగని బలమైన శత్రుత్వమూ లేదు. రెండుదేశాల మధ్యా చీలిన బలూచిస్థాన్ ఆయా దేశాల్లో చిచ్చుకు కారణమవుతూ, అడపాదడపా ఆరోపణలకు, ఆగ్రహానికి కారణమవుతున్నాయి. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు పాక్, చైనా ప్రయోజనాలను దెబ్బతీస్తుంటే, జైష్ అల్ అదిల్ వంటివి ఇరాన్‌ను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఒక విధంగా ఇది రెండుదేశాలూ ఒకేవిధంగా ఎదుర్కొంటున్న సమస్య. మీ భూభాగం నుంచి మాకు వ్యతిరేకంగా పని చేస్తున్న గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని, నియంత్రించడం లేదని రెండుదేశాలు ఆరోపణలు చేసుకోవడం తప్ప, నిన్న మొన్నటివరకూ నేరుగా దాడులకు దిగిన సందర్భం లేదు. దశాబ్దాలుగా ఆరోపణలకు, ప్రత్యారోపణలకు పరిమితమైన ఓ వివాదం ఇప్పుడు సరిగ్గా గాజా యుద్ధకాలంలో పరస్పర దాడుల రూపాన్ని తీసుకోవడం విశేషం.

ఇరాక్‌లో అమెరికా దౌత్యకార్యాలయానికి సమీపంలో ఉన్న ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూల్చి, సిరియాలోనూ తీవ్రంగా విరుచుకుపడిన మర్నాడు పాకిస్థాన్ భూభాగాల్లో ఇరాన్ దాడులు చేసింది. ఈ గొలుసుకట్టు చర్యలకు అది ఏ కారణాలైనా చెప్పవచ్చును కానీ, పొరుగుదేశాల సరిహద్దులను ఉల్లంఘించి చేసిన ఈ దాడులు పశ్చిమాసియాను మరింత ఉద్రిక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్ భూభాగాల్లో ఇరాన్ దాడిమీద భారతదేశం వ్యూహాత్మకంగా స్పందించినప్పటికీ, ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ ఒక పొరుగుదేశంగా మనకు ఆందోళన కలిగించే అంశమే.

మరో వాణిజ్యనౌకమీద బుధవారం దాడి జరగడంతో ఎర్రసముద్రంలో పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని భారత విదేశాంగశాఖ వ్యాఖ్యానించింది. అమెరికా, బ్రిటన్, మరి కొన్ని పాశ్చాత్యదేశాలు కలసికట్టుగా యుద్ధవిమానాలతో యెమెన్‌లోకి చొరబడి మూడురోజులు వరుసగా హౌతీల మీద దాడులు చేసినా పరిస్థితుల్లో పెద్ద మార్పేమీ రాలేదు. పైగా, హౌతీలు మరింతగా నౌకలమీద ప్రతీకారదాడులకు తెగబడుతున్నారు. వందరోజులకుపైగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య సాగుతున్న యుద్ధం అనేక శక్తులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తూ క్రమంగా విస్తరిస్తున్నది. లెబనాన్‌లోకి నేరుగా చొరబడి హమాస్ ఉన్నత స్థాయి నాయకుడిని ఇజ్రాయెల్ హతమార్చడం, ఇరాక్, సిరియా, యెమెన్‌లో అమెరికా ప్రతీకారదాడులు, ఇప్పుడు ఇరాన్ తన పొరుగుదేశాలమీద విరుచుకుపడటం వంటివి ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఆత్మరక్షణ, ఉగ్రవాదాన్ని అణచివేయడం ఇత్యాది ఏ పేర్లు పెట్టుకున్నా గాజాయుద్ధం పునాదిగా రేగిన చిచ్చు ఇది. ఓ ప్రాంతీయ స్థాయి ఘర్షణగా దానిని అభివర్ణించగలిగే దశ దాటిపోతున్నది. అంతర్జాతీయ నిబంధనలు చట్టుబండలై, దేశాల సార్వభౌమత్వం అర్థంలేనిదిగా మిగిలి, మరింత భయానకమైన యుద్ధానికి వీలుకల్పించే పరిస్థితులు ఇప్పుడునెలకొన్నాయి. ఇప్పటికే పాతికవేలమంది అమాయకుల ప్రాణాలు తీసిన ఇజ్రాయెల్‌ను నిలువరించి, కాల్పుల విరమణ అమలుచేయనిదే ఈ గొలుసు తెగడం కష్టం. ఇరాన్ దాడులకు అర్థం, పరమార్థం దానంతటదే ఆ తరువాత తెలిసొస్తుంది.

భిన్న తరహాలో ప్రపంచీకరణ

అవును, ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ కొనసాగాలి. అయితే ఆ విశ్వీకరణ విభిన్న తరహాలో ఉండి తీరాలి. ఇందుకు మనం ఈ (2024) సంవత్సరంలో అంతర్జాతీయ వాణిజ్య నియమాలను నిశితంగా పునః పరిశీలించి కొత్తగా, మరో రీతిలో రూపొందించి తీరాలి. మౌలిక మార్పులు, సమూల సంస్కరణలు గ్లోబల్ సౌత్ (పారిశ్రామికీకరణలో బాగా వెనుకబడిన దేశాలు) ఆర్థిక వ్యవస్థల సత్వర పురోగతికి, వాతావరణ మార్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు స్వేచ్ఛా వాణిజ్య నిబంధనలలో మౌలిక మార్పులు అత్యంత ముఖ్యం.



▪ సునీతా నారాయణ్

మట్టివాసన

చాలా చాలా సంవత్సరాల క్రితం వాతావరణ మార్పు సంభవనీయత గురించి చర్చిస్తున్నప్పుడే కొత్త వాణిజ్య వ్యవస్థ విషయమై కూడా ప్రపంచం మంతనాలు జరిపింది. 1990 దశకంలో రియో ధరిత్రి సదస్సులో వాతావరణ మార్పుపై ఐక్యరాజ్య సమితి ఒప్పందం ఆమోదం పొందినప్పుడే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)ను కూడా ఏర్పాటు చేశారు. దేశ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యాన్ని సుసాధ్యం చేసే నియమాలనూ రూపొందించారు. ఆ ప్రపంచ వాణిజ్య ఒప్పందం చాలా సరళమైనది. శ్రమశక్తి వ్యయాలు, పర్యావరణ ప్రమాణాలు తక్కువగా ఉన్న దేశాలలో సరుకులను ఉత్పత్తి చేస్తే ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా తగ్గుతాయనేది ఆ ఒప్పంద సారాంశం. ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో సిరిసంపదలను ఇతోధికంగా సృష్టిస్తాయని ఆ ఒప్పందం నొక్కి చెప్పింది. మరీ ముఖ్యంగా చౌక సరుకులు, సమృద్ధిగా అందుబాటులో ఉండే సేవల నుంచి సంపన్న దేశాలలోని వినియోగదారులు విశేషంగా లబ్ధి పొందుతారని ఆ ఒప్పంద రూపకర్తలు విశ్వసించారు. నిజానికి అభివృద్ధి చెందిన దేశాలకు విశేష లబ్ధి సమకూర్చడమే వారి లక్ష్యం. సరే, ఈ ఒప్పందం అమలులో 2001లో పెను మార్పు చోటుచేసుకున్నది. చైనాకు సభ్యత్వ మివ్వడానికి డబ్ల్యుటిఓ అంగీకరించడమే ఈ పెనుమార్పుకు ప్రధాన కారణం. చైనాలో చౌక కార్మిక శక్తి అపారంగా ఉన్నది. కార్మిక సంఘాలు అనేవి లేనే లేవు. ఏర్పాటుచేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కమ్యూనిస్టు పాలకుల నుంచి తీవ్ర వేధింపులకు గురికావలసి ఉంటుంది. పర్యావరణ రక్షణలు అనేవి లేవు. నియంతృత్వ పాలన. పాలకులదే తొలి, మలి, తుది మాట. డబ్ల్యుటిఓలో చేరిన తరువాత ప్రపంచ కర్బన ఉద్గారాలలో చైనా వాటా 1990లో 5 శాతం నుంచి 2019లో 21 శాతానికి పెరిగింది. స్వేచ్ఛా వాణిజ్యంలో చైనా విజృంభించింది. అయితే ప్రపంచ సిరిసంపదలు పెరగలేదు. వాణిజ్యం మాత్రమే పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాణిజ్యం పెరుగుదలతో కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగాయి!

రెండు దశాబ్దాల కాలంలోనే ప్రపంచీకరణ తీరుతెన్నులు వక్రగతి పట్టాయి. పేద దేశాలకు వ్యతిరేకంగా పరిణమించాయి. తొలుత ఆ ఒప్పందాన్ని ప్రతిపాదించినవారే ఇప్పుడు దానిపట్ల విముఖత చూపుతున్నారు. అడ్డు అదుపు లేని ప్రపంచ వాణిజ్యంతో ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతుందన్న వాస్తవాన్ని వారు గుర్తించారు.

జాతీయ ప్రభుత్వాల ఆర్థిక తోడ్పాటు, సబ్సిడీలతో నిమిత్తం లేని రీతిలో ఆ ప్రపంచ వాణిజ్యాన్ని రూపొందించడం జరిగింది. ఒక పక్క వాతావరణ విపత్తు, మరో పక్క అంతు లేని యుద్ధంతో సతమతమవుతున్న ప్రపంచంలో కొత్త వాణిజ్య నియమాలు ఏ విధంగా రూపొందనున్నాయి? నేడు ప్రపంచ వ్యాప్తంగా మీడియాలో, విద్యావంతుల మాటా మంతీలో, సామాన్యుల పిచ్చాపాటీలో విశేషంగా ప్రస్తావితమవుతున్న అంశం చైనా పట్ల అమెరికా వ్యతిరేకత. ఇది నియంతృత్వ, అప్రజాస్వామిక వ్యవస్థల మధ్య పోరు (ఇది వాస్తవమే)గా కూడా చర్చించుకోవడం జరుగుతోంది. అయితే ఆ రెండు దేశాల మధ్య ఎనలేని స్పర్థకు అసలు కారణం భావి అవసరాలకు అవసరమైన సహజ వనరులు, అధునాతన సాంకేతికతలపై సంపూర్ణ నియంత్రణ సాధించడమే. ప్రపంచానికి అత్యవసరమైన గ్రీన్ ఎకానమీ (సామాజిక సుస్థిరత, పర్యావరణ భద్రతకు దోహదం చేసే మౌలిక సదుపాయాలను ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడుల సహాయంతో నిరంతరాయ అభివృద్ధిని సాధించడమే హరిత ఆర్థిక వ్యవస్థ)ని సంపూర్ణంగా నెలకొల్పుకోవడంలో అమెరికా, చైనాలు తీవ్రంగా పోటీపడుతున్నాయి. బ్యాటరీలకు అవసరమైన ముడి పదార్థాల సరఫరా గొలుసులలో చైనా చాలా ప్రాబల్య స్థానంలో ఉన్నది. లిథియం, కోబాల్ట్, గ్రాఫైట్ నిక్షేపాలలో సగానికి పైగా చైనాలోనే ఉన్నాయి. దీనికి తోడు సౌర ఇంధన ఉత్పత్తిలో చైనాయే ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. మరి ఈ 'ప్రత్యర్థి'పై పోరాడేందుకు సబ్సిడీల విషయమై తన సైద్ధాంతిక సంకోచాలను పూర్తిగా వదిలివేయాలని అమెరికా నిర్ణయించుకుంది. తక్కువ కర్బన ఉద్గారాలకు కారణమయ్యే సరుకులను ఉత్పత్తి చేసే కంపెనీలకు ఆర్థిక సహాయాన్ని సమకూర్చేందుకు 'ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం' (ఐఆర్ఎ)ను అమెరికా తీసుకువచ్చింది.

అధునాతన పారిశ్రామిక రంగంలో చైనా ప్రాబల్యాన్ని తగ్గించడంలో అమెరికా, ఇతర పాశ్చాత్య సంపన్న దేశాల లక్ష్యం నెరవేరడం హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్ – శిలాజ ఇంధనాలు, సహజ వనరుల మితిమీరిన వినియోగంపై ఆధారపడకుండా సుస్థిర ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచుకోవడం) వ్యయాలు మరింత అధికమయ్యేందుకు, అసలు ఆ పరివర్తనను జాప్యం చేసేందుకు దారి తీస్తుందా? లేక అసాధ్యమైన దాన్ని–అరుదైన ఖనిజాలు, లోహాలను పాశ్చాత్య దేశాలకు అందుబాటులోకి తెచ్చి వస్తూత్పత్తి రంగాన్ని పునర్నిర్మించుకునేందుకు దోహదం చేయడం – సుసాధ్యం చేస్తుందా? అరుదైన సహజ వనరులను కలిగి వున్న దేశాలు వాటి నుంచి గరిష్ఠ ప్రయోజనాలను పొందేందుకు ప్రయత్నించడం డీ–గ్లోబలైజేషన్ లేదా స్థానికీకరణకు దారితీసే అవకాశం ఎంతైనా ఉన్నది. కొత్త పథ నిర్దేశక సాంకేతికతల ఆవిర్భావం అరుదైన ఖనిజాల సరఫరా గొలుసులలో చైనా ప్రాబల్యాన్ని పూర్తిగా తగ్గించివేసే అవకాశమూ ఉన్నది. ఉదాహరణకు సోడియం అయాన్ బ్యాటరీల గురించి ఇప్పుడు విశేష చర్చ జరుగుతోంది. ఇవి రంగంలోకి వస్తే లిథియమ్ బ్యాటరీల అవసరం గణనీయంగా తగ్గిపోతుంది. డీ –గ్లోబలైజేషన్ ప్రక్రియ హరిత పరివర్తనకు కూడా అంతరాయాన్ని కలిగిస్తుంది. అమెరికా తన ఐఆర్ఎ చట్టం ద్వారా స్థానికంగా విద్యుత్ వాహనాలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ఆర్థిక సహాయాన్ని సమకూరుస్తుంది. అయితే చైనాలో ఉత్పత్తి అయిన బ్యాటరీలను ఉపయోగించే విద్యుత్ వాహనాల ఉత్పత్తికి ఆర్థిక సహాయం అందించబోమని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. చైనా ప్రభుత్వంతో సంబంధాలు ఉన్న కంపెనీలు సైతం ఐఆర్ఎ నుంచి లబ్ధి పొందలేవు. అయితే ముడి పదార్థాల సరఫరాపై చైనాకు సంపూర్ణ నియంత్రణ ఉన్నందున రవాణా రంగం విద్యుత్ వాహనాలకు మారడమనేది మరింత జాప్యమై వాటిని మరింత వ్యయభరితంచేసే అవకాశమున్నది. చైనీస్ విద్యుత్ వాహనాల తయారీదారు బివైడి ఇప్పటికే ఎలన్ మస్క్ కంపెనీ టెస్లాను అధిగమించింది.



2001లో చైనా డబ్ల్యుటిఓలో చేరిన తరువాత స్వేచ్ఛా వాణిజ్యంలో విజృంభించింది. ప్రపంచ సిరిసంపదలు పెరగలేదు. వాణిజ్యం మాత్రమే పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే వాణిజ్యం పెరుగుదలతో కర్బన ఉద్గారాలు మాత్రమే మరింతగా పెరిగాయి! తొలుత ఆ ఒప్పందాన్ని ప్రతిపాదించినవారే ఇప్పుడు దానిపట్ల విముఖత చూసుతున్నారు. అడ్డు అదుపులేని ప్రపంచ వాణిజ్యంతో ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతుందన్న వాస్తవాన్ని వారు గుర్తించారు.

'ఫైనాన్షియల్ టైమ్స్' ప్రకారం 2023 చివరి త్రైమాసికంలో బివైడి విక్రయించిన బ్యాటరీ–ఓన్లీ విద్యుత్ వాహనాలు 526,000 కాగా టెస్లా విక్రయించిన విద్యుత్ వాహనాలు 4,84,000 మాత్రమే. చైనా ప్రాబల్యం కొనసాగుతున్న నేటి ప్రపంచంలో స్థానికీకరణ, త్వరితగతిన హరిత పరివర్తన లక్ష్యాలను సాధించడం అంత సులువేమీ కాదు.

భారత్‌లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. సౌరశక్తి ఉత్పత్తిని స్థానికంగా అభివృద్ధిపరచుకోవడానికి ప్రాధాన్యమిస్తున్నాం. సోలార్ సెల్ తయారీ కంపెనీలకు ఆర్థిక ప్రోత్సాహకాలను భారత ప్రభుత్వం ప్రకటించింది. చైనీస్ దిగుమతులపై అధిక సుంకాలు విధించారు. అయితే ఈ చర్యలు పునరుద్ధరణీయ ఇంధనాలను దేశీయ సామర్థ్యంతో అభివృద్ధిపరచుకోవాలనే భారత్ ఆశయానికి ఇది ప్రతిబంధకమవుతుందా అనే విషయమై ఇప్పుడే ఏమీ చెప్పలేము.... ఏమైనా మన పరిశ్రమను మనమే అభివృద్ధిపరచుకోవడంలో ఒక ప్రయోజనమున్నది స్వేచ్ఛా వాణిజ్యం నిలిచిపోయినపక్షంలో దానిపర్యవసానాలు మన ఎగుమతులపై కూడా ఉంటాయి. ఏమైనా అంతర్జాతీయ వాణిజ్యరంగంలో ఒక ప్రయత్నం ప్రారంభమయింది. సరికొత్త వాణిజ్య వ్యవస్థ నియమాలు ప్రజల శ్రేయస్సుకు ధాత్రీ పరిరక్షణకు తోడ్పడుతాయా లేదా అన్నది కాలమే చెప్పగలదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మార్క్స్ ఆదర్శానికి రక్తమాంసాలిచ్చిన లెనిన్!

'ఇదే అదను లెనిన్ కథను/ రచించెదను నేను..' లెనిన్ స్మృతిలో ప్రసిద్ధ రష్యన్ యువకవి మయికోవిస్కీ రాసిన దీర్ఘ కవితకు శ్రీశ్రీ చేసిన అనువాదం ఇలా మొదలౌతుంది. లెనిన్ జనవరి 21, 1924న తుది శ్వాస విడిచాడు. ఆ రోజుకి వంద సంవత్సరాలు అవుతున్నది. ఆ వార్త తెలియగానే ఆనాడు ప్రపంచంలోని దేశ దేశాల కార్మిక వర్గం కర్మాగార రథ చక్రాలను నిలిపివేసి శ్రద్ధాంజలి ఘటించింది. మానవాళి చరిత్రలో అలాంటి గౌరవం పొందిన వ్యక్తి మరొకరు లేరు. తను ముందుండి విప్లవాన్ని విజయవంతం చేసిన గడ్డ మీదనే ఆయన విగ్రహాలను భారీ క్రేన్లతో తొలగిస్తున్న దృశ్యాలను అంతర్జాతీయ కార్మిక సమాజం నిశ్శబ్దంగా చూసింది. విగ్రహాలను తొలగించినంత మాత్రాన చరిత్రలో లెనిన్ నిర్వహించిన పాత్ర, వేసిన ముద్ర చెరిగిపోతుందా?

మార్క్స్ రచనలలో ఆనాటికి ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థపై చేసిన విమర్శ ఉన్నంతగా, దాని స్థానే నిర్మించవలసిన కొత్త వ్యవస్థ 'బ్లూ ప్రింట్' లేదు. దానిని లెనిన్ రూపొందించుకోవాల్సి వచ్చింది. చూసి నేర్చుకోవడానికి, సరిపోల్చి సరిదిద్దుకోవడానికి ఆయన ముందు ఎలాంటి నమూనాలు లేవు. మార్క్స్ బుర్రలో ఉన్న సమసమాజ భావనను మొదట చూసింది, నమ్మింది ఆయన భార్య, పిల్లలు, మిత్రుడు ఏంగిల్స్ అంటారు మేరి గేబ్రియల్ తన 'లవ్ అండ్ కేపిటల్' పుస్తకంలో. లెనిన్ ఆ ఆదర్శానికి రక్త మాంసాలు ఇచ్చే ప్రయత్నం చేసాడు. ఇందుకు మార్క్సిజం మూల భావనల్ని అతిక్రమించకుండానే పలు చేర్పులు చేస్తూ ఉద్దీపన చేసారు. అవి ఎంత ప్రభావశీలతను కలిగివున్నాయంటే మార్క్సిజానికి లెనినిజం అని చేర్చవలసి వచ్చింది.

శ్రామిక వర్గ తిరుగుబాటుకు కావలసిన సిద్ధాంత భూమికను మార్క్స్ – ఏంగిల్స్ ఏర్పరిచారు. వారు జీవించి ఉండగా జరిగిన ప్యారిస్ కమ్యూన్ తిరుగుబాటును, దాని అణచివేతను స్వయంగా చూసి గుణపాఠాలను తీసి శ్రామిక ప్రజల ముందు ఉంచారు. అయితే మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని రష్యన్ పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించిన లెనిన్ నాయకత్వం వల్లనే అక్కడ శ్రామిక వర్గ విప్లవం విజయవంతమయ్యింది. అప్పటి వరకు స్థిర పడిన భావన ఏమిటంటే– అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోనే మొదట విప్లవాలు వస్తాయని; వెనుకబడిన దేశాలలో, మొదట అవి పెట్టుబడిదారి దేశాలుగా మారి, అక్కడ బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు జరిగాకనే శ్రామిక వర్గ విప్లవాలకు అవకాశం వస్తుందని. ఇది మార్క్స్ చెప్పిన గతి తార్కిక భౌతిక వాదంలోని చరిత్ర పరిణామ గమనం. అలా చూస్తే, ఆనాటికి బాగా చైతన్యవంతమైన కార్మిక వర్గం ఉన్న జర్మనీలో శ్రామిక వర్గ విప్లవం రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అంచనావేసారు. జార్ చక్రవర్తి పాలనలో, అంతగా పారిశ్రామిక ప్రగతి లేని రష్యాలో విప్లవాన్ని తెచ్చేందుకు లెనిన్ మార్క్సిజపు ఈ సాధారణ సూత్రీకరణను విస్తృతపరిచాడు. 'ఇంతవరకు తత్వవేత్తలు ప్రపంచాన్ని నిర్వచించారు అసలు విషయం మార్చడం' అన్నాడు మార్క్స్. స్వీయ సంకల్పంతో మార్పును తేగల మానవుల శక్తిని మార్క్స్ గుర్తు చేస్తున్నాడు. పరిణామం తనంత తాను జరిగే వరకు ఎదురుచూడవలసిన అవసరం లేదు. రష్యన్ పరిస్థితులకు మార్క్స్‌ను అన్వయించడంలో లెనిన్ ఈ పనే చేసాడు.

శ్రామిక వర్గ విప్లవం విజయవంతం కావాలంటే దాని వెనుక బలమైన శ్రామిక వర్గ పార్టీ ఒకటి ఉండాలని లెనిన్ గుర్తించాడు. దాని నిర్మాణానికి కావలసిన నిర్మాణ సూత్రాలను రూపొందించి, ఆచరణలో పెట్టి చూపించాడు. 1917 అక్టోబర్ విప్లవం విజయవంతం అయిందంటే అందుకు ప్రధాన కారణం ఆయన అంతకు చాలకాలం ముందే నిర్మించి సిద్ధం చేసిన పార్టీ ఉండటమే. అందుచేతనే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు లెనిన్ నిర్మాణ సూత్రాలను అనుసరించే ప్రయత్నం చేస్తూ ఉంటాయి.



వందేళ్ళ కిందట కీర్తిశేషుడై, మహోన్నత విప్లవాన్ని విజయవంతం చేసిన దేశంలోనే నేడు నిరాదరణకు గురైన లెనిన్ ప్రాసంగికత ఏమిటి? సామ్రాజ్యవాదం తన రూపం మార్చుకుంది. వనరుల దోపిడీని వదులుకోలేదు. అసమానతలు పెరుగుతున్నాయి. మొత్తం ఆర్థిక వ్యవస్థను కొన్ని కంపెనీలు నియంత్రిస్తున్నాయి. లెనిన్ ప్రాసంగికత అందుకే వుంది. ఆ అజరామర విప్లవ దార్శనికత ప్రాసంగికత నేటికీ, ఎప్పటికీ సజీవం.

పటిష్ఠమైన కార్మిక వర్గ పార్టీ ఉన్నప్పుడు, పరిస్థితులు కలిసి వచ్చినప్పుడు ఒక వెనుకబడిన దేశంలో కూడా విప్లవాన్ని తీసుకు రావచ్చని చెపుతూ అందుకు కావలసిన సైద్ధాంతిక ప్రాతిపదికలను లెనిన్ అభివృద్ధి చేసాడు. మొదటి ప్రపంచ యుద్ధం రాబోతుందని అంచనా వేసి, ప్రపంచాన్ని ఎలా పంచుకోవాలన్న పెట్టుబడిదారుల యుద్ధంగా దానిని లెనిన్ అభివర్ణించాడు. ఈ యుద్ధంలో రెండు వైపులా సైనిక దుస్తులలో ఉండేది కార్మికులేనని, కనుక తుపాకులను తమ దేశాల పెట్టుబడిదారులపై ఎక్కుపెట్టాలని అన్నాడు. అందుకే యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండంటూ (Turn war into Civil war) పిలుపునిచ్చాడు. ముందు అందరూ నిజమేన్నారు కాని యుద్ధం బద్దలు కాగానే సోషల్ డెమోక్రటిక్ పార్టీలు దేశభక్తి పేరుతో ఆయా దేశాల పెట్టుబడిదారుల వెనుక మొహరించారు, ఒక్క రష్యాలో తప్ప. మొదటి ప్రపంచ యుద్ధం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని రష్యాలో విప్లవ విజయాన్ని సాధించాడు లెనిన్.

ఆయన రాజకీయ రంగం మీదకు వచ్చేసరికి పెట్టుబడిదారీ దేశాలు సామ్రాజ్యవాద దేశాలుగా మారాయి. 'పెట్టుబడిదారి వ్యవస్థ అత్యున్నత రూపం సామ్రాజ్యవాదం' అని విశ్లేషిస్తూ ఆయన రూపొందించిన 'వలసవాద సిద్ధాంతం' (Colonial Theses) వలస దేశాలలోని జాతీయవాదులకు, ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీలకు దిశా నిర్దేశం చేసింది. జాతుల సమస్యను ప్రస్తావించి, 'విడిపోయే హక్కుతో సహా కలసి ఉండే' హక్కు ఉన్నదని చెపుతూ, సోవియట్ రాజ్యాంగంలో పొందుపర్చి, సామ్రాజ్యవాద దేశాల పాలకులను సవాల్ చేసాడు.

అసమానతలు లేని సమాజం ఇక ఒక ఆదర్శం మాత్రమే కాదు అది ఒక 'వాస్తవం' (reality) అని ప్రపంచ మానవాళి ముందు నిలిపి చూపాడు. ప్రజల మేలు కోసం 'పార్టీ', సోషలిజం నిర్మాణం కోసం 'రాజ్యం' పని చేయాలని లెనిన్ కోరాడు. తన శరీరం పని చేస్తున్న ఆఖరి క్షణం వరకు అందుకే జీవించాడు. అనారోగ్యంపాలై కోలుకోగానే పాత రష్యన్ జారిస్ట్ ఫ్యూడల్ బ్యూరాక్రసి ధోరణులకు పార్టీ, ప్రభుత్వం ఎలా గురౌతున్నదీ విమర్శ పెట్టడంలో ఎలాంటి మొహమాటం చూపలేదు. ఆ విమర్శనాత్మక ఆఖరి రచనలు లెనిన్ మరణానంతరం ముప్పై ఏళ్ల తరువాత వెలుగుచూసాయి.

మార్క్స్, ఏంగిల్స్ కమ్యూనిస్టు భూతం యూరోప్‌ను భయపెడుతున్నదని కమ్యూనిస్ట్ ప్రణాళికలో రాశారు. రష్యన్ బోల్షివిక్ విప్లవం ప్రపంచంలోని అన్ని దేశాల దోపిడీదారులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. వారు లెనిన్‌ను, బోల్షివిక్ విప్లవాన్ని ద్వేషించారు. తమ దేశాలలో, వలస దేశాలలో దాని ప్రభావం పడకుండా ఉండేందుకు తమంతతాముగా శ్రామిక ప్రజలకు రాయితీలు ఇవ్వవలసి వచ్చింది. ప్రజల సంక్షేమం 'రాజ్యం' బాధ్యత అని చెప్పుకోవలసి వచ్చింది.

లెనిన్ 53ఏళ్లకే మరణించాడు. విప్లవం విజయవంతమైన తరువాత ఏడేళ్ళు మాత్రమే జీవించి ఉన్నాడు. అందులో చివరాఖరి రెండేళ్ళు అనారోగ్యం. అప్పటి వరకు ఒక విప్లవ ప్రతిపక్షంగా, కార్మిక వర్గ పార్టీకి నాయకులుగా ఉన్నవారిపై రాజ్య అధికారం, ఉద్యోగస్వామ్యం (బ్యూరాక్రటైజేషన్), రష్యన్ ఆధిపత్య అహంకార ప్రభావాలను ఆయన గమనించాడు. వాటి నుండి పార్టీని రక్షించడానికి అనారోగ్యంలో సహితం ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ప్రతి దశలోను తనకు ఎదురైన సందిగ్ధతలకు జవాబులు అన్వేషణ చేసుకుంటూ సాగాడు.

వందేళ్ళ కిందట కీర్తిశేషుడై, మహోన్నత విప్లవాన్ని విజయవంతం చేసిన దేశంలోనే నేడు నిరాదరణకు గురైన లెనిన్ ప్రాసంగికత ఏమిటి? సామ్రాజ్యవాదం తన రూపం మార్చుకుంది. వనరుల దోపిడీని వదులుకోలేదు. అసమానతలు పెరుగుతున్నాయి. మొత్తం ఆర్థిక వ్యవస్థను కొన్ని కంపెనీలు నియంత్రిస్తున్నాయి. లెనిన్ ప్రాసంగికత అందుకే వుంది. ఆ అజరామర విప్లవ దార్శనికత ప్రాసంగికత నేటికీ, ఎప్పటికీ సజీవం.

• పి.ఎస్. అజయ్ కుమార్

జాతీయ కార్యదర్శి, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం

(జనవరి 21: లెనిన్ శతవర్ధంతి)

ఎస్మా, అసలెందుకు చెప్మా?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంగన్వాడీలపై ప్రభుత్వం మరో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. ప్రజలకి అత్యవసర సేవలందించే ఉద్యోగులు ఎటువంటి సమ్మెలు చేయకుండా, ప్రజలకి ఆ సేవలు ఆగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో 1968లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం 'ఎసెన్షియల్ సర్వీసెస్ మేయింటేనన్స్ ఆక్ట్, లేదా క్లుప్తంగా 'ఎస్మా'. ఒకప్పుడు అత్యవసరంలో మంజూరై, ఇప్పుడు మానవ, పౌర హక్కులను అధిరోహిస్తున్నాయి అని విమర్శలు అందుకుంటున్న 'అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ (ప్రివెన్షన్) ఆక్ట్, 1967' (క్లుప్తంగా UAPA) మొదలైన ఎన్నో చట్టాల పక్కన ఈ ఎస్మా కూడా చేరింది. కారణం? ప్రజలని, ప్రజాస్వామ్యాన్ని, సంఘ విద్రోహకశక్తుల నుండి కాపాడాలి అని తెచ్చిన చట్టాలు... పార్టీలకి వాటి అజెండాలని ప్రజల్లో వ్యాప్తిచెందేలా చేయటానికి పనికొచ్చే ఆయుధాలుగా మారటం.

కొసమెరుపు ఏమిటంటే, ఈ చట్టం ఇప్పుడు కేంద్రంలో అమలులో లేదు. కేంద్రంలో 1968లో ఈ చట్టాన్ని అమలుపరిచినప్పుడు దానికి మూడేళ్ల 'సన్సెట్ ప్రొవిజన్'ను జోడించారు. ఇలాంటి ప్రొవిజన్ ప్రకారం, ఇచ్చిన గడువు పూర్తి అయ్యేసరికి ఆ చట్టం అంతమైపోతుంది. ఇదే చట్టాన్ని 1981లో తీసుకొస్తే, తొమ్మిదేళ్ల తరువాత అదే సన్సెట్ ప్రొవిజన్ ప్రకారం మళ్ళీ అంతమైంది. అమలులో ఉన్నన్ని రోజులు ఎస్మాలో రాష్ట్ర ప్రభుత్వాలకు చాలా స్వతంత్రం దొరికింది. చట్టం కేంద్రానిదే అయినా, ఆ రూల్స్‌ని అమలుపరిచే అధికారం రాష్ట్రాల దగ్గరే ఉండేది. దానివల్ల ప్రతి రాష్ట్రం తన సొంత ఎస్మా చట్టాన్ని చేసుకుంది. 1971లో సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పరచిన ఈ చట్టం ఏ సన్సెట్ ప్రొవిజన్ లేకుండా ఇప్పటిదాకా అమలులో ఉంది, ప్రభుత్వానికి తనదైన సహకారాన్ని అందిస్తోంది.

ఈ చట్టం ప్రకారం, 'ఎసెన్షియల్ సర్వీస్'గా పరిగణించబడే ఏ వృత్తిలో ఉన్న ఉద్యోగులనయినా ఏ కారణానికయినా సమ్మెలు చేయకుండా, వాటిని ప్రేరేపించకుండా, వాటికి ఆర్థిక సహాయం అందకుండా ఆపి, చేసిన వారిపై పెనాల్టీలు, ఉద్యోగ నిష్క్రమణ, లేదా వారెంట్ లేకుండా అరెస్ట్ చేసే అధికారం ప్రభుత్వం చేతుల్లో ఉంది. మామూలుగా ఇలాంటి చట్టాలలో ప్రభుత్వానికి కావల్సినంత విచక్షణ, స్వతంత్రం ఉంటుంది. ఉదాహరణకి, ఎస్మాలోనే సెక్షన్ 3లో సమ్మెలని నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి రావటానికి కేవలం రెండు అవసరాలు ఉన్నాయి. ఒకటి, ఆ వృత్తి 'స్పెషల్ సర్వీస్' పరిధిలోకి రావటం. రెండు, ప్రభుత్వం తన విచక్షణ ప్రకారం పబ్లిక్ సర్వీస్‌కి ఆటంకం కలుగుతుంది అని నిర్ణయించటం. అంగన్వాడీల విషయంలో వారి వృత్తి నిజానికి స్పెషల్ సర్వీస్ పరిధిలో ఎప్పుడూ లేదు. సమ్మె జరిగే పరిస్థితి కనపడగానే తక్షణం జీఓ నం.2ను జారీ చేసి ఆ వృత్తిని ఎసెన్షియల్ సర్వీస్ పరిధిలో చేర్చటం, ఆరు నెలల పాటు సమ్మె జరగకుండా తగిన ఆదేశాలు జారీ చేయటం చకచకా జరిగిపోయింది.

లేబర్ హక్కుల చిట్టా 'ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ ఆక్ట్, 1947' ప్రకారం సమ్మె అనేది మానవ హక్కు కాకపోయినా, ఒక చట్టబద్ధమైన హక్కు. యూనియన్లకి వారి సభ్యుల గొంతును పై అధికారానికి తెలియజేయడానికి పనిచేసే ఒక బలమైన సాధనం. ప్రభుత్వాలు వారి ఇష్టం కొద్ది ఒక వృత్తిని పాటించటాన్ని కష్టపరం చేయటం రాజ్యాంగరీత్యా తప్పు. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1)(జి) ప్రకారం మనుషులందరూ వారి వారి ఇష్టపరమైన వృత్తిని ఎంచుకోవచ్చు. ఈ హక్కుపై ఆర్టికల్ 19(6)లో ప్రభుత్వానికి కొన్ని సమంజస పరిమితులు పెట్టే ఆస్కారం ఉంది. కాగా, అది ఏ వృత్తికి ఎలాంటి చదువు, అర్హతలు కలిగివుండాలి లాంటి పరిమితులు పెట్టే అధికారం తప్ప మరేమీ కాదు. రాజ్యాంగ విలువలను ఉల్లంఘించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్వాడీల కనీస హక్కులను హరించటం సరికాదు. కొన్ని వందల పేద కుటుంబాలను ఆకలి, పేదరికం బారిన పడేసే ఈ దుశ్చర్య నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఒక పెద్ద మచ్చగా మిగలబోతోంది.

– గాంధీ సూర్యదేవర, అడ్వకేట్

దళితులను అణచివేసి, విగ్రహం పెడితే ఒరిగేదేమిటి?


భారత రాజ్యాంగాన్ని కాకుండా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేస్తూ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంవల్ల బడుగు, బలహీన వర్గాలకు ఒరిగేదేమిటి? రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల భద్రత గాలిలో దీపం అయింది. ఎస్సీ, ఎస్టీల హక్కులు హరించివేస్తూ వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్న రాష్ట్రంలో పెత్తందారులకు ప్రతి రూపం అయిన జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఏ విధంగా భావితరాల్లో స్ఫూర్తి నింపుతాయి?

అణగారిన బిడ్డలను సామాజిక, సాంస్కృతిక దాస్య శృంఖలాల నుంచి విముక్తం చేసేందుకు తమ జీవితాలనే ధారపోసిన అంబేడ్కర్‌ను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు విగ్రహాల పేరుతో నాటకానికి తెర లేపారు. రాష్ట్రం నడిబొడ్డున 13 జిల్లాల ప్రజలకు కేంద్ర బిందువైన ప్రజా రాజధాని అమరావతిలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టును మధ్యలో అర్థాంతరంగా నిలిపివేసి మరోచోట విగ్రహం పెట్టాల్సిన అవసరమేమిటి? వందమందిని కాటేసిన నాగుపాము శివలింగం వెనుక దాక్కున్నట్టు... ఐదేళ్లలో 300మందికి పైగా దళితుల ప్రాణాలను హరించి, ఈ రోజు అంబేడ్కర్ విగ్రహం వెనకాల దాక్కున్నట్టుంది. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టినంతమాత్రాన వందలాదిమంది దళితులను చంపిన పాపం తొలగిపోదు.

ఒక పక్కన నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ బులిపిస్తున్న జగన్‌రెడ్డి ఆ వర్గాలపై ఉక్కుపాదం మోపుతూ వారికి నరకం చూపిస్తున్నారు. ఐదేళ్లుగా దళితులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల పట్ల జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎంత దారుణంగా వ్యవహరించిందో జాతీయ నేర గణాంక సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల వారిపై దాడులు జరగని రోజంటూ లేదు. ఒక పక్క దళితులపై దమనకాండ సాగిస్తూ మరోపక్క పేదలకు, పెత్తందారులకు యుద్ధం అంటూ ముఖ్యమంత్రి పేదలను రెచ్చగొడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అనంతబాబు... దళితవర్గానికి చెందిన డ్రైవర్‌ను చంపి ఇంటికి డోర్ డెలివరీ చెయ్యడం అధికార పార్టీ దురహంకారానికి పరాకాష్ఠ. అయినా ఎమ్మెల్సీ అనంతబాబుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, అతనికి రాచమర్యాదలు చేస్తూ ముఖ్యమంత్రి తన వెంట తిప్పుకొంటూ పక్కన కూర్చోపెట్టుకొంటున్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను పెడరెక్కలు విరిచి దారుణాతిదారుణంగా వేధించి చంపేశారు. మాస్క్ పెట్టుకోలేదని మరో దళిత యువకుణ్ణి లాఠీలతో చితకబాది చంపేశారు. పులివెందులలో దళితుడి హత్య, ప్రకాశం జిల్లాలో దళిత మహిళ హనుమాయమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేసారు. ఇసుక అక్రమాలను ప్రశ్నించిన వారిని కిరాతకంగా చంపేశారు. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించిన వరప్రసాద్ అనే దళిత యువకుడిని పోలీస్ స్టేషన్‌లోనే గుండుకొట్టి అవమానించారు. సిఎం ఇంటికి కూత వేటు దూరంలో ఒక దళిత మహిళను అత్యాచారం చేసి చంపేసారు. ఇలా దళితులపై వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దాడులను గురించి రాయాలంటే ఒక పుస్తకమే అవుతుంది.

పోరాటాల ద్వారా ప్రజలు న్యాయమైన డిమాండ్లు సాధించుకోవటం ప్రజాస్వామ్యంలో ఒక భాగం. కానీ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ స్ఫూర్తిని దెబ్బతీసి దళిత వర్గాలకు తీవ్ర అన్యాయం చేసింది. అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించినంత మాత్రాన ఆశయాలు సాధించినట్లు కాదు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కును కూడా రాష్ట్రంలో అమలు చేయకుండా ప్రశ్నించినవారిపై వేధింపులకు దిగుతున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దృష్టిలో సమానత్వమంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత. కానీ రాష్ట్రంలో ఇందుకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తున్నారు. 36 రిజర్వ్ నియోజకవర్గాలపై నాలుగు కుటుంబాలకు పెత్తనం అప్పగించి రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా నడుచుకుంటున్నారు. ప్రజలు ఒక ఎమ్మెల్యేను ఎన్నుకుంటే ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో నలుగురు షాడో ఎమ్మెల్యేలు పెత్తనం చెలాయిస్తున్నారు. ఉత్తరాంధ్రను విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి; కోస్తా జిల్లాలు మిథున్‌రెడ్డి; కృష్ణా–గుంటూరును సజ్జల, ప్రకాశంను బాలినేని, రాయలసీమను పెద్దిరెడ్డి, మొత్తం సీఎంవో నుంచి సమన్వయం చేసే బాధ్యతలు ధనుంజయరెడ్డికి అప్పగించారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో జగన్‌రెడ్డి వర్గం పెత్తనమేమిటి? ప్రజలు ఎన్నుకున్న దళిత శాసనసభ్యులను కాదని జగన్‌రెడ్డి సొంత వర్గాన్ని ప్రజలపై రుద్దడమేమిటి?

బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం దేశానికే దిక్సూచి అయ్యింది. రాజ్యాంగం దేశంలోని 29 రాష్ట్రాలలో సక్రమంగా అమలవుతుంటే ఒక్క ఏపీలో దుర్వినియోగానికి గురౌతోంది. వైసీపీ పాలనలో దళితుల ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించింది, అణచివేత అధికమైంది. నాడు అంబేడ్కర్ ఇచ్చిన బోధించు, సమీకరించు, పోరాడు నినాదం నేడు రాష్ట్రానికి చాలా అవసరం. దళితులందరూ ఉమ్మడిగా జగన్ అరాచకాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.



"రాజ్యాంగం అమలు చేసేవాడు మంచివాడైతే రాజ్యాంగంలో చిన్న చిన్న లోపాలు ఉన్నా మంచి ఫలితాలనే ఇస్తుంది. అమలు చేసేవాడు చెడ్డ వాడైతే రాజ్యాంగం ఎంత మంచిదైనా అది చెడ్డ ఫలితాలనే ఇస్తుంద"ని డా. అంబేడ్కర్ రాజ్యాంగం గురించి చెప్పిన మాటలు నేటి మన రాష్ట్ర పరిస్థితికి చక్కగా సరిపోతాయి.

అనేక ఏళ్లగా ఎస్సీలకు, ఎస్టీలకు అమలవుతున్న 28 పథకాలను రద్దు చేసి వారిని దగా చేశారు. అదనంగా వారికి ఏమీ ఇవ్వకుండా అందరికీ ఇస్తున్న నవరత్న పథకాలనే ఎస్సీ, ఎస్టీలకు వర్తింపచేస్తూ, లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తూ వారిని మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 7.5 శాతం ఉన్నారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద కేటాయించే నిధులు ఆ వర్గాల వారికి అభివృద్ధికి వినియోగించాలి. ఈ వర్గాలు అధికంగా ఉన్న కాలనీలు, తండాల్లో రహదారులు, రోడ్లు, తాగునీరు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలి. యువతను పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి. గత ప్రభుత్వాలు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పేరుతో 30 శాతం నిధులు వినియోగించేవారు. కానీ జగన్ ప్రభుత్వం అందుకు భిన్నంగా ఉపప్రణాళిక నిధులను నవరత్నాల్లో భాగం చేసింది. అందరికీ ఇచ్చే ఉపకార వేతనాలు, పింఛన్లు ఉపప్రణాళికగా చూపిస్తూ మోసం చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో కూడా తీవ్ర అన్యాయం చేస్తున్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు అన్నింటికీ వైసీపీ నేతల సిఫార్సే ప్రధానమైంది. వైసీపీ పాలనలో దళితుల ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించిందే తప్ప, ఎటువంటి పురోగతీ లేదు.

బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం దేశానికే దిక్సూచి అయ్యింది. రాజ్యాంగం దేశంలోని 29 రాష్ట్రాలలో సక్రమంగా అమలవుతుంటే ఒక్క ఏపీలో దుర్వినియోగానికి గురౌతోంది. నాడు అంబేడ్కర్ ఇచ్చిన బోధించు, సమీకరించు, పోరాడు నినాదం నేడు రాష్ట్రానికి చాలా అవసరం. దళితులందరూ ఉమ్మడిగా జగన్ అరాచకాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

▪ కె.ఎస్. జవహర్

మాజీ మంత్రి



చంద్రబాబుకు సంఘీభావంగా అమరావతి రైతుల ప్లకార్డుల ప్రదర్శన





గుడివాడ గడ్డ మురిసిపోయింది. ఎటుచూసినా 'పచ్చ'దనంతో కనువిందు చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్న 'రా.. కదలిరా' బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయింది. ఈ సభ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తమ అధినేత ప్రసంగానికి అభిమానులు, కార్యకర్తలు ఈలలు, కేకలతో సంబరాలు చేసుకున్నారు. ప్రధానంగా 'నానీ'లపై రాజకీయ సెటైర్లు వేసే సమయంలో జనం ఆనందపు కేరింతలతో సభ దద్దరిల్లింది. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

దద్దరిల్లిన గుడివాడ

రా.. కదలిరా సభ భారీ సక్సెస్

- 32 ఎకరాల సువిశాల ప్రాంగణం నిండి రోడ్లపైకి జనం
- తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపిన చంద్రబాబు
- 7 నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన జనం
- పెడన నుంచి పోటెత్తిన కార్యకర్తలు, అభిమానులు
- రావికి ప్రత్యేక అభినందనలు
- రావి-రాము కాంబినేషన్‌కు హర్షాతిరేకాలు
- గుడివాడ కష్టాలు తీరుస్తా... గుడివాడ-కంకిపాడు రోడ్డును 4 లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తా : బాబు

చంద్రబాబు ప్రసంగానికి అపూర్వ స్పందన



వేదికపై టీడీపీ నేతలు వెనిగండ్ల, కొల్లు, రావి తదితరులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం మల్లయిపాలెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన సభ టీడీపీ కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచే 32 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సభాప్రాంగణానికి ప్రజలు తరలిరావడం మొదలైంది. సాయంత్రం 5 గంటల సమయానికి పూర్తిగా సభాప్రాంగణం నిండిపోయింది. 5.30కి చంద్రబాబు సభాప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో సభాప్రాంగణంలోని ప్రజల్లో ఉత్సాహం హోరెత్తింది. అభిమాన నేతను చూసేందుకు జనం పోటీ పడ్డారు. చంద్రబాబు ప్రసంగంలో గుడివాడ ప్రస్తావనను పలుమార్లు తీసుకొచ్చారు. అన్న ఎన్టీఆర్‌ను స్మరించారు. ఆ సమయంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గుడివాడ నియోజకవర్గమంటే తనకు ఎంతో ఇష్టమని, ఎన్టీఆర్ తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన ప్రాంతంలో తాను నిలబడి మాట్లాడటం తన పూర్వజన్మ సుకృతం అని చంద్రబాబు పేర్కొన్నారు. ఎందరో మహామహులు పుట్టిన తులసి వనం లాంటి గుడివాడ నియోజకవర్గంలో ఇప్పుడు గంజాయి మొక్కలు పెరుగుతుండటం బాధగా ఉందన్నారు.

స్థానిక సమస్యల ప్రస్తావన

చంద్రబాబు తన ప్రసంగంలో స్థానిక సమస్యలను ప్రస్తావించారు. వాటికి ప్రజల నుంచి స్పందన లభించింది. పామర్రు-గుడివాడ రహదారిలో ప్రమాదం జరగని రోజంటూ ఉండదని, అధికారంలోకి రాగానే రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. గుడివాడ-కంకిపాడు రహదారిని నాలుగు లైన్‌ల రహదారిగా మారుస్తానని స్పష్టం చేశారు. గుడివాడలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని, తామొచ్చాక పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి రూ.13 కోట్లు, ఇండోర్ స్టేడియం అభివృద్ధికి రూ.5కోట్లు ఇస్తే వాటిని పక్కదారి పట్టించారని, అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు.

రావి కుటుంబానికి ప్రత్యేక అభినందనలు

చంద్రబాబు తన ప్రసంగంలో రావి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రావి వెంకటేశ్వరరావు తండ్రి రావి శోభనాద్రి ఎన్టీఆర్ తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయనకు ఎలక్షన్ ఏజెంటుగా పనిచేశారని, ఆ కుటుంబం తొలి నుంచి టీడీపీ పట్ల తరగని అభిమానంతో ఉందన్నారు. రావి వెంకటేశ్వరరావు పార్టీ కోసం అంకుఠిత దీక్షతో పనిచేస్తున్నారని

- మిగతా 4లో

ఎగసిపడిన కెరటంలా..

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ వరలక్ష్మి కన్నుమూత

- వ్యాపారాన్ని వదిలేసి రాజకీయాల్లోకి అడుగిడి..
- ఒకపక్క ఆరోగ్య సమస్యలు.. మరోపక్క పార్టీ, అధికారుల నుంచి కొరవడిన సహకారం
- క్యాన్సర్‌తో పోరాడి ఓడిన మహిళా నేత



మండవ వరలక్ష్మి(ఫైల్)

నందిగామ, జనవరి 18 : నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి కన్నుమూశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె గురువారం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె రాజకీయ జీవితం ఎగసిపడిన కెరటంలా సాగింది. 2021 వరకూ వ్యాపార రంగంలో ఉన్న ఆమె కుటుంబం ఒక్కసారిగా రాజకీయాల్లోకొచ్చింది. నందిగామ మున్సిపాలిటీ ఓసీ మహిళకు రిజర్వ్ కావడంతో చైర్‌పర్సన్ పదవిని ఆశించి తన భర్త పిచ్చయ్యతో కలిసి ఆమె వైసీపీలో చేరారు. ఈ పదవి కోసం వైసీపీలో పలువురు పోటీ పడినప్పటికీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో వైసీపీ నాయకత్వం వరలక్ష్మిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించింది. మున్సిపల్ ఎన్నికల్లో ఆమె విజయం సాధించి చైర్‌పర్సన్ అయింది.

● అడుగడుగునా అడ్డంకులే..

చైర్‌పర్సన్ అయినా ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ఆమెకు అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు, వాటిని ఆసరా చేసుకొని కార్యాలయ సిబ్బంది ఆమె పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆమె మనస్తాపానికి గురయ్యారు. కమిషనర్, సిబ్బంది తన పట్ల వ్యవహరిస్తున్న తీరుపై పలుమార్లు ఆమె బహిరంగ విమర్శలు చేశారు. అటు పార్టీ నుంచి ఇటు అధికారుల నుంచి సహకారం లేకపోవడంతో ఆమె కౌన్సిల్ సమావేశాల నిర్వహణను నిలిపివేశారు.

● చైర్‌పర్సన్‌గా తప్పించేందుకు వైసీపీ ప్రయత్నం

వరలక్ష్మిని చైర్‌పర్సన్ బాధ్యతల నుంచి దింపివేసేందుకు పార్టీ నాయకత్వం పావులు కదిపింది. మున్సిపల్ చట్టంలోని కొన్ని అంశాలను ఆసరా చేసుకొని దింపేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం కొద్ది కాలానికి ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కోమాలోకి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను చండీఘడ్‌లోని ఒక వైద్యశాలకు తరలించారు. నెల రోజులపాటు కోమాలో మృత్యువుతో పోరాడిన ఆమె ఎట్టకేలకు ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారు. కొద్ది కాలం పాటు ఇంట్లోనే ఉన్న ఆమె తిరిగి విధులకు హాజరయ్యారు. మళ్లీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు కొనసాగిస్తున్నా పార్టీ నుంచీ, అధికారుల నుంచీ సహకారం అందలేదు. పలు సందర్భాలలో కౌన్సిల్ సమావేశాల్లో ఆమె కన్నీరు కూడా పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే మరో మారు ఆమె అస్వస్థతకు గురయ్యారు. ఈదఫా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను ఇంటికి తీసువెళ్లాలని వైద్యులు సూచించడంతో నందిగామ తీసుకువచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె తుదిశ్వాస విడిచారు. వేలాది మంది ప్రజలు ఆమెకు నివాళులర్పించారు.

ఆంక్షల సంకెళ్లు!

నేడు నగరంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

- ఎంజీ రోడ్డు మూసివేత

- 4లో..



రక్షణనిధి అవుట్.. స్వామిదాసు ఇన్



రక్షణనిధి



స్వామిదాసు

తిరువూరు, జనవరి 18 : తిరువూరు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధికి మొండిచెయ్యి చూపించిన వైసీపీ అధిష్ఠానం... ఇటీవలే పార్టీ తీర్థం పుచ్చుకున్న నల్లగట్ల స్వామిదాసును అభ్యర్థిగా ప్రకటించింది. గురువారం పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన నాలుగో జాబితాలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం అయిన తిరువూరు అభ్యర్థిగా ఆయన్ని ఖరారు చేసింది. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వర్గం అయిన స్వామిదాసు ఆయనతో పాటు టీడీపీని వీడి భార్య నల్లగట్ల సుధారాణితో కలిసి వైసీపీలో చేరారు. 1994 నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. తదుపరి జరిగిన ఎన్నికల్లో వరుసగా పార్టీ మూడుసార్లు సీటు ఇచ్చిన ఓటమి చెందారు. కొక్కిలిగడ్డ రక్షణనిధి చివర వరకు తిరువూరు సీటు తనదే అని హ్యాట్రిక్ సాధిస్తానని ధీమావ్యక్తం చేసేవారు. అనూహ్యంగా తిరువూరు వైసీపీ అభ్యర్థిగా అధిష్ఠానం స్వామిదాసు పేరును ఖరారు చేయడంతో రక్షణనిధి టీడీపీ లేదా జనసేన పార్టీలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయనే చర్చ నడుస్తోంది.

గుడివాడలో స్వల్ప ఉద్రిక్తత

- శాంతియుత ర్యాలీని అడ్డుకునేందుకు వైసీపీ విశ్వప్రయత్నం
- ఎన్టీఆర్ ఫ్యాన్స్ ముసుగులో అల్లరిమూకల ఆగడాలు
- టీడీపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్
- పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే రావి ఫైర్

గుడివాడ, జనవరి 18 : అన్న నందమూరి తారకరామారావు వర్ధంతి కార్యక్రమాల్లో అధికార వైసీపీ ఓవరాక్షన్, పోలీసుల అత్యుత్సాహంతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. శాంతియుతంగా టీడీపీ నిర్వహిస్తున్న ర్యాలీపైకి ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు అల్లరిమూకతో దాడికి తెగబడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో వస్తున్న టీడీపీ శ్రేణులను పార్టీ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని తొలుత స్టేడియం వద్ద ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నివాళులర్పించి స్టేడియం కార్యాలయంలోనే కూర్చున్నారు. దీంతో ఎమ్మెల్యేకు పోలీసులు యిచ్చిన సమయం మించి పోతున్నా ఏమి చేయాలో పాలుపోక పోలీసులు మిన్నకుండిపోయారు. స్థానిక బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి స్టేడియం వద్దకు ర్యాలీగా బయలుదేరిన టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. బారికేడ్లను కార్యకర్తలు తోసివేయడంతో ఒన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు లాఠీతో విరుచుకుపడ్డారు. ఎట్టకేలకు టీడీపీ ర్యాలీ ముందుకు కదిలింది.

నాని అనుచరుల అత్యుత్సాహం

టీడీపీ ర్యాలీ స్థానిక మెయిన్ రోడ్డులోని ఎన్టీఆర్ స్టేడియం మలుపు వద్దకు చేరుకోగా ఎమ్మెల్యే నాని తన అనుచరులను ర్యాలీపైకి ఉసిగొల్పారు. నాని ముఖ్య అనుచరులు వల్లూరుపల్లి సుధాకర్, గుడ్లవల్లేరు బాబ్జీ తదితరులు ర్యాలీపైకి దాడికి తెగబడేందుకు ప్రయత్నించారు. పోలీసులు వైసీపీ శ్రేణులను నిలుపుదల చేసేందుకు విశ్వప్రయత్నం చేశారు.

జెండాలతో వైసీపీ అల్లరిమూకల కవ్వింపు చర్యలు



జనసేన రంగులతో రూపొందించిన జెండా

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ముసుగులో వైసీపీ అల్లరిమూకలు నడిరోడ్డుపై డీజే పెట్టి డ్యాన్స్‌లు చేస్తూ గంటపాటు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారు. పోలీసులు వారిని నిలువరించేందుకు కూడా ప్రయత్నించలేదు. జనసేన రంగులతో సీనియర్, జూనియర్ ఎన్టీఆర్ చిత్రాలు, నాని ఫొటో ముద్రించి వైసీపీ అల్లరి మూకలు పట్టణంలో హల్‌చల్ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ మాత్రం తాము ఎటువంటి కార్యక్రమం చేపట్టలేదని ఫ్యాన్స్ పేర్కొన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

పామర్రు : దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో పాల్గొనేందుకు నిమ్మకూరు విచ్చేసిన చంద్రబాబుకు పామర్రు టీడీపీ, జనసేన ఇన్‌చార్జ్‌లు వర్లకుమార్‌రాజా, తాడిశెట్టి నరేష్, టీడీపీ నేత గొర్రెపాటి శ్రీనివాస్ చంద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్థులు, మహిళలు హారతులతో స్వాగతం పలికారు. చంద్రబాబే కాబోయే సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. గుడివాడ మల్లాయిపాలెంలో ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో చంద్రబాబుకు రాష్ట్ర, జిల్లా నేతలు అపూర్వస్వాగతం పలికారు.

17,861 మంది గృహ లబ్ధిదారులకు

రూ.2.06 కోట్ల వడ్డీ రాయితీ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 18 : నిరుపేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను మంజూరు చేయడంతో పాటు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు బ్యాంకుల నుంచి రుణ సహాయంతో పాటు పూర్తి వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. గృహ నిర్మాణాలకు రుణాలు పొందిన మహిళలకు వడ్డీ రాయితీ ఆర్థిక సహాయాన్ని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ ద్వారా వారి ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి వీక్షించిన అనంతరం జిల్లా లబ్ధిదారులకు వడ్డీ రాయితీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతకు అదనంగా ఇంటి నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేసిన వెంటనే తదుపరి నిర్మాణం కోసం ముందస్తు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 55942 మంది లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున రూ.197.08 కోట్లు రుణ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల పాల్గొన్నారు.

ఢిల్లీలో రిపబ్లిక్ వేడుకలకు జనశిక్షణ సంస్థాన్ శిక్షణార్థులు

మొగల్రాజపురం, జనవరి 18: న్యూఢిల్లీలో జరగబోయే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనడానికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ జనశిక్షణా సంస్థాన్‌లో శిక్షణ పొంది సర్టిఫికెట్లు పొందిన ఇద్దరిని ఎంపిక చేసినట్టు సంస్థాన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. గురువారం మొగల్రాజపురం కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ పీఎంకేవై 4.0లో భాగంగా శిక్షణ ఇస్తున్న 24 కోర్సుల్లో అసిస్టెంట్ బ్యూటీ కన్సల్టెంట్ కోర్సు, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందిన వి.సీత, ఇ.రమణ అనే మహిళలు ఢిల్లీ వేడుకలకు వెళుతున్నారని పరిచయం చేశారు. సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్‌కు మిథాలి చార్వి

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 18: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కోచ్‌లు షారూఖ్ అక్రమ్, ఎస్కే గౌస్ వద్ద శిక్షణ పొందుతున్న ఎ.మిథాలి చార్వి ఈనెల 20నుంచి 24వరకు మధ్యప్రదేశ్‌లో భోపాల్‌లో జరిగే యూటీటీ 85వ ఇంటర్ స్టేట్ సబ్‌జూనియర్, క్యాడెట్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఏపీటీటీఏ సెక్రటరీ పి.విశ్వనాథ్, ప్రెసిడెంట్ కేవీఎస్ ప్రకాష్, జిల్లా సెక్రటరీ కె.బలరామ్, జాయింట్ సెక్రటరీ బి.శ్రీనివాస్‌లు చార్వి, కోచ్‌ను అభినందించారు.

20, 21న ఖేలో ఇండియా ఉమెన్ స్విమ్మింగ్ పోటీలు

నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 20, 21న ఖేలో ఇండియా జూనియర్ ఉమెన్ స్విమ్మింగ్ సిరీస్ రౌండ్-1 (జోనల్ పోటీలు) జరుగుతాయని ఏపీఏఏ సెక్రటరీ ఎ.మోహన్ వెంకటరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు అండర్-15, 18 విభాగాల్లో ఫ్రీస్టయిల్ (100, 200, 400 మీటర్లు) బాక్ స్ట్రోక్ (100, 200 మీటర్లు), బ్రెస్ట్ స్ట్రోక్ (100, 200), బటర్ ఫ్లై (100, 200 మీటర్లు) వ్యక్తిగత మెడ్లీ (200 మీటర్ల)లో పోటీలుంటాయన్నారు. టాప్-5లో నిలిచిన వారికి నగదు బహుమతులుంటాయన్నారు. 20న ఉదయం 8.30 గంటలకు కలెక్టర్ ఎస్.దిల్లీరావు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్, సీపీ కాంతిరాణా ప్రారంభిస్తారన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

- గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ నివాళులు

పటమట, జనవరి 18: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారని, నాడు ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలను దేశం మొత్తం అనుసరిస్తోందని, చరిత్ర అంటే ఎన్టీఆర్‌దని గద్దె కొనియాడారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం పటమట, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు తాను కూడా అసెంబ్లీలో ఎమ్మెల్యేగా పనిచేయడం తన అదృష్టమన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి 165 సీట్లకు పైగా గెలుపొంది ప్రజలకు మంచిపాలన అందించబోతోందన్నారు. నర్రా కిషోర్, తూమాటి ప్రేమనాథ్, చెన్నుపాటి కాంతిశ్రీ గాంధీ, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు.

ఆంక్షల సంకెళ్లు!

- నేడు నగరంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం.. ట్రాఫిక్ మళ్లింపు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విధులకు వెళ్లడానికి హడావుడిగా బయటకు వస్తున్నారా? పిల్లలను స్కూల్లో దింపాలని కంగారు పడుతున్నారా? నిత్యం వెళ్లే రహదారుల్లో వెళ్తే మీరు బుక్కైపోయినట్టే. స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం కారణంగా నగరంలో శుక్రవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నగరానికి ప్రధాన రహదారుల్లో ఒకటిగా ఉన్న ఎంజీ రోడ్డును పూర్తిగా మూసివేస్తామని పోలీసులు ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఎంజీ రోడ్డులో ఎలాంటి వాహనాలను అనుమతించరు. ఉదయం 6 నుంచి భారీ వాహనాలను నగరంలోకి ప్రవేశించకుండా మళ్లిస్తారు. స్టేడియంలో సభ పూర్తయ్యేవరకు వాహనదారులకు ఇక్కట్లు తప్పవు. సభ పూర్తయిన తర్వాత అంబేడ్కర్ స్మృతివనం వద్దకు జగన్ చేరుకుంటారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత ఎంజీ రోడ్డు నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా తాడేపల్లికి జగన్ వెళ్తారు. ఈ అన్ని మార్గాల్లో ఆంక్షలు ఉన్నాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి భారీగా బస్సులు ఈ సభకు రాబోతున్నాయి. ఈ బస్సుల పార్కింగ్‌కు ఇటు తూర్పు, అటు పశ్చిమ వైపున ప్రదేశాలు కేటాయించారు. సభ పూర్తయిన తర్వాత జనమంతా ఒక్కసారిగా బయటకు వస్తారు. వాహనాలూ ఒకేసారి కదులుతాయి. దీంతో ట్రాఫిక్ పూర్తిగా ఇరుక్కుపోయే సూచనలు కనిపిస్తున్నాయి. 10 గంటల వరకు ఆంక్షలు విధించినప్పటికీ రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించిపోవడం ఖాయం. నగరంలో ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు తప్ప మిగిలిన రహదారులన్నీ ఇరుకిరుగ్గా ఉన్నాయి. ఈ ఆంక్షల ప్రభావం కరకట్టలపైనా పడుతుంది. మొత్తంగా శుక్రవారం నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నాయి.



బాబుకు చిరకానుక ఇస్తున్న వెనిగండ్ల




నిమ్మకూరులో బామ్మను పరామర్శిస్తూ..



గుడివాడ

ప్రభంజనం

- జగన్ అరాచక, రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయి
- గుడివాడలో 'రా కదలి రా' సభలో రాష్ట్ర, జిల్లా నేతలు



గుడివాడ/గుడివాడ రూరల్/నందివాడ/గుడ్లవల్లేరు : ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అవినీతి, అరాచక పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో వెనక్కు వెళ్లిందని, చంద్రబాబు వస్తేనే తిరిగి గాడిలో పడుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం గుడివాడ మల్లాయిపాలెంలో జరిగిన 'రా..కదిలిరా' బహిరంగ సభ విజయవంతమైంది. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ కనకమేడల రవీంద్ర మాట్లాడుతూ, గుడివాడలో పుట్టి, 1982లో టీడీపీని స్థాపించి తొమ్మిది నెలలు వ్యవధిలో అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో దారుణాలు, అరాచకాలతో రాక్షస పాలన సాగుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు పాలన అత్యవసరమన్నారు.

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చంద్రబాబు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి తుంగలో తొక్కాడన్నారు. టీడీపీ, జనసేనల ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు.
- మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, జగన్ అధికారంలోకి వచ్చాక బి.ఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే సందేహం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు.
- మాజీమంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం గాడిలో పడుతుందన్నారు. బడుగు, బలహీనవర్గాలు చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. గుడివాడలో రామును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.
- మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించే సమయం వచ్చిందన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రావాలన్నారు. 1982లో అన్న ఎన్టీఆర్ నాడు 'రా కదలిరా' అని పిలుపునివ్వగా ప్రజలు అఖండ విజయాన్ని అందించారన్నారు. ఇప్పుడు జగన్ నియంత పాలన అంతానికి చంద్రబాబు 'రా కదలిరా' పిలుపునకు ప్రజలు కదలిరావాలని కోరారు.
- జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రాము మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రులకు బూతులు తిట్టడం తప్ప ఏమీ తెలియదన్నారు. గుట్కా నాని ప్రజల కష్టాల గురించి ఏనాడైనా మాట్లాడారా లని ప్రశ్నించారు. ఓటుతో జగన్‌ను నేలమట్టం చేద్దామని పిలుపునిచ్చారు.
- మచిలీపట్నం ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి అభివృద్ధి చేయకుండా అప్పులు చేయడమే పనిగా పెట్టుకున్నాడని, జగన్‌ను సాగనంపే రోజు దగ్గరకు వచ్చాయన్నారు.
- గన్నవరం ఇన్‌చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నీ కోసం జీవిస్తే నీ కుటుంబంలో నిలుస్తావని, ప్రజల కోసం జీవిస్తే వారి గుండెల్లో గుర్తుంటావని అంబేడ్కర్ అన్నారని.. చంద్రబాబు జైలులో ఉంటే జనసేన అధినేత పవన్ కలిసి పని చేద్దామని ముందుకొచ్చారన్నారు.
- పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సకాలంలో నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆదుకునేందుకు ముందుకు రాలేదని ఆరోపించారు.
- గుడివాడ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, టీడీపీ, జనసేనలు ఏ కార్యక్రమం చేపట్టిన బూతుల నాని ఆటంకాలను సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. వాటిని అంతే స్థాయిలో తిప్పికొడుతున్నామన్నారు.
- మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అన్ని వర్గాలకు ఇబ్బంది పెడుతున్న జగన్ పాలన అంతం అవ్వాలన్నారు. 30నెలలు మంత్రిగా ఉండి కూడా పైసా అభివృద్ధి కూడా చేయలేని వ్యక్తిగా గుడివాడ చరిత్రలో నాని నిలిచాడన్నారు.
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము మాట్లాడుతూ, జనప్రభంజనాన్ని చూసి నానికి వణుకు మొదలైందన్నారు. చంద్రబాబు సభకు 5వేల కంటే ఎక్కువ వస్తే సర్దుకుంటానని చెప్పాడని, ఎప్పుడు తట్టా బుట్టా సర్దుకుంటావో చెప్పాలన్నారు. ఎన్‌టీఆర్ వర్ధంతికి ఆటంకాలు సృష్టించడమే పనిగా పెట్టుకుని, 30మంది పోలీసులు దండ వేయకుండా ఆపాలని చూశాడన్నారు. బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదని, దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు.
- మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖాజావలీ, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్, జలీల్‌ఖాన్, విజయవాడ పార్లమెంట్ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని), గుడివాడ అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు నాగుల్‌మీరా, వీరంకి గురుమూర్తి, పిల్లి మాణిక్యాలరావు, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిస్వర్ణ హ్యూండాయ్‌లో కొత్త క్రెటా కారు విడుదల



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న జనాబ్ కరీముల్లా షరీఫ్

వన్‌టౌన్, జనవరి 18: భారతదేశ ఆటోమొబైల్ దిగ్గజం హ్యూండాయ్ కంపెనీ నూతనంగా ఆధునీకరించి, ప్రవేశపెట్టిన హ్యూండాయ్ క్రెటా కారును గురువారం రామవరప్పాడులోని హ్యూండాయ్ అధీకృత డీలర్ సాయిస్వర్ణ హ్యూండాయ్ షోరూమ్ నుంచి మార్కెట్‌లోకి విడుదల చేసింది. ముఖ్య అతిథిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జనాబ్ కరీముల్లా షరీఫ్ పాల్గొని కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో క్రెటా కారు విశేష ఆదరణ పొందిందని, ఆధునీకరించిన కారు కస్టమర్ల ఆదరాభిమానాలను చూరగొంటుందని తెలుపుతూ షోరూమ్ నిర్వాహకులకు శుభాభినందనలు తెలిపారు. సాయిస్వర్ణ జీఎం భగత్‌సింగ్ మాట్లాడుతూ నూతన క్రెటా కారుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అసమాన్యమైన భద్రతా ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్లు, మూడు రకాల ఇంజన్లలో తయారు చేశారని, ఇందులో 360 డిగ్రీల కెమెరా, 52 అడాబ్ ఫీచర్స్ ఉన్నాయన్నారు. ఆకర్షణీయమైన 6 మోనో-టోన్, 1 డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తుందన్నారు. ఈ నూతన క్రెటా కారు రూ.10,99,900 (ఎక్స్ షోరూమ్) నుంచి లభిస్తుందన్నారు. టెస్ట్‌డ్రైవ్, బుకింగ్స్ కోసం సాయిస్వర్ణ షోరూమ్‌ను సంప్రదించాలని కోరారు. కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశానికే మణి దీపం..

అంబేడ్కర్

- కాంస్య విగ్రహావిష్కరణలో ప్రజా సహకారం అవసరం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు, సీపీ కాంతి రాణా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు, సీపీ కాంతిరాణా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృష్ణలంక) : దేశ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుని జ్ఞాపకాన్ని విగ్రహ రూపంలో ఎన్టీఆర్ జిల్లాలో ప్రతిష్ఠించడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు, పోలీసు కమిషనర్ కాంతి రాణాలు అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కానున్న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వస్తున్న లక్షన్నర మంది ప్రజలకు ఆతిథ్యం ఇవ్వడం మన బాధ్యత కాబట్టి ఈ క్రమంలో ఎదురయ్యే చిన్న చిన్న ఇబ్బందులను నగర ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి 120 మెట్రిక్ టన్నుల కాంస్యం, తయారీకి 400 మెట్రిక్ టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగించారని, స్మృతివనం ప్రహరీ చుట్టూ 2,200 మెట్రిక్ టన్నుల రాజస్థాన్ పింక్ ఇసుక రాయిని ఉపయోగించారన్నారు. ఈ అద్భుతమైన విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయనున్నారని వివరించారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాల రాకపోకల్లో కొన్ని మార్పులు చేసినట్టు పేర్కొన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా వాహనదారులు ప్రయాణ మార్గాన్ని మార్చుకోవాలని సూచించారు. పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ, నగరంలోనికి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి భారీ వాహనాలకు ప్రవేశం వుండదన్నారు. ఇందుకు అనుగుణంగా చేపట్టిన మార్పులను వివరించారు. నగర శివార్లలో పోలీసు సిబ్బంది సూచనల మేరకు వాహన చోదకులు తమ తమ మార్గాన్ని నిర్దేశించుకోవాలని పోలీసు కమిషనర్ కోరారు.

విగ్రహావిష్కరణకు 2626 బస్సుల వినియోగం

- భారీగా స్కూల్ బస్సులు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా జనాలను తరలించేందుకు 2626 బస్సులను ప్రభుత్వం వినియోగిస్తోంది. వాటిలో 600 ప్రైవేటు, స్కూల్ బస్సులు ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లా నుంచి అత్యధికంగా 440 ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం తీసుకుంది. ప్రైవేటు, స్కూల్ బస్సులు 600 ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచే సమీకరిస్తున్నారు. విజయవాడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)కి బస్సుల సేకరణ బాధ్యత అప్పగించారు. ప్రైవేటు బస్సులు 100, మిగిలినవన్నీ పాఠశాల బస్సులను తీసుకుంటున్నారు. ఇప్పటికే పాఠశాలల యాజమాన్యాలకు అధికారులు సమాచారాన్ని అందించారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించే సభకు లక్ష మందికి పైగా జనసమీకరణ చేస్తున్నారు.

సమ్మెను విరమింపజేయాలి

- పలువురు వక్తలు

ధర్నాచౌక్, జనవరి 18 : అంగన్వాడీలకు వేతనాలను పెంచి నిరవధిక సమ్మెను విరమింపజేయాలని పలు సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన నిరవధిక నిరహారదీక్ష రెండోరోజు గురువారం కొనసాగింది. అంగన్వాడీల కనీస డిమాండ్ పరిష్కరించడం అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం అవుతుందన్నారు. శిబిరాన్ని పలు కార్మిక సంఘాల నేతలు సందర్శించి తమ సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విగ్రహావిష్కరణలతో మహనీయుల ఆశయాలు నెరవేరవన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం ప్రకారం కనీస హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అణచివేత తగదన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, మహిళా సంఘం, వ్యవసాయ సంఘం నేతలు ఉమామహేశ్వరరావు, ఆంధ్ర మల్యాద్రి, వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, శ్రీదేవీ తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన గుడివాడ

(3వ పేజీ తరువాయి)

ప్రశంసించారు. రావి, రాములను సమన్వయపరచి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ప్రజలు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

కొడాలిపై విసుర్లకు జనం హర్షాతిరేకాలు

చంద్రబాబు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని గురించి మాట్లాడిన ప్రతిసారి ప్రజల నుంచి భారీ స్థాయిలో స్పందన వచ్చింది. నాని చేసిన అభివృద్ధి నిల్- అవినీతి ఫుల్ అని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు జనం ఈలలు వేశారు.

పెడన నుంచి భారీ జనసమీకరణ

పెడన నియోజకవర్గం నుంచి టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణ ప్రసాద్‌ను సమన్వయం చేసుకుంటూ 'రా కదలిరా' సభకు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన కేశినేని చిన్ని జన సమీకరణలో సక్సెస్ అయ్యారు. పెడన నుంచి సుమారు 50 బస్సులు.. 100కుపైగా కార్లలో జనం తరలివచ్చారు. వీరితోపాటు పలువరు స్వచ్ఛందంగా హాజరయ్యారు.

వైసీపీ ఎమ్మెల్యేలపై విసుర్లు

చంద్రబాబు తన ప్రసంగంలో మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యేలపై విసుర్లు విసిరారు. ముఖ్యంగా కొడాలి నానితోపాటు పేర్ని నాని, జోగి రమేశ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు జనాల్లో విపరీతమైన స్పందన తీసుకొచ్చాయి. నానిలనుద్దేశించి.. ఇక్కడేమో బూతుల మంత్రి.. అక్కడేమో నీతుల మంత్రి అంటూ చేసిన వ్యాఖ్యతో జనాలు ఈలలు.. చప్పట్లతో తమ ఆనందం వెలిబుచ్చారు. ఆయా ఎమ్మెల్యేలు ఏయే అవినీతి పనులు చేశారో చంద్రబాబు సవివరంగా తన ప్రసంగంలో ప్రస్తావించడంతో జనాలు అరుపులు కేకలతో స్వాగతించారు. మొత్తం మీద చంద్రబాబు చేసిన ప్రసంగం గత సభల కన్నా భిన్నంగా ఉందని పలువురు టీడీపీ అభిమానులు అభిప్రాయపడ్డారు. సమయపాలన విషయంలోనూ చంద్రబాబు ఈసారి బాగా మారిపోయారని వారు వ్యాఖ్యానించడం గమనార్హం. కేవలం అరగంట తేడాతో చంద్రబాబు సభా కార్యక్రమం ముగిసింది. గతంలో అయితే గంటల గంటల తేడాతో ఆయన కార్యక్రమం సాగేదని వారు గుర్తు చేసుకున్నారు.



కాకాని కల్యాణ మండపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

ఎన్టీఆర్ కృషితోనే పాడి రైతులకు ఆర్థిక సాధికారత

- విజయ డెయిరీ చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్, జనవరి 18 : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పాడి రైతులకు మ్యాక్స్ చట్టం ద్వారా ఆర్థిక సాధికారత అందించిన ఘనత దివంగత నేత ఎన్టీ రామారావుకు దక్కుతుందని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మిల్క్ చిల్లింగ్ సెంటర్ ఆధ్వర్యంలోని కాకాని కల్యాణ మండపంలో ఎన్టీఆర్ విగ్రహానికి చలసాని పూల మాలవేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ విగ్రహంతో పాటు కాకాని వెంకటరత్నం విగ్రహానికి పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాడి రైతులకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పాడి పశువులు పెంపకం మీద జీవనం సాగించే రైతులకు ఎన్టీఆర్ తెచ్చిన మ్యాక్స్ చట్టం జీవన స్థితిగతులను మార్చి వేసిందన్నారు. అటువంటి ఎన్టీఆర్ మహనీయుడిగా చిరస్మరణీయుడుగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ మిల్క్ సెంటర్ మేనేజర్ కిరణ్‌కుమార్, ట్రస్టు సభ్యులు పిన్నిమనేనిలక్ష్మీ ప్రసాద్,పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల అధ్యక్షులు కొల్లిరంగారావు,లింగం శ్రీధర్,ఎనికేపల్లి శ్రీమన్నారాయణ, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

పటమట, జనవరి 18: తెలుగు వారు ఆత్మ గౌరవంతో తలెత్తుకోగలుగుతున్నామంటే దానికి కారకులైన వారిలో ఎన్టీ రామారావు కూడా ఒకరని, అందుకే ఎన్టీఆర్‌ను ప్రజలు తమ గుండెల్లో పెట్టుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి పురస్కరించుకుని, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె ఘననివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని ఒక ప్రభంజనమన్నారు. ఆకలితో అలమటిస్తున్న ఎందరో పేదల్ని రూపాయికి కిలో బియ్యంతో ఆదుకుని వారి కడుపు నింపారని కొనియాడారు. గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్, బాజీ రమేష్ నాయుడు, పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పథకాల అమలు టీడీపీతోనే సాధ్యం

- ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



గవర్నర్‌పేట, జనవరి 18: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే ఎన్టీఆర్ సంక్షేమ పథకాలు పేదలకందుతాయని, రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్, 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి కోరారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యారావుపేటలోని 23వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద బాలస్వామి నేతృత్వంలో నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు, మాజీ కార్పొరేటర్ సొంగా రవీంద్ర, అస్లాం, వసంతకుమార్, కృష్ణ, కొండా, రత్న పాల్గొన్నారు.

23 నుంచి ఉచిత కుట్టు శిక్షణ

ఆటోనగర్(పెనమలూరు): స్థానిక వందడుగుల రోడ్డులోని కమల ఆర్ట్ క్రాఫ్ట్ శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు మెస్సీయా ఫెలోషిప్ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. ఉదయం 11గంటలకు క్లాసులు ప్రారంభమవుతాయన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న శివనాథ్, పోతిన


నివాళి అర్పిస్తున్న నెట్టెం తదితరులు


చీరలు పంపిణీ చేస్తున్న బేగ్


చలసాని నివాళి


ఊర్మిళానగర్‌లో..

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

- ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి
- అన్నదానాలు, పండ్లు పంపిణీ
- మహిళలకు చీరలు పంపిణీ

విద్యాధరపురం, జనవరి 18: పేద ప్రజల సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆద్యుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి కార్యక్రమంలో నెట్టెం రఘురామ్ తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, నాయకులు గన్నే నారాయణ ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● 40వ డివిజన్ భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్నసుబ్బయ్య ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. కేశినేని శివనాథ్ భోజనాలు వడ్డించారు. బుద్దా వెంకన్న, దేవినేని ఉమామహేశ్వరరావు, నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, జనసేన నాయకుడు పోతిన మహేశ్ పాల్గొన్నారు. ● ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో పశ్చిమ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. 37వ డివిజన్‌లో రమణయ్య కూల్ డ్రింక్ షాపు వద్ద డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సుదర్శన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

భవానీపురం: పశ్చిమ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కుప్పిలి నాగబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ 250 మంది మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ● టీడీ పీ సీనియర్ నాయకులు పేరం సత్యనారాయణ ఆధ్వర్యంలో సితార సెంటర్‌లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కేశినేని శివనాథ్(చిన్ని), మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, కె.రవీంద్ర, తుపాకుల రమణమ్మ, కామా దేవరాజ్‌లు పాల్గొని అందజేశారు. ● 43వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో ఊర్మిళానగర్‌లో పేదలకు భారీ అన్నదానం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ నాయకులు నాగూల్ మీరాలు ప్రారంభించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జోజినగర్ చర్చి సెంటర్‌లో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి షేక్ గాలిబ్ షహీద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నివాళి అర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

పాలఫ్యాక్టరీలో...

చిట్టినగర్: పాలఫ్యాక్టరీలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు డైరెక్టర్లతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి, సమితి అధికారులు పాల్గొన్నారు. ● 48వ డివిజన్ అధ్యక్షుడు పేరా బత్తుల రమణ ఆధ్వర్యంలో సొరంగం రోడ్డులో టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా పలువురు టీడీపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కె.రవీంద్ర పాల్గొన్నారు. 46వ డివిజన్‌లో టీడీపీ నాయకులు కాండ్రేగుల రవీంద్ర, గుర్రం కొండ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చీరలు పంపిణీ చేశారు. ● 47వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇతర పార్టీల నుంచి పలువురు టీడీపీలో చేరారు. వారికి ఎంఎస్ బేగ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.


కూరగాయలు పంపిణీ చేస్తున్న గద్దె , గన్నె


పండ్లు పంపిణీ చేస్తున్న బొండా ఉమా


23వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద ..

మహనీయుడు ఎన్టీఆర్

రాణిగారితోట, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి కార్యక్రమాన్ని 17,18 డివిజన్ల టీడీపీ కమిటీల ఆధ్వర్యంలో రాణిగారితోట మెయిన్ రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పెట్టినప్పుడు కాని, ఎన్నికల సమయంలో గాని ఎజెండాలు ప్రకటిస్తారని దానిపై మీడియా ఎన్టీఆర్ ఎజెండా ఏమిటని అడిగితే కూడు, గూడూ, గుడ్డ అనే మూడు నినాదాలు అని చెప్పి అప్పటి పరిస్థితుల్లో ప్రజలకు ఏమి కావాలో చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 17,18 డివిజన్ల టీడీపీ అధ్యక్షులు రాయి రంగమ్మ, దుర్గారావు, తిరుపతయ్య, పీరుబాబు, సునాబీ పాల్గొన్నారు.

మాచవరం: 6వ డివిజన్ గులామొహిద్దీన్ నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె నారాయణ ప్రసాద్‌లు ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కూరగాయలు పంపిణీ చేశారు.

అజిత్‌సింగ్‌నగర్: ఫైపులరోడ్డు సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద దాసరి కనకారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్‌లు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు పరుచూరి ప్రసాద్, ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు. **పాయకాపురం:** సుందరయ్యనగర్ సెంటర్‌లో 62వ డివిజన్ ఇన్‌చార్జ్ పైడి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. ● 63వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు లబ్బా వైకుంఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొండా ఉమా ఎన్టీఆర్ విగ్రహా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. ● 64వ డివిజన్ కండ్రికలో డివిజన్ ఇన్‌చార్జ్ పలగాని శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొండా ఉమా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సత్యనారాయణపురం: దుర్గాపురం సాంబమూర్తిరోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 27వ డివిజన్ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బొండా ఉమామహేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎన్.సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు కె.ఆర్.కుమార్ పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంక 20వ డివిజన్ రణదీవెనగర్ కట్టపై ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుండు శ్రీను, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోటేపల్లి చిన్నా, నాయకులు కొడాలి సాయిబాబు, చింతా వెంకటేశ్వర్లు, వన్నెంరెడ్డి రాధాకృష్ణ, ఆదాపా శివ, పోదూరి పవన్, పి.లక్ష్మి, యేసు, శేఖర్ పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: సూర్యారావుపేటలోని 23వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి నేతృత్వంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

మధురానగర్: మధురానగర్ 29వ డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో మధురానగర్ మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు, ఆశా వర్కర్‌లకు పండ్లు పంపిణీ చేశారు.

భారతీనగర్: రమేష్‌బాబు ఆసుపత్రి సమీపంలోని నాల్గవ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు కార్యాలయం వద్ద సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వడ్లపట్ల గోపాలకృష్ణ, కొనసాగి నాగమణి, నాయకులు పాల్గొన్నారు. ● ఆర్టీసీ కాలనీలో విజయవాడ అర్బన్ టీడీపీ మాజీ ప్రెసిడెంట్ కేవీపీ బసవేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు గోగినేని ధనశేఖర్, ధనికుల రామకాశేశ్వరరావు, ఎం.సంపత్, అనుమల సురేష్, పాల్గొన్నారు.

గుణదల: 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, సీనియర్ నాయకుడు కంచర్ల రాములు స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాతరాజరాజేశ్వరి పేట : 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరి పేట ర్యాంపు వద్ద రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ధనేకుల వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎస్. బేగ్ ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేపట్టారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

అజిత్‌సింగ్‌నగర్: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి. ఝాన్సీ డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో పైపులరోడ్డు సెంటర్ వద్ద గురువారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జి. ఝాన్సీ మాట్లాడుతూ గత 38 రోజు లుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

21న ఉచిత వైద్య శిబిరం

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 18: లయన్స్ క్లబ్ విజయవాడ, ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో భవానీపురం, నేషనల్ హైవే ప్రాంతంలో ఈనెల 21న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పీవీ నారాయణరావు, నర్సింగ్ హోమ్ ఫౌండర్ కోలా కోటేశ్వరరావులు తెలియజేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు కోలా విజయశేఖర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలతో పాటు, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గ్లకోమ ఉన్న వారికి కంటి రెటీనాలో జరుగు మార్పులను ప్రత్యేక మిషన్ ద్వారా పరీక్షించి, వ్యాధి నిర్ధారణ చేసి సూచనలు ఇస్తారని చెప్పారు. స్త్రీలు, చిన్న పిల్లల సంబంధిత వ్యాధులు, ఏ ఇతర వ్యాధులు ఉన్న వారికైనా డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి రూ. రెండు వేలు విలువగల డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిద్ధార్థలో ప్రాంగణ ఎంపికలు

లబ్బీపేట: కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలలో 9మంది విద్యార్థినులు ఎంపికైనట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. కళాశాలలో టీసీఎస్ బిజినెస్ ప్రాసెస్ సర్వీస్ నిర్వహించిన ఈ ఎంపికల్లో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న బీకామ్, బీకామ్(హానర్స్), బీబీఏకు చెందిన 9 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల యాజమాన్యం, డైరెక్టర్ టి.విజయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

ధనుష్, నాగార్జున కలయికలో...



విలక్షణ నటుడు ధనుష్, టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున కలయికలో ఓ భారీ మల్టీస్టారర్ రూపొందుతోంది. ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సోనాలీ నారంగ్ సమర్పకులు. గురువారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా చిత్రీకరణ ప్రారంభించారు. ధనుష్‌పై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

అన్ని హంగులతో భైరవకోన

సందీప్ కిషన్



ఫిబ్రవరి 9న దెయ్యాలూ, భూతాలూ, మ్యాజిక్కు, మంచి హ్యూమర్, పాటలు, బోలెడంత యాక్షన్ ఉన్న చిత్రాన్ని ప్రేక్షకులు చూడబోతున్నారు. 'ఊరు పేరు భైరవకోన' చిత్రం ఇలా వాణిజ్య హంగులు, చక్కని వినోదంతో ముస్తాబైంది' అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన చిత్రమిది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. గురువారం చిత్రబృందం ట్రైలర్ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ 'రెండున్నరేళ్ల పాటు బాధ్యతగా ఈ చిత్రం కోసం పని చేశాం. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తాం. 'నిజమేనే చెబుతున్నా' పాటను ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ "ఊరుపేరు భైరవకోన' నా కెరీర్‌లో ఛాలెంజింగ్ ప్రాజెక్ట్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని, ఎక్సయిట్‌మెంట్‌ను ఇస్తుంది' అని తెలిపారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'మంచి ప్రేమకథ, ఫాంటసీ, కామెడీ, యాక్షన్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని తెలిపారు.

వారిద్దరికీ మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది

- నందమూరి మోహనకృష్ణ



ఎన్టీఆర్ మన మధ్య లేకపోయినా ఆయన ఆశీస్సులు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. వజ్రాన్ని కూడా సాన పట్టాలి .అలా 'మనదేశం' సినిమాలో నాన్నగారికి అవకాశం ఇచ్చి నటుడిగా మెరుగులు దిద్దిన దర్శకుడు ఎల్వీ ప్రసాద్‌గారికీ, నిర్మాత కృష్ణవేణిగారికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది' అన్నారు నందమూరి మోహనకృష్ణ. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన నటించిన తొలి చిత్రం 'మనదేశం' చిత్రం 75 వసంతాల వేడుకలు గురువారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగాయి. ఎన్టీఆర్ సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ తనయుడు రమేశ్‌ప్రసాద్, ఆ చిత్రాన్ని పంపిణీ చేసిన పూర్ణా పిక్చర్స్ అధినేత విశ్వనాథ్‌లను సత్కరించారు. సెలబ్రేషన్స్ కమిటీ ఛైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ 'నలభై ఏళ్ల తర్వాత దేశానికి ఎలాంటి అవసరాలు ఉంటాయో ఊహించి ముందే చెప్పిన గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు ఎన్టీఆర్. నటుడిగా ఆయన గొప్పతనం గురించి ప్రపంచ ప్రజలందరికీ తెలుసు' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఆదిశేషగిరిరావు, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, హైదరాబాద్ మింట్ తరఫున శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

మానవ విసర్జక వ్యవస్థ

ఏపీపీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ



మూత్రం ఏర్పడే విధానం

మూత్రపిండంలో మూత్రం ఏర్పడే విధానాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అవి.. సూక్ష్మగాలనం, నాళికాయుత పునఃశోషణ, నాళికా స్రావం.

సూక్ష్మగాలనం: మొదటి దశలో రక్త నాళికాగుచ్ఛంలో ఉండే రక్తం వడపోతకు గురై బౌమన్స్ గుళికలోకి చేరుతుంది. ఈ విధానాన్నే సూక్ష్మగాలనం లేదా రక్తనాళికా గుచ్ఛగాలనం అంటారు. అభివాహి ధమనిక కలిగించే పీడనం వలన రక్త కేశ నాళికాగుచ్ఛంలోకి వడపోతకు గురైన రక్తం చేరుతుంది. గుచ్ఛగాలనం ద్వారా ఏర్పడిన ద్రవాన్ని గాలిత ద్రవం లేదా ప్రాథమిక మూత్రం అంటారు. ప్రాథమిక మూత్రంలో వ్యర్థ పదార్థాలు, పోషకపదార్థాలు, నీరు ఉంటాయి. ప్రాథమిక మూత్రం రసాయనికంగా రక్తంతో సమానం. దీనిలో కణాలు ఉండవు. ఆరోగ్యవంతమైన మానవుడిలో నిమిషానికి దాదాపు 125 మి.లీ. ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది.

నాళికాయుత పునఃశోషణ: దీనినే వరణాత్మక పునఃశోషణ అంటారు. ఈ దశ సమీపస్థ సంవళిత నాళికకు, వ్యాసారెక్టాకు మధ్య జరుగుతుంది. సమీపస్థ సంవళిత నాళికకు మరోపేరు పూర్వ సంవళిత నాళిక. వ్యాసారెక్టా అంటే నెఫ్రాన్ నాళిక చుట్టూ విస్తరించి ఉండే వల లాంటి రక్త కేశ నాళికల సమూహం. దీనిని పరినాళికా రక్త కేశ నాళికలు అంటారు. ప్రాథమిక మూత్రం సమీపస్థ సంవళిత నాళాన్ని చేరినప్పుడు 75 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది. ప్రాథమిక మూత్రంలో ఉపయోగ పదార్థాలైన గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, కాల్షియం, సోడియం క్లోరైడ్ మొదలైనవి సమీపస్థ సంవళిత నుంచి వ్యాసారెక్టాలోకి శోషింపబడతాయి.

నాళికా స్రావం: ఈ దశ వ్యాసారెక్టాకు, దూరాగ్ర సంవళిత నాళానికి మధ్య జరుగుతుంది. సమీప సంవళిత నాళంలో పునఃశోషణ తరవాత మూత్రం హెన్లీశిక్యం ద్వారా దూరాగ్ర సంవళితనాళంలోకి చేరుతుంది. వ్యాసారెక్టా నుంచి దూరాగ్ర సంవళితనాళంలోకి ప్రవేశించిన పదార్థాలు యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్, సోడియం, పొటాషియం, క్లోరైడ్, హైడ్రోజన్ అయాన్లు మూత్ర గాఢతను, pHను నియంత్రిస్తాయి. ఈ విధంగా అధిక గాఢత గల మూత్రం ఏర్పాటులో హెన్లీ శిక్యం, సంగ్రహణ నాళాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. హెన్లీశిక్యం ప్రాంతంలో ఉన్న మూత్రం నుంచి 10 శాతం నీరు ద్రవాభిసరణ ద్వారా దానిని ఆవరించి ఉన్న కణజాలంలోకి శోషింపబడుతుంది. సంగ్రహణ నాళంలో వాసోప్రెస్సిన్ హార్మోన్ సహాయంతో నీటి పునఃశోషణ జరిగి మూత్రం అతి గాఢతను పొందుతుంది. గాఢతలో గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ద్రవమే మూత్రం. రక్తం కంటే మూత్రం అధిక గాఢతలో ఉంటుంది.

మూత్ర పిండం మార్పిడి

దీర్ఘకాలికంగా కిడ్నీలు పనిచేయని వారికి మూత్రపిండ మార్పిడి ప్రక్రియను చేపడతారు. 1954లో చార్లెస్ హాఫ్‌నగెల్(అమెరికా) అనే వైద్యుడు మొట్ట మొదట మూత్ర పిండ మార్పిడికి రూపకల్పన చేశాడు. మనదేశంలో 1971 డిసెంబరు 1 వేలూరు(తమిళనాడు)లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

మూత్ర సంఘటన

ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతి రోజూ 1 నుంచి 1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. దీనితోపాటు 25 నుంచి 30 గ్రాముల యూరియా కూడా విసర్జితమవుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం కారణంగా మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. యూరియా విచ్ఛిన్నం చెంది అమ్మోనియా ఏర్పడటం వలన మూత్రం మొదట ఆమ్లయుతంగా(pH=6.0) ఉన్నప్పటికీ క్రమంగా క్షారయుతంగా మారుతుంది. మూత్రంలో 96 శాతం నీరు, 2.5 శాతం కర్బన పదార్థాలు(ఆక్సలేట్స్, హార్మోన్స్, యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్ నీటిలో కలిగే విటమిన్స్), 1.5% అకర్బన పదార్థాలు(అయోడిన్, మెగ్నీషియం, క్లోరైడ్, కాల్షియం, సోడియం, ఫాస్ఫేట్, సల్ఫేట్) మొదలైన పదార్థాలు ఉంటాయి. 24 గంటల మూత్ర పరీక్ష అంటే...ఒక వ్యక్తి నుంచి 24 గంటలలో సేకరించిన మొత్తం మూత్రంలో నుంచి 100-15 మి.లీ. మూత్రాన్ని నమూనాగా తీసుకొని పరీక్షిస్తారు. ప్రోటీన్లు అధికంగా తీసుకుంటే మూత్రంలో యూరియా అధికంగా, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే చక్కెరలు ఎక్కువగా ఉంటాయి.

కృత్రిమ మూత్రపిండం

డాక్టర్ విలియం కాఫ్‌ను డయాలసిస్ పితామహుడిగా పిలుస్తారు. మానవుడి మూత్ర పిండాలు పనిచేయని స్థితిలో రక్తాన్ని వడపోయడానికి తోడ్పడే యంత్రమే కృత్రిమ మూత్రపిండం లేదా డయలైజర్. ఈ పద్ధతిని హీమోడయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని ధమని నుంచి తీసి సిర ద్వారా ఎక్కిస్తారు. దీనికి దాదాపు మూడు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలోని డయలైజర్ పరికరంలో వడపోతకు అనుకూలంగా ఉండే సెల్లోఫేన్‌తో తయారైన గొట్టాలను వాడుతారు. హెపారిన్, ఆంటిహెపారిన్‌ను ఉపయోగిస్తారు. హెపారిన్ అనేది రక్తంలో యాంటికొయాగ్యులెంట్‌గా పనిచేస్తుంది. ఈ ప్రక్రియ యురేమియా వ్యాధిగ్రస్తులకు ఒక వరం లాంటిది. యూరేమియా అంటే మూత్ర పిండాలు సరిగా పనిచేయని వారి శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోయే దశ. ఈఎస్ఆర్‌డి(ఎండ్ స్టేజ్ రెనాల్ డిసీజ్) అంటే మూత్ర పిండాలు పనిచేయక పోవడమని అర్థం.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

నిట్ సూరత్‌కల్‌లో ఎంబీఏ

సూరత్‌కల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (నిట్ కే) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** www.nitk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Qg6kumVలో చదవండి.



నివేదన



అయోధ్యలో భవ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠకు దేశమంతా సంసిద్ధమవుతోంది. రామమందిర ఉద్యమంలో ఒక దశలో కంచిమఠం ప్రధానపాత్ర పోషించింది. అయోధ్యతో కంచికి ఉన్న సంబంధం గురించి, భవిష్యత్తులో ధర్మప్రచారం ఎలా సాగాలనే విషయం గురించి కంచిపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి 'నవ్య'తో సంభాషించారు.

అయోధ్య కథ కంచికి... ఇది మన మంచికే!

"అయోధ్యతో మాకు రెండు రకాలుగా సంబంధం ఉంది. ఒకటి క్షేత్ర సంబంధం. రెండోది ఉద్యమ సంబంధం. 1980లలో రామమందిర ఉద్యమ సమయంలో జయేంద్ర సరస్వతి స్వామి వారు ఉత్తరదేశ యాత్రలో ఉన్నారు. ఆ సమయంలో నేను పరమాచార్యులవారి వద్ద ఉన్నా. అప్పుడు ఇరు పక్షాలకు సంబంధించిన అనేక మంది పరమాచార్యను వచ్చి కలుస్తూ ఉండేవారు. శిలన్యాస్ సమయంలో పరమాచార్య కొన్ని ఇటుకలను పూజించి అయోధ్యకు పంపారు. ఆ తరువాతి కాలంలో జయేంద్ర సరస్వతి స్వామి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సుబ్రహ్మణ్య స్వామి, జార్జి ఫెర్నాండెజ్‌తో సహా అనేక మంది రాజకీయనాయకులు, అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు కార్యదర్శి పి.వి.ఎస్.కె. ప్రసాద్, వీహెచ్‌పీ అధ్యక్షుడు అశోక్‌సింఘాల్ తదితరులు వచ్చి... మహాస్వామితో పరిష్కారం కోసం చర్చలు జరుపుతూ ఉండేవారు. ఇక 1997లో అనుకుంటా... మేము కాశ్మీర్ యాత్రకు వెళ్లాం. ఆ సమయంలో అయోధ్యలో కొన్ని రోజులు ఉన్నాం. అప్పుడు రామ్‌లాలా (శ్రీరాముని విగ్రహం) తాత్కాలికంగా వేసిన టెంట్‌లో ఉండేవారు. 'ఆయన భక్తులు అందరూ ఇళ్లు కట్టుకుంటున్నారు. ఆయనకు మాత్రం తాత్కాలిక నివాసమా?ఆయనకు కూడా ఒక గొప్ప ఇల్లు ఉంటే ఎంత బావుంటుంది?' అనే ఆలోచన కలిగింది. ఇప్పుడు ఆ ఆలోచన సాకారమై... ఒక గొప్ప దేవాలయం నిర్మాణమైనందుకు ఆనందంగా ఉంది.

రెండింటి సంబంధం..

ఇటీవల నేను కాశీ వెళ్లాను. అక్కడి నుంచి అయోధ్య, దాని నుంచి నైమిశారణ్యం వెళ్లా. దీని వెనకున్న అంతరార్థమేమిటో చెబుతా. 'శ్రుతి.. స్మృతి పురాణానం ఆలయం కరుణాలయం... నమామి భగవద్పాద శంకరం.. లోకశంకరం' అనే పద్యాన్ని మనం చదువుకుంటూ ఉంటాం. మనకు శ్రుతులు ముఖ్యమే. స్మృతులు ముఖ్యమే. శృతులైన వేదాలకు కేంద్రం కాశీ. ఆ వేదాలు చెప్పిన విషయాలను ఆచరించి చూపించిన వారు రాములవారు. వారి కేంద్రం అయోధ్య. ఈ విధంగా ఈ రెండు మనకు ముఖ్యమైన కేంద్రాలు. ఇక ధర్మం గురించి పురాణాల ద్వారా తెలుసుకుంటూ ఉంటాం. నైమిశారణ్యంలో చక్రతీర్థం అనే ప్రదేశముంది. అది కూడా చాలా ముఖ్యమైనది. దీని గురించి పురాణాలలో ప్రస్తావన ఉంది. శృతి, స్మృతి, పురాణాలు- ఈ మూడింటికీ ప్రతీకగా రాముడిని, సీత అమ్మవారిని చెప్పుకోవచ్చు. ఈ మూడింటిలోను పేర్కొన్న- వీరం, విక్రమం, వినయం, విద్య విశ్వాసం, వైరాగ్యం, వేదాంతం- ఈ గుణాలన్నింటికీ రాముల వారు ఉదాహరణ. ఆయన ధనుర్విద్యే కాకుండా అన్ని శాస్త్రాలను నేర్చుకున్నారు. ఎంత పరాక్రమశాలి అయినా అందరితోను వినయంగానే ఉండేవారు. భారతీయ ఆర్ష ధర్మంపై ఆయనకు అచంచలమైన విశ్వాసం ఉండేది. రాముల వారు ఒక సందర్భంలో- "ఆత్మానాం మానుషం మన్యే రామాంత శ్రద్ధాత్మజం" అంటారు. "నన్ను నేను ఒక మనిషిగానే చూస్తున్నాను.. నేను ఋషులకు సమానమైనవాడినని తెలుసుకోండి" అంటారు. పరాక్రమానికి ప్రతీకగా నిలిచి, అపరిమితమైన అధికారం ఉండి, దాన్ని ప్రదర్శించే అవకాశం ఉండి కూడా ఆయన తన గురించి తాను చెప్పుకున్న మాటలు అందరికీ ఆచరణీయాలు. అందుకే ఆయన రాజర్షి అయ్యారు. ఆయనలో లౌకికం ఉంది. ధార్మికం ఉంది. జ్ఞానం ఉంది. త్యాగం ఉంది. వీటి అవసరం ఈనాడు మనకు ఎంతయినా ఉంది.

> మన ప్రార్థన, రాముల వారి కృప వల్ల, న్యాయాలయం చేసిన నిర్ణయం వల్ల భవ్య మందిరం నిర్మాణం జరుగుతోంది. ప్రాణ ప్రతిష్ఠకు ముహూర్తం పెట్టిన జ్ఞానేశ్వర శాస్త్రి ద్రావిడ మన దక్షిణ భారత దేశ మూలాలు ఉన్నవారే! ఆయన ముత్తాత లక్షణ శాస్త్రి పెద్ద స్వామి వారిని కాశీకి తీసుకువెళ్లారు. తాత రాజేశ్వరిశాస్త్రి పెద్ద పండితుడు. అనేక విషయాలు పరిశీలించి.. ఉత్తర, దక్షిణ భారత దేశ శాస్త్రాల సమన్వయం చేసి మంచి ముహూర్తం పెట్టారు.

కంచితో సంబంధం...

కంచితో అయోధ్యకు రకరకాలుగా సంబంధం ఉంది. దీనిలో మొదటిది మోక్ష సంబంధం. దక్షిణ దేశంలో ఉన్న ఏకైక మోక్షపురి కంచి. మిగిలిన మోక్ష క్షేత్రాలైన- అయోధ్య మధుర, కాశీ, అవంతిక మొదలైనవన్నీ ఉత్తరదేశంలోనే ఉన్నాయి. ఆ విధంగా ఈ రెండింటికి క్షేత్ర సంబంధం ఉంది. ఇక రెండోది శక్తి సంబంధం. కంచి ఒక శక్తి పీఠం. శివ క్షేత్రాలలో శివకంచిలోని ఏకాంబరేశ్వరుడిది పృథ్వీ క్షేత్రం. మూడోది కులదేవతా సంబంధం. సూర్యవంశ కులదేవత- దేవకాళి. దశరథ మహారాజుకు కలలో కనిపించి- కంచిలోని కామాక్షి అమ్మవారిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఆదేశిస్తుంది. దానితో దశరథ మహారాజు సకుటుంబంగా కంచికి వచ్చి వారం రోజులు ఉండి, క్షేత్ర నియమాలు అన్నీ పాటించి.. "కామాక్షి తీర్థమోవర్ణః సర్వమంగళ హేతువాః" అని ప్రస్తుతిస్తాడు. దీనికి సంబంధించిన విషయాలు 'లలితోపాఖ్యానం'లో మనకు కనిపిస్తాయి. ఆ తర్వాతే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేస్తాడు. ఇన్ని సంబంధాలు ఉన్నాయి కాబట్టే- గత ఏడాది ఆగస్టులో జరిగిన భూమి పూజకు కంచి నుంచి మృత్తికలు పంపించాం. వాటితో పాటుగా- 'జయ, నంద, భద్ర, రిక్త, పూర్ణ' దేవతల కోసం ఐదు బంగారు కాసులు పంపాం. వీటన్నింటినీ భూమి పూజలో వినియోగించారు. ఏది ఏమైనా... ఎట్టకేలకు అయోధ్య రామమందిరం కథ కంచికి చేరింది. ఇది అందరి మంచి కోసమే!

సమన్వయం..

మన దేశ సంస్కృతి ఒకటైనా కాలచక్రంలో శీతోష్ణం, ఆర్థిక వికాసం చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. ఉత్తర దేశం వారి వద్ద నిష్ఠ ఉంది. మన దగ్గర నియమాలు ఉన్నాయి. వారి వద్ద నిధి ఉంది. మన వద్ద నిర్వహణ ఉంది. వీటిని సమన్వయపరిచి ముందుకు వెళ్లటమే మానవ ధర్మం. కొన్ని నెలల క్రితం అయోధ్య వెళ్లినప్పుడు... అక్కడ భక్తుల కోసం వివిధ రాష్ట్రాల వారు నిర్మించిన భవనాలు, ఆశ్రమాలను చూశాం. మన దక్షిణ దేశంలో కూడా రాములవారితో సంబంధమున్న అనేక ప్రాంతాలు ఉన్నాయి. కర్ణాటకలో కిష్కింద ఉంది. గోదావరీ తీరంలో ఆయన సంచరించాలనేది లోకప్రసిద్ధం. తమిళనాడులోని రామేశ్వరంలో ఆయన శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. కంచిపీఠం 59వ పీఠాధిపతి- భగనామబోధేంద్ర సరస్వతి స్వామి 'రామనామ' జపాన్ని ఒక స్ఫూర్తిగా నెలకొల్పారు. ఆయన జన్మించిన గోవిందపురమనే ప్రాంతంలో ఇప్పటికీ రామనామ దీక్ష తీసుకుంటూ ఉంటారు. ఇలా మనకు రామ భావనతో ఎప్పటి నుంచో సంబంధం ఉంది. ఇప్పుడు క్షేత్రంతో మరింత బలోపేతమవుతోంది. యజ్ఞయాగాదులు, వేద స్వస్తిలకు మన వారు పెట్టింది పేరు. అయోధ్య దివ్య క్షేత్రాన్ని లౌకికంగా చాలా బాగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నారు. దీనితో పాటుగా- అయోధ్య ధర్మప్రచారానికి, శాస్త్ర ప్రచారానికి ఒక వేదిక కావాలి. చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలన్నీ ప్రభావితం కావాలి. కనీసం 500 గుళ్లకైనా మేలు జరగాలి. ప్రజలు ప్రభావితం కావాలి. కొత్త సౌకర్యాలు ప్రాచీన శాస్త్ర సంపదతో సంతులనం కావాలి. దక్షిణ బుద్ధి, ఉత్తర శక్తి కలిసి పనిచేయాలి. అలా చేస్తేనే- దేశానికి, ధర్మానికి మంచి జరుగుతుందని అందరూ గ్రహించాలి. అలా జరిగిన నాడు భారత దేశం, ఆర్ష ధర్మం ప్రపంచానికి గురువు అవుతుంది. చక్రవర్తిగా నిలుస్తుంది.

సంభాషణ: **సీవీఎల్ఎన్ ప్రసాద్**

పురుషోత్తముడైన శ్రీరామచంద్ర ప్రభువు అంటే పరమ దైవం, పరమ సత్యం. ఆయన ఓటమి ఎరుగని ధీరోదాత్తుడు. తన వీరోచిత లీలలను విని, శ్లాఘించే అవకాశాన్ని మనందరికీ కల్పించేందుకే భగవంతుడు యుగయుగానా ఈ లోకంలో అవతరిస్తాడు. అలా అవతరించినప్పుడు... తన నిత్య సహచరులను, తన శాశ్వత ధామమైన అయోధ్యను ఈ లోకానికి తీసుకువస్తారు. మనం మన కంటితో చూసే ఈ భూలోకంలోని అయోధ్య... ఆధ్యాత్మిక జగత్తులోని ఆ అయోధ్యకు భిన్నమైనది కాదు. అది అనేక శాస్త్రాల్లో వర్ణించిన శాశ్వతమైన భగవత్సన్నిధానం. వాస్తవానికి వివిధ శాస్త్రాల్లో అయోధ్య గురించి ఉన్న ఆధారాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం కదిలించి, అయోధ్య వివాదానికి ఒక ముగింపు తేవడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. శ్రీరాముడు ఈ భూలోకంలో తన అవతారాన్ని ముగించుకొని, తిరిగి తన స్వధామానికి వెళ్ళిన తరువాత... అయోధ్యవాసులందరూ కూడా ఆధ్యాత్మిక లోకానికి తిరిగి వెళ్లారని శాస్త్రాలు వివరించాయి. అలా శ్రీరాముని దివ్య లీలల్లో భాగ

రామలీలలలో మనమూ భాగమే!



స్వాములైనవారందరూ ఆయన అనుగ్రహానికి పాత్రులయ్యారు. భగవంతుడు తన ధామానికి తిరిగి వెళ్ళిన తరువాత... ఈ భూలోకంలో ఆయన లీలలు ముగిసిపోయాయని కాదు. భగవంతుడు శాశ్వతుడైనట్టు ఆయన లీలలు సైతం శాశ్వతమైనవి. నేటికీ ఎవరు అయోధ్యకు వెళ్ళినా, శ్రీరాముడి మూర్తిని దర్శించినా, ఆయన దివ్య నామాన్ని జపించినా... భగవంతుడి ప్రత్యక్షానుభూతిని పొందగలరు.

సకృదేవ ప్రపన్నో యస్తవాస్మీతి చ యాచతే
అభయం సర్వదా తస్మై దదామి ఏతద్ వ్రతం మమ...

"ఎవరైనా నన్ను ఒక్కసారైనా నిజంగా శరణువేడి "స్వామీ! ఈ రోజు నుంచి నేను నీ వాడిని" అంటూ తనకు అభయాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తే... ఆ వ్యక్తికి ఆ క్షణం నుంచీ అభయాన్నిచ్చి, సర్వదా రక్షిస్తాను" అని 'శ్రీమద్రామాయణం'లో శ్రీరాముడు ప్రకటించాడు. అయోధ్యలో గొప్ప ఆలయాన్ని నిర్మించే ఈ అద్భుత ఘట్టంలో ఎంతోమంది భక్తులు చురుగ్గా పాల్గొన్నారు. ఇది భగవంతుడి అనుగ్రహం. తన లీలలో భాగమయ్యే గొప్ప అవకాశాన్ని మనకు ఇప్పటికీ ఆయన ప్రసాదిస్తూనే ఉన్నాడు. ఆలయ నిర్మాణం కోసం పోరాడినవారు, సమయాన్ని వెచ్చించినవారు, ధనసహాయం చేసినవారు, న్యాయస్థానాల్లో కేసు వాదించినవారు, ఆలయం కోసం సమాజంలో గళమెత్తి నినదించినవారు, పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారు, ఆలయానికి అనుకూలంగా మద్దతు కూడగట్టినవారు, రాముని సేవల్లో ఎంతో కొంత పాలు పంచుకున్నవారు... వీరందరూ ఆయన లీలలో భాగమే. శ్రీరాముడు తనకు హనుమంతుడు చేసిన సేవనూ గుర్తించాడు, చిన్న ఉడత చేసిన సేవనూ గుర్తించాడు. నిజానికి పరమేశ్వరుడైన శ్రీరాముడికి ఎవరి సాయం అవసరం లేదు. కానీ ఎవరైనా భక్తుడు తనకు కొంత సేవ చేయాలనుకుంటే మాత్రం తప్పకుండా అనుగ్రహిస్తాడు. ప్రస్తుత రామలీలలో భాగమైన వారందరూ ఎంతో భాగ్యవంతులు.

తన భక్తులను సకల కష్టాల నుంచి విముక్తం చేసి... శాశ్వతమైన స్థానాన్ని అందించడమే భగవంతుడి సంకల్పం. ఆది, అంతం అంటూ లేని సుదీర్ఘ కాలమానంతో పోలిస్తే... ఈ కొన్ని దశాబ్దాల సమయం ఏపాటిది! అటువంటి శాశ్వతమైన స్థానాన్ని చేరుకోవడమే అతి పెద్ద విజయం. మనకు సాధ్యమైనా, కాకపోయినా... శ్రీరామచంద్రుడు ఎల్లప్పుడూ అయోధ్యలోనే ఉంటాడు. ఆయనను దర్శించి, అర్చించే అవకాశం లభించడం మన అదృష్టం.

ఎందరో భక్తుల విశేష కృషి ఫలితంగా ఈ రోజు యావత్ ప్రపంచం అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని చూడగలుగుతోంది. అది ఈ లోకంపై భగవంతుడు చూపిన విశేషమైన అనుగ్రహం. ఇది ప్రపంచమంతటా ఒక నూతన స్వర్ణయుగానికి నాంది పలుకుతుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీలీల ప్రభుపాదులు భగవంతుడి నామాలను జపించడం ద్వారా... శ్రీరాముడి లేదా శ్రీకృష్ణుడి ప్రత్యక్షానుభూతిని మనమంతా పొందగలమని చెప్పారు.

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ రామ రామ హరే హరే

ఎవరైనా ఈ మహా మంత్రాన్ని బిగ్గరగా జపించి... ఈ ధ్వని ప్రకంపనలను శ్రద్ధగా వింటే... మనస్సులోని ప్రతికూలతలన్నీ తొలగిపోయి, జీవితంలో దివ్యమైన ఆనందాన్ని పొందుతారు. ఇది ఈ యుగానికి ఉన్న గొప్ప వరం. అయోధ్యలో శ్రీరామచంద్ర మూర్తి ప్రాణప్రతిష్ఠ జరిగిన రోజు నుంచీ ఈ మహా మంత్రాన్ని జపించాలనే సంకల్పాన్ని భక్తులందరూ చేసుకోవాలి. జీవితంలో ఆనందదాయకమైన పరివర్తనకు అది ఒక గొప్ప ఆరంభం అవుతుంది.



శ్రీసత్యగౌర చంద్ర దాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

మర్యాద పురుషోత్తముడు

అది 2000 సంవత్సరం మార్చి ఇరవై ఒకటి. తన జన్మదినోత్సవ ధన్యవాద కార్యక్రమంలో... నాటి ఉప ప్రధాని ఎల్.కె.అద్వానీ సమక్షంలో శ్రీమాతాజీ నిర్మలా దేవి మాట్లాడుతూ అయోధ్యే శ్రీరాముని జన్మస్థలమనీ, అప్పటి మసీదు ఉన్న స్థలమే అలనాడు శ్రీరాముడు నివసించిన పుణ్యస్థలి అనీ, ఎప్పటికైనా అర్హత కలిగిన ఆధ్యాత్మికవేత్తల ద్వారా అక్కడ శ్రీరామ మందిర పునరుద్ధరణ జరుగుతుందనీ చెప్పారు. అది సాకారమైంది. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన సుదినం. ఇది ఒక అపురూపమైన, చారిత్రకమైన ఘట్టం. ఇది శ్రీరాముడు, రామరాజ్యాల విశిష్టతలను మననం చేసుకోవాల్సిన సమయం.

శ్రీరాముడి గుణగణాలను, లక్షణాలను, ఆయన వ్యక్తిత్వం నుంచి మనం నేర్చుకొని, అంతర్గతంగా స్థిరపరచుకొని, వ్యక్తీకరించుకోవలసిన ఆవశ్యకతను శ్రీమాతాజీ నిర్మలాదేవి పలు సందర్భాల్లో విశదీకరించారు. శ్రీరాముడు పుడమిపై అవతరించినప్పుడు... విశ్వవిరాట్‌లో హృదయచక్రం అభివృద్ధి చెందడానికి ఆ ఆవిర్భావం దోహదపడింది. త్రేతాయుగంలో రాక్షసుల నుంచి, దుష్ట శక్తుల నుంచి తన భక్తులను, ప్రజలను రక్షించుకోవడానికి శ్రీమహావిష్ణువు ఎత్తిన అవతారమే శ్రీరాముడు. అయితే తానొక అవతార పురుషుణ్ణని ఆయన ఎక్కడా చెప్పలేదు. తన తల్లితండ్రులకైనా తెలియనివ్వలేదు. శ్రీరామ జననం తరువాతనే రాజుల రాజ్యాధిపత్యం మొదలై... అన్నిటికన్నా మిన్నగా ప్రజాభీష్టానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆరంభమయింది. ప్రజల కోసం, మానవాళి అభ్యున్నతి కోసం రాజు మంచితనాన్ని, ప్రేమతత్వాన్నీ కలిగి ఉండాలి. నాయకుడైన రాజు ఎంత త్యాగాన్నయినా చెయ్యడానికి సిద్ధపడాలి. అది శ్రీరాముడితోనే ప్రారంభమయింది.

నాటి సమస్త ప్రజానీకం కోరుకున్న సత్ప్రవర్తన, మంచితనం శ్రీరామునిగా అవతరించాయి. వాటి గురించి కేవలం చెప్పడమే కాకుండా... ఆచరించి చూపించిన రాజు శ్రీరాముడు. ఎప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తండ్రిగా, భర్తగా, కుమారుడిగా, రాజుగా ఆయన ఆదర్శప్రాయుడు. చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం రాముడి సుగుణాలలో ఒకటి. ఈ లక్షణాలను



మనలో స్థిరపరుచుకోవాలి. ఇచ్చిన మాటను ఏవేవో కుంటిసాకులు చెప్పి తప్పించుకోకూడదు. ఆయనలోని మరో సుగుణం... అవతలివారి హృదయాన్ని నొప్పించకపోవడం. ఎవరినైనా ప్రేమించి, వారిని అర్థం చేసుకున్నట్టయితే... సంకోచం అంటే ఏమిటో మనకు బోధపడుతుంది. ఆ సంకోచతత్వాన్ని శ్రీరాముని జీవితం నుంచి మనం అలవరచుకోవాలి. ఎవరితో ఎప్పుడు, ఎలా సంభాషించాలో ఆయన నుంచి నేర్చుకోవాలి. తన పరిమితులు, హద్దులు శ్రీరాముడికి బాగా తెలుసు. ఆయన వాటిని ఎప్పుడూ అతిక్రమించలేదు.

మానవుల అంతర్గత సూక్ష్మ శరీరంలో ప్రతి అవయవంలో, చక్రాలలో, నాడులలో సకల దేవీ దేవతలు కొలువై ఉన్నారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... వారి లక్షణాలను మనం సంతరించుకోవచ్చు. సీతాసమేతుడైన శ్రీరాముడు మన హృదయంలోని కుడిపార్శ్వం వైపు ఆసీనుడై ఉంటాడు. ఆత్మసాక్షాత్కారం పొంది... సహజ యోగ సాధన చేస్తున్న వారిలో మర్యాద పురుషోత్తముడిగా, ఆదర్శవంతమైన తండ్రిగా శ్రీరాముని లక్షణాలు జాగృతి చెంది ప్రతిబింబిస్తూ ఉంటాయి. శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా... మన ఇళ్ళలో, హృదయాల్లో శ్రీరామజ్యోతిని వెలిగించుకుందాం. ఆయన ఆదర్శాలను పాటించి... శ్రీరామ రాజ్యానికి దోహదం చేద్దాం.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

రామమందిరం దైవసంకల్పం


అయోధ్యలో శ్రీరామ బమందిర ప్రతిష్ఠాపనకు దేశం సిద్ధమవుతున్న వేళ... ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కల సాకారం కాబోతోంది. ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతున్న వేళ.. దానికి దారితీసిన సంఘటనల సమాహారం నా మదిలో మెదులుతోంది.

రామజన్మభూమి-బాబ్రీమసీద్ వివాదానికి సంబంధించి కంచి శంకరాచార్య శ్రీ జయేంద్రసరస్వతికి, ప్రముఖ ముస్లిం నాయకులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాక... 2002 వేసవిలో, అప్పటి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ మా బెంగళూరు ఆశ్రమానికి వచ్చారు. నాటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నిర్ణయాత్మకంగా వ్యవహరించి... రామమందిర నిర్మాణానికి మార్గం సుగమం చేయాలనేదే ఆ సమయంలో అశోక్‌జీ ఏకైక లక్ష్యం. అయితే ఆయన డిమాండ్లు కొన్ని అప్పటి సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న వాజ్‌పేయికి ఆచరణసాధ్యంకానివిగా ఉన్నాయి. దీర్ఘకాలికమైన ఈ వివాదాన్ని శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించే పని ఆయన నాకు అప్పగించారు. దానికోసం ముస్లిం నాయకులతో, ప్రముఖులతో వరుస చర్చలు ప్రారంభించాను. అదంతా వేరే కథ. ఆసక్తికరమైన విషయమేంటంటే... ఆ సమయంలో... ముఖ్యంగా అయోధ్య విషయంలో అశోక్‌జీ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షను వాజ్‌పేయి బలవంతంగా విరమింపజేసినప్పటినుంచీ... అశోక్‌జీకీ, ప్రధానికీ మధ్య మాటలు లేవు. కాబట్టి రామజన్మభూమి సమస్యను వెంటనే పరిష్కరించేలా చట్టాన్ని ప్రవేశపెట్టడానికి వాజ్‌పేయిని ఒప్పించాలని నన్ను అడిగేందుకు ఆయన మా ఆశ్రమానికి వచ్చారు. "ఈ ప్రయత్నంలో ప్రభుత్వం పడిపోయినా నేను పట్టించుకోను" అని ఆయన అన్నారు. అప్పటికి అశోక్ సింఘాల్ వయస్సు డెబ్బయ్యారేళ్ళు. "ఏనాటికైనా మందిర నిర్మాణం జరుగుతుందా? దాన్ని నా జీవితకాలంలో చూడగలనా?" అని నన్ను ప్రశ్నించారు. "ప్రార్థన చెయ్యండి. మీ నిబద్ధతతో... అన్నీ సాధ్యమే" అని ఆయనతో నేను చెప్పిన మాట ఇంకా నాకు గుర్తుంది. అర్ధమనస్కంగానే అశోక్‌జీ అక్కడినుంచి నిష్క్రమించారు.

మరునాటి ఉదయం నేను ధ్యానం చేస్తూండగా... శిథిలావస్థలో ఉన్న దేవీ ఆలయం, కోనేరు నాకు కనిపించాయి. వాటిని పునరుద్ధరించవలసిన అవసరం ఉందనిపించినా... ఆ సమయంలో పెద్దగా పట్టించుకోలేదు. కొన్ని రోజుల అనంతరం తమిళనాడు నుంచి వృద్ధుడైన నాడీ సిద్ధాంతి మా ఆశ్రమానికి వచ్చి నన్ను కలిశారు. ఆయన పురాతన తాళపత్రాలను తీసి చదువుతూ "గురుదేవ్! రామజన్మభూమి సమస్య పరిష్కారం కోసం ఇరువర్గాలనూ ఒప్పించడంలో మీరు పాత్ర పోషించవలసి ఉంటుందని (తాళపత్రాలలో) రాసి ఉంది" అని అన్నారు. అంతేకాదు, "శ్రీరాముని కులదైవమైన దేవకాళి ఆలయం అక్కడ నిర్లక్ష్యానికి గురైందని కూడా ఈ పత్రాలు చెబుతున్నాయి. దాన్ని పునరుద్ధరించనంతవరకూ... అయోధ్య రామమందిరం చుట్టూ అల్లుకున్న హింస, కలహాలు ఆగవు" అని కూడా అన్నారు.

అలాంటి దేవాలయం ఒకటి అక్కడ ఉన్నదనే విషయం అప్పటివరకూ నాకు కానీ, ఆ నాడీ సిద్ధునికి గానీ తెలీదు. అప్పుడిక అయోధ్యలో కాళీ మందిరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో విచారించాం. రెండు ఉన్నాయని తెలిసింది. ఒకటి 'ఛోటీ దేవకాళీ మందిర్'. అది అయోధ్య నడిబొడ్డున ఉంది. రెండవది 'దేవకాళీ మందిర్'. అక్కడకు కొంచెం దూరంలో... శిథిలావస్థలో ఉంది. కోనేరు చెత్తతో నిండిపోయి ఉంది. ఢిల్లీ, లక్నోల్లోని మా కార్యకర్తలను సంప్రతించాను. ఆ దేవాలయాన్నీ, కోనేటినీ పునరుద్ధరించాలని సూచించాను. సెప్టెంబర్ రెండోవారానికల్లా వారు ఆ పనిని విజయవంతంగా పూర్తి చేశారు. సెప్టెంబర్ 18న మరికొందరితో కలిసి అయోధ్య చేరుకున్నాను. ఆ మర్నాడు దేవకాళీ ఆలయ పునఃప్రతిష్ఠ జరిగింది. మరో చిత్రమేమిటంటే... దేవకాళీ ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి అయోధ్యలో ఏ విధమైన రక్తపాతం, మతకలహాలు, కొట్లాటలు జరగలేదు. అశోక్ సింఘాల్ కూడా ఆ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటికి కూడా అయోధ్య వివాదం పరిష్కారానికి మరో పద్నాలుగు సంవత్సరాలు పడుతుందనే అనిపించింది.

ఆనాటి సాయంత్రం... దేవకాళీ ఆలయ ప్రాంగణంలో జరిగిన సంత్ సమాగమానికి హిందూ, సూఫీ సాధువులను ఆహ్వానించాం. నేను ముస్లిం నాయకులను సత్కరించినప్పుడు... వారు నాకు తులసీ రామాయణాన్ని, ఖురాన్ ప్రతినీ అందించారు. శ్రీరామునిపట్ల తమకున్న ప్రగాఢ భక్తి గురించి మాట్లాడారు. అపూర్వమైన సోదర భావం వారిలో వ్యక్తమయింది. ఎంతోకాలంగా సాగుతున్న ఆ సంఘర్షణలో అప్పటికే చాలా రక్తపాతం జరిగింది. ఇప్పుడు కాలపరీక్షను తట్టుకొని నిలబడగలిగే సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. దాన్ని దృష్టిలో ఉంచుకొని... కోర్టు వెలుపల పరిష్కారం జరిగేలా... రామజన్మభూమిని ముస్లిం సమాజమే హిందువులకు బహుమతిగా ఇవ్వాలనీ, దానికి ప్రతిగా హిందువులు వారికి అయిదెకరాల భూమి బహుమతిగా ఇవ్వాలనీ నేను 2003లో ప్రతిపాదించాను.



సంవత్సరాలు గడిచాయి. 2017లో... ఇరువర్గాల నాయకుల భావాలు, వాటికి తోడు సర్వోన్నత న్యాయస్థానం సూచనలతో... రామజన్మభూమి విషయంలో మధ్యవర్తిత్వం వహించడానికి నా ప్రయత్నాలు మళ్ళీ ప్రారంభించాను. అంతిమంగా... రామమందిర నిర్మాణానికి ఆ భూమిని కేటాయిస్తూ, మసీదు నిర్మాణానికి అయిదు ఎకరాలను కేటాయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అయిదువందల ఏళ్ళ వివాదం శాంతియుతంగా పరిష్కారమైన ముఖ్యమైన సందర్భం అది. అశోక్ సింఘాల్ సంకల్పదీక్ష, మోడీ దార్శనికత, కోట్లాది భారతీయుల చిత్తశుద్ధితో కూడిన ప్రార్థనలు, దైవాశీస్సులు... ఇవన్నీ కలిసి ఈనాటి చారిత్రక క్షణానికి దారితీశాయి.

చాలాసార్లు స్థూలంగా మనకు కనిపించే విషయాలకు సూక్ష్మమైన అంశాలు ఆధారభూతంగా ఉంటాయి. భౌతికంగా వ్యక్తమవడానికి ముందుగానే ఈ సంఘటనలు సూక్ష్మ స్థాయిలో జరుగుతాయి. మనమేమో ఈ పని ఇలా జరగడానికి ఫలానాది కారణమని (కార్య కారణ సిద్ధాంతాన్ని) చర్చిస్తూ... స్థూల ప్రపంచంలోనే తిరుగుతూ ఉంటాం. ఎప్పుడో తప్ప అంతకుమించి ఆలోచించం. అలా ఆలోచించినట్టయితే.. సూక్ష్మ స్థాయిలో పనిచేసే శక్తులు... స్థూలంగా జరిగే కార్యాల మీద గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తాయని గ్రహించి ఉండేవాళ్ళం. మన జీవితంలోని అనేక విచిత్రాల్లో ఇది మరొక చిత్రమైన రహస్యం.

• గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

'సౌర' స్వాప్నికుడు..!

- సోలార్ విద్యుత్‌పై అవగాహనకు ఎనర్జీ స్వరాజ్య యాత్ర
- శ్రీకారం చుట్టిన ముంబై ఐఐటీ ప్రొఫెసర్ చేతన్ సింగ్
- మూడేళ్లుగా కుటుంబాన్ని వదిలి దేశవ్యాప్త బస్సు యాత్ర

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

తెల్ల దొరల నుంచి స్వరాజ్యం కోసం కర్ర పట్టుకుని అడుగులు వేశారు మహాత్మా గాంధీ..? కలుషితమవుతున్న వాతావరణం నుంచి విముక్తి కలిగించడానికి.. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ ఒక్కో అడుగు వేస్తున్నారు 'సోలార్ గాంధీ'. ఆయనే ముంబై ఐఐటీ ప్రొఫెసర్ చేతన్ సింగ్ సోలంకి. మధ్యప్రదేశ్‌లోని కారిగోన్ జిల్లాకు చెందిన ఆయన ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్‌ను స్థాపించి సోలార్ విద్యుత్‌పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ కాలుష్యం వల్ల భవిష్యత్ ఎంత భయంకరంగా ఉంటుందో వివరిస్తున్నారు. వాతావరణ మార్పులను అరికట్టి, ప్రజలు స్వచ్ఛమైన వాయువులు పీల్చుకునే పరిస్థితిని తీసుకురావాలని సంకల్పించారు. థర్మల్ విద్యుత్ వల్ల నష్టాలు, సోలార్ విద్యుత్ వల్ల లాభాలను ప్రజల ముందు ఉంచడానికి 'సోలార్ గాంధీ' అవతారమెత్తిన ఆయన 'సోలార్ స్వరాజ్య యాత్ర'ను ప్రారంభించారు. గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి 2020 నవంబరు 26న యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇది 2030 వరకు సాగుతుంది. చేతన్ సింగ్ చేపట్టిన యాత్ర ఇటీవల విజయవాడకు చేరుకుంది.

అన్‌పెయిడ్ ప్రొఫెసర్‌గా..

చేతన్‌సింగ్ ఉద్యోగాన్ని ఎంతగా ప్రేమిస్తారో.. ప్రకృతిని, వాతావరణాన్ని కాపాడుకోవడానికి అంతే ప్రాధాన్యమిస్తారు. సోలార్ స్వరాజ్య యాత్రను ప్రారంభించిన తర్వాత ఆయన ఇప్పటి వరకు ఇంటి ముఖం చూడలేదు. యాత్రను దేశవ్యాప్తంగా నిర్వహించాలంటే విధులకు దూరంగా ఉండాలి. దీంతో ఆయన ఐఐటీ నుంచి ఎలాంటి వేతనం తీసుకోకుండానే యాత్ర నిర్వహిస్తున్నారు. రూ.35 లక్షలతో ప్రత్యేకంగా ఒక బస్సును తయారు చేయించుకున్నారు. ఇందులో నిద్రపోవడానికి బెడ్, కూర్చోవడానికి కుర్చీలు, కిచెన్‌లో సోలార్ స్టౌ, టాయ్‌లెట్ వంటి సదుపాయాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీకి సంబంధించిన పుస్తకాలతో మినీ లైబ్రరీ ఏర్పాటు చేసుకున్నారు. బస్సుకు అవసరమైన విద్యుత్ కోసం పైభాగంలో సోలార్ పలకలు అమర్చారు. బస్సు ఇంజన్ మాత్రమే డీజిల్‌తో పని చేస్తోంది. వాతావరణంలోని ఉష్ణోగ్రతల మార్పులు రాబోయే రోజుల్లో ఎలా ఉంటాయో తెలియజేస్తూ ఆయన ఒక గడియారాన్ని రూపొందించారు. దీనికి క్లైమేట్ క్లాక్ అని పేరు పెట్టారు. ఈ బస్సులో తన ఫౌండేషన్‌లోని సభ్యులతో కలిసి చేతన్‌సింగ్ దేశ పర్యటనకు బయలుదేరారు. మూడు సంవత్సరాలుగా కుటుంబానికి దూరంగా ఉంటూ సోలార్ విద్యుత్‌పై ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 1,139 రోజులపాటు సాగిన యాత్రలో ఆయన సుమారు 50 వేల కిలోమీటర్లు తిరిగారు. మొత్తం 2,46,769 మందిని కలుసుకుని సోలార్ విద్యుత్ ఆవశ్యకతను వివరించారు.

"వాతావరణంలో ఉష్ణతాపాన్ని తగ్గించాలని ప్రపంచ దేశాలు కసరత్తు చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి ఇప్పటి వరకు అనేక సదస్సులు నిర్వహించింది. చాలా మంది సోలార్ విద్యుత్ ఖర్చుతో కూడుకున్నది అనుకుంటున్నారు. బైక్, ఖరీదు వేలల్లో ఉంటుంది. కారు ఖరీదు లక్షల్లో ఉంటుంది. అయినా కొనుగోలు చేస్తున్నారు కదా. వాతావరణాన్ని కలుషితం చేస్తున్నది మనమే. కలుషిత గాలిని పీల్చుతున్నదీ మనమే. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అయ్యే ఖర్చు మానవుడి జీవితకాలం కంటే ఖరీదైనది కాదు. ఈ లాజిక్‌ను ప్రజలంతా గుర్తించాలి" అని చేతన్ సింగ్ చెప్పారు.



చేతన్ సింగ్ సోలంకి



'సోలార్ స్వరాజ్య యాత్ర' బస్సు ఇదే..



ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న. చిత్రంలో కేశినేని చిన్ని తదితరులు

కేశినేని నాని పచ్చి మోసగాడు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

విజయవాడ, జనవరి 18: వైసీపీలోకి వెళ్లిన కేశినేని నాని 2017 నుంచే ఆ పార్టీకి కోవర్టుగా పనిచేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని బుద్దా వెంకన్న కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2017లో దేవినేని అవినాశ్‌ను టీడీపీలో చేరవద్దని దద్దమ్మ నాని చెప్పాడని, అప్పటి నుంచి వైసీపీకి కోవర్టుగా వ్యవహరిస్తున్నాడన్నారు. బెంజి సర్కిల్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ కాంట్రాక్టర్ వద్ద నుంచి నాని ముడుపులు తీసుకోవడం నిజం అవునో కాదో చెప్పాలన్నారు. పచ్చి మోసగాడు, దుర్మార్గుడు అంటూ వ్యాఖ్యానించారు. టీడీపీలో అందరూ అవినీతి పరులే అంటున్న నానికి దమ్ముంటే నేరుగా పేర్లు చెప్పాలన్నారు. ప్రజారాజ్యం నుంచి చిరంజీవి బయటకు గెంటివేస్తే, ఇప్పుడు చంద్రబాబు మెడపట్టి బయటకు పంపించేశాడన్నారు. ఇక జగన్మోహన్‌రెడ్డి కాలుతో తన్ని నానిని తరిమేస్తాడన్నది నిజమని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 60 శాతం మందిని తన వెంట తీసుకువెళతానంటున్న నాని.. కనీసం ఆరుగురిని కూడా తీసుకువెళ్లలేడంటూ ఎద్దేవా చేశారు.విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన్ను చిత్తు చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, రానున్న ఎన్నికలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరేస్తామన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని తొలగించాలి: సీపీఐ

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అత్యంత వివాదాస్పదుడైన ప్రసాదరెడ్డిని మళ్లీ ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమించడం తగదని సీపీఐ తప్పుబట్టింది. తక్షణమే అయనను వీసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని 5 విశ్వవిద్యాలయాల ఉపకులపతులుగా వైసీపీ అనుకూలురునే నియమించడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు.

పెండింగ్ పదోన్నతులు పూర్తిచేయాలి: ఎస్టీయూ

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, సంఘం నేతలు కె.ఎ్రయ్య, కె.జోజప్ప గురువారం ఇబ్రహీంపట్నంలో పాఠశాల విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

గనుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌పై చీటింగ్ కేసు

తాడేపల్లి టౌన్, జనవరి 18: ఏపీ గనుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీర ప్రతాపరెడ్డిపై తాడేపల్లి పోలీస్ స్టేషన్లో గురువారం చీటింగ్ కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, జెక్కిరెడ్డి ప్రభాకరరెడ్డి ఈ నెల 11న వీరప్రతాప్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. గ్రానైట్ గనులు ఇప్పిస్తానని రూ.4 లక్షలు తీసుకుని, ఇప్పించకుండా మోసం చేశాడని, తిరిగి డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ప్రభాకరరెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు ఏపీ గనుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఏపీ మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు

- చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు

న్యూఢిల్లీ, జనవరి 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మేనిఫెస్టో కమిటీని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ గురువారం ఢిల్లీలో ఒక ప్రకటన విడుదల చేసింది. కమిటీకి చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజును నియమించింది. కనుమూరి బాపిరాజు, జేడీ శీలం, తులసిరెడ్డి, జంగా గౌతమ్, ఉషా నాయుడు తదితర 11 మందిని సభ్యులుగా నియమించింది.

2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే లక్ష్యం

- కేంద్ర సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18: దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్ చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపపిల్ మోరేశ్వర్ పాటిల్ పేర్కొన్నారు. ఆరోగ్యకర భవిష్యత్తు దిశగా ఆరోగ్యకర గ్రామం అంశంపై తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాటిల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి సర్పంచుల సూచనలు విలువైనవిగా పరిగణించే అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి నమూనా రూపకల్పనలో సర్పంచ్ కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. మన తాతలు నదులు, కాలువలు చూస్తే, మన తండ్రులు బావులు, బోర్లు చూశారని, మనం బోర్లలో నీళ్లు చూస్తున్నామనీ, ఈ తరం బాటిల్స్‌లో నీళ్లు చూస్తూ ఉందన్నారు. అందరూ ఆలోచించకపోతే భవిష్యత్తు తరాలు కన్నీళ్లు చూసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. రాబోయే ప్రమాదాన్ని గుర్తించి రూ.2 వేల కోట్లతో జల జీవన్ మిషన్ ద్వారా గ్రామ స్థాయిలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు.

సర్వేయర్‌పై వైసీపీ సర్పంచ్ దాడి

మేదరమెట్ల, జనవరి 18: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం వైసీపీ సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య మండల సర్వేయర్ మహేష్‌బాబుపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. కార్యాలయానికి వెళ్తున్న తనను అడ్డగించి సుబ్బయ్య, అతని సోదరుడు దాడి చేశారని సర్వేయర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. బొడ్డువానిపాలేనికి చెందిన నేరెళ్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన భూమి సర్వే చేయాలని స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. అందుకు సంబంధించి వెంకటేశ్వర్లు స్థలం పక్కన ఉన్న గ్రామ సర్పంచ్ సుబ్బయ్య, ఆయన తమ్ముడు శేషయ్యకు సర్వేయర్ నోటీసులు ఇచ్చారు. గురువారం ఆ విషయమై మాట్లాడేందుకు వారిద్దరూ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. సర్వేయర్ లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేయగా, వస్తున్నట్టు చెప్పారు. దీంతో సుబ్బయ్య శేషయ్య కొరిశపాడులోని గ్యాస్ కంపెనీ వద్ద ఆయన్ను ఆపి వాగ్వాదానికి దిగి దాడి చేశారు. ఈ మేరకు సర్వేయర్ పోలీసులకు ఫిర్యాదులో చేశారు. కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విధి నిర్వహణలో సర్వేయర్‌పై దాడిని తహసీల్దార్, మండల అధికారులు ఖండించారు.

వసూళ్ల వ్యసనంలో ఎక్సైజ్

- సార్వత్రిక ఎన్నికల సాకుతో బదిలీలు
- మార్గదర్శకాలతో సంబంధం లేకుండా ఆరంభం
- 'కావాలని' అనుకుంటే లక్షల్లో కొట్టాల్సిందే
- 'బదిలీల అధికారం'పై ఉన్నత స్థాయిలో పోరు
- పోస్టింగుల కోసం వేలం..ఈసీకి ఫిర్యాదు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వసూళ్ల వ్యసనంలో కొట్టుకుపోతున్న ఎక్సైజ్ శాఖకు సార్వత్రిక ఎన్నికల సాకు దొరికింది. మార్గదర్శకాలతో పనిలేకుండానే యథేచ్ఛగా పోస్టింగుల వేలం ప్రక్రియను ఉన్నత స్థాయిలో మొదలు పెట్టినట్లు తెలిసింది. గతంలో ఎన్నడూ ఎన్నికల సమయంలో ఎక్సైజ్‌లో బదిలీలు జరగలేదు. ఎన్నికలతో వారికి నేరుగా సంబంధం లేకపోవడమే దానికి కారణం. కానీ ఈసారి మద్యం ప్రభావాన్ని కూడా నియంత్రించాలనే ఉద్దేశంతో ఎక్సైజ్‌లో కూడా బదిలీలు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. కొందరు అధికారులకు ఇదే వరంగా మారింది. ఎక్సైజ్ చరిత్రలో ముడుపులు లేకుండా సాధారణ బదిలీలు కూడా జరిగిన దాఖలాలు లేవని ఆ శాఖ వర్గాలే బాహాటంగా పేర్కొంటాయి. ఇప్పుడు ఎన్నికలు కూడా కావడంతో పోస్టింగులకు ఇంకా డిమాండ్ పెరిగింది. రాబోయే మూడు నెలలు కీలకం కావడంతో బదిలీ తప్పదనుకున్న అధికారులు మంచి పోస్టింగుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఒక జిల్లాలో మూడు సంవత్సరాలు పనిచేసిన అధికారులు తప్పనిసరిగా బదిలీ కావాలి. అందుకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉంది. మూడేళ్ల నిబంధన ప్రకారం డిప్యూటీ కమిషనర్లు ఇద్దరు, అసిస్టెంట్ కమిషనర్లు ఐదుగురు బదిలీ అవుతారని ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్), అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐ, ఎస్ఐల స్థాయిలో ఎక్కువ మంది బదిలీ అవుతారు. దీంతో ఎస్ఐ నుంచి ఈఎస్ పోస్టుల వరకు కీలక పోస్టింగుల కోసం ముడుపులు సమర్పిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇక్కడే మరో పోరు ప్రారంభమయింది. ఎస్ఐలను బదిలీ చేసే అధికారం ఈఎస్‌లకు ఉంటుంది. సీఐలు, ఏఈఎస్‌లను కమిషనర్ చేస్తారు. ఆ పైస్థాయి అధికారులను ప్రభుత్వం చేస్తుంది. కానీ కమిషనర్ చేయాల్సిన బదిలీలను కూడా ప్రభుత్వ స్థాయిలోనే చేపడుతున్నారు. బదిలీలతో ఏ మాత్రం సబంధం లేని కార్పొరేషన్ ఉన్నతాధికార పీఠం జోక్యం పెరిగి, కమిషనర్‌ను పక్కన పెట్టడంతో కీలక అధికార వర్గాల మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. గత బదిలీల్లోనూ సంబంధం లేని వారు జోక్యం చేసుకున్నారని, ముడుపుల కోసం హైరార్కీని తోసిరాజని వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఒక వర్గం మండిపడుతోంది. పోస్టింగులు కోరుకునేవారు 'పనిమంతులను' ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎస్ఐ పోస్టింగ్‌కు రూ.5 లక్షలు, సీఐ పోస్టింగ్‌కు రూ.8 లక్షలు, పైస్థాయి పోస్టింగులకు దాదాపు రూ.20 లక్షల చొప్పున బేరాలు మొదలుపెట్టారని సమాచారం.

ఈసీకి ఫిర్యాదు

ఈ నేపథ్యంలో బదిలీల్లో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ కొందరు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ లేఖలో... 'పోస్టింగుల కోసం ఏకంగా వేలం నిర్వహిస్తున్నారు. జిల్లా ప్రాతిపదికగా తీసుకోవడం లేదు. మూడేళ్లు పూర్తికాని వారిని కూడా బదిలీ చేస్తున్నారు. ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేకపోయినా డిస్టిలరీల్లో పనిచేస్తున్నవారినీ బదిలీ చేయాలని ప్రయత్నిస్తున్నారు' అని ఫిర్యాదు చేశారు. అయితే కొత్త జిల్లాను ప్రామాణికంగా తీసుకోవాలంటూ కొందరు ఒత్తిడి చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కీలక స్థానాల్లో ఉన్న వారు అక్కడే ఉండాలనే ప్రయత్నంలో భాగంగా కావాలనే జిల్లా అంశాన్ని రాద్ధాంతంగా మారుస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తంగా ఎక్సైజ్‌లో బదిలీల వ్యవహారం ఆరోపణలను, మీడియా కథనాలను దాటుకుని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల వరకూ వెళ్లింది.

కొత్త జడ్జీలకు ప్రాక్టికల్ శిక్షణ అవసరం!

- ఏడాది శిక్షణ ఇచ్చాకే పోస్టింగ్ ఇచ్చేలా ఆదేశించండి
- హైకోర్టులో న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులయ్యే సివిల్ జడ్జీలకు(జూనియర్ డివిజన్) ఏడాదిపాటు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చిన తర్వాత పోస్టింగ్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టు న్యాయవాది తాండవ యోగేష్ ఈ పిల్ దాఖలు చేశారు. శిక్షణ లేకుండా వారికి నేరుగా జూనియర్ సివిల్ జడ్జీ, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బాధ్యతలు అప్పగించడం ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీసు నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని వ్యాజ్యంలో పేర్కొన్నారు. న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్), ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌లను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.'న్యాయవ్యవస్థలో జూనియర్ సివిల్ జడ్జీలు, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లది కీలకపాత్ర. న్యాయ విద్యను అభ్యసించే సమయంలోగానీ, జడ్జి ఉద్యోగానికి సిద్ధమయ్యే సమయంలోగానీ వారు అన్ని అంశాలపై అధ్యయనం చేసే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో వారికి ప్రాక్టికల్ శిక్షణ తప్పనిసరి. హైకోర్టు విభజన తరువాత 2021లో 62మంది ఎంపికవగా, వారికి ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వకుండా నేరుగా పోస్టింగ్ ఇచ్చారు. జూనియర్ సివిల్ జడ్జీలకు బాధ్యతలు అప్పగించే ముందు కనీసం ఏడాదికి తగ్గకుండా శిక్షణ ఇవ్వాలని ఆల్‌ఇండియా జడ్జస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏపీ న్యాయశాఖ 2008 ఆగస్టు 2న జారీ చేసిన జీవో నంబరు 119తో పాటు ఏపీ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీస్ రూల్ 8 ప్రకారం జూనియర్ సివిల్ జడ్జీలకు ఏడాదిపాటు శిక్షణ తప్పనిసరి. శిక్షణ అవసరం లేకుండా పోస్టింగ్ ఇచ్చే అధికారాన్ని రూల్స్‌లో హైకోర్టు కల్పించింది. ఆ నిబంధనను తొలగించి శిక్షణ తప్పనిసరి చేయాలి. ఇటీవల నియమితులైన 20 మంది సివిల్ జడ్జీలకు ఏడాదిపాటు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చేలా ప్రతివాదులను ఆదేశించండి. బాధ్యతలు అప్పగించే ముందు ఐఏఎస్, ఐపీఎస్‌లకు కనీసం రెండేళ్ల శిక్షణ ఇస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని, కొత్తగా నియమితులయ్యే సివిల్ జడ్జీలకు(జూనియర్ డివిజన్) ఏడాదిపాటు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వండి' అని వ్యాజ్యంలో పేర్కొన్నారు.

తిరుపతిలోనూ గోహత్యలు

- అడ్డుకోవడంలో టీటీడీ చైర్మన్, ఈవో విఫలం: శివకుమార్

తిరుమల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రం కిందనున్న తిరుపతిలోనూ గోహత్యలు జరుగుతున్నాయని, వీటిలో నియంత్రించడంలో టీటీడీ చైర్మన్, ఈవో విఫలమయ్యారని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో గోవధ చట్టాలను కఠినంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారన్నారు. వందల లారీల్లో వేల గోవులను ఈ ఐదు రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఏపీ ప్రభుత్వానికి యుగతులసి పార్టీ తరపున రెండుసార్లు లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదన్నారు.

ఆర్యవైశ్యులను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం

- పది ఎమ్మెల్యే, రెండు ఎంపీ టికెట్లు కేటాయించాలి: అంబికా కృష్ణ

గుంటూరు, జనవరి 18: ఆర్యవైశ్యులను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అంబికా కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గుంటూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తమ సామాజికవర్గం 8 శాతం ఉన్నామని, 40 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. గతంలో అసెంబ్లీలో 30 స్థానాల్లో ఉన్న తమ సామాజికవర్గం ప్రస్తుతం నాలుగుకు పడిపోయిందన్నారు. తమకు రాష్ట్రంలో 10 ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఫిబ్రవరిలో విజయవాడ వేదికగా జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని అంబికా కృష్ణ తెలిపారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం ద్వంద్వ వైఖరి

- రాయబరేలిలోని ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటు తీసుకునేందుకు రైల్వేకు గ్రీన్‌సిగ్నల్
- విశాఖ ప్లాంటులోని బీఎఫ్-3 మాత్రం ప్రైవేటు సంస్థకు అప్పగింత
- సెయిల్, ఎన్ఎండీసీ ఆసక్తి చూపినా కుదరదని అడ్డంకులు చెప్పిన వైనం
- తద్వారా జిందాల్‌కు మార్గం సుగమం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. విశాఖ ఉక్కు నిధులతో ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో నిర్మించిన ఫోర్జ్‌డ్ రైల్ వీల్ ప్లాంటును మరో ప్రభుత్వ సంస్థ రైల్వే తీసుకోవడానికి అంగీకరించింది. అయితే విశాఖ ప్లాంటులో మాత్రం బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్)-3ని తీసుకోవడానికి మరో ప్రభుత్వ సంస్థ ముందుకురాకుండా అడ్డంకులు కల్పించింది. కేవలం ప్రైవేటు సంస్థలకు మాత్రమే ఇచ్చేలా పావులు కదిపి, బ్లాస్ట్‌ఫర్నేస్-3 జిందాల్ స్టీల్‌కు దక్కేలా చేసింది. రాయబరేలిలో వీల్ ప్లాంటును పుస్తక విలువకు (సుమారు రూ.2,200 కోట్లకు) తీసుకోవడానికి రైల్వే బోర్డు అంగీకారం తెలిపింది. విశాఖలో బీఎఫ్-3 కోసం సెయిల్, ఎన్ఎండీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆసక్తి చూపగా, ఒక ప్రభుత్వ సంస్థ మరో ప్రభుత్వ సంస్థ టేకోవర్‌లలో పాల్గొనకూడదని వెనక్కి పంపించేశారు. దీనివల్ల విశాఖ ఉక్కుకు పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందలేదు. జిందాల్ ఇచ్చిన సొమ్ముతో కష్టాలు గట్టెక్కలేదు. ఇప్పుడు కూడా ముడి పదార్థాల కోసం విశాఖ ఉక్కు యాజమాన్యం వెదుకులాడుతోంది. వారం రోజులకు సరిపడా నిల్వలు కూడా లేవు.

విశాఖలో వీఎస్ఎస్


రాయబరేలిలో ఏడాదికి లక్ష రైలు చక్రాలను తయారు చేసే సామర్థ్యం కలిగిన ప్లాంటును రైల్వేకు అప్పగించారు. అందులో పనిచేస్తున్న విశాఖ ఉక్కు ఉద్యోగులకు రైల్వేలోకి మారడానికి కూడా అవకాశం కల్పించారు. మొత్తం 92 మంది ఉద్యోగులు ఉండగా, వారి ఆసక్తి మేరకు 65 మంది రైల్వే ఉద్యోగులుగా మారిపోయారు. అక్కడ అన్నిరకాల అవకాశాలు కల్పించిన కేంద్రం విశాఖలో ఉద్యోగుల సంఖ్య తగ్గించేయడానికి యత్నిస్తోంది. దీనికోసం ఎక్కడా లేని 'వలంటరీ సెల్ఫ్ సెపరేషన్ స్కీమ్' (వీఎస్ఎస్)ను తీసుకువస్తోంది. ఇది అమలైతే 1,500 మంది వరకు తగ్గిపోతారు.

అడ్వాన్స్ ఎందుకు ఇప్పించరు?

ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడడానికే రాయబరేలి ఫ్యాక్టరీని రైల్వేకు అప్పగించారు. ఇప్పుడు విశాఖ ఉక్కుకు నిధులు అత్యవసరం కాబట్టి కనీసం వేయి కోట్ల రూపాయలైనా అడ్వాన్స్‌గా ఇప్పించాలని ఇక్కడ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాయబరేలి ఒప్పందానికి సంబంధించి ఇటు విశాఖ ఉక్కు బోర్డు, అటు రైల్వే బోర్డు రెండూ అంగీకారం తెలిపాయి. దేశంలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు ఈ టేకోవర్ ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయించారు. అంత స్పష్టత ఉన్నప్పుడు అడ్వాన్స్‌గా వేయి కోట్లు ఇప్పించడానికి ఉక్కు మంత్రిత్వ శాఖ ఎందుకు చొరవ చూపడం లేదని ఇక్కడి కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. తక్షణమే అడ్వాన్స్ ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నాయి.

అశ్వ వాహనంపై ఆది దంపతుల విహారం

- శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం, జనవరి 18: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై ఆశీనులను చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం ఘనంగా జరిపారు.

రజకుల స్థలాన్ని కబ్జా చేసిన వైసీపీ నేతలు



నరసరావుపేట, జనవరి 18: అధికారం అండతో వైసీపీ నేతలు అక్రమాల పరంపరను కొనసాగిస్తూనే ఉన్నారు!. ఇటీవల నరసరావుపేట బరంపేటలో ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. అక్కడితో ఆగారనుకుంటే.. ఇప్పుడు ఇక్కడి బరంపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో రజకుల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేశారు. దీనిపై రజక సామాజిక వర్గం మహిళలు గురువారం అక్కడ ఆందోళనకు దిగారు. కబ్జాదారుల పేర్లను అధికారులకు అందజేస్తూ.. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం చేయలేదని, స్థలం కబ్జా చేసిన వ్యక్తులు వైసీపీ వారు కావడంతో ఆయన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సముద్రపు దొంగల దాడికి గురైన ఎంవీ జెన్‌కో పికార్డీ

గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో వాణిజ్య నౌకపై సముద్రపు దొంగల దాడి

- రక్షించిన ఐఎన్ఎస్ విశాఖపట్నం

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో మార్షల్ దీవుల వద్ద వాణిజ్య నౌక ఎంవీ జెన్‌కో పికార్డీపై బుధవారం రాత్రి 11.11 గంటలకు సముద్రపు దొంగలు డ్రోన్‌తో దాడి చేశారు. ఆ నౌకలో 22 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో తొమ్మిది మంది భారతీయులు. దాడి జరిగిన వెంటనే సాయం కోరుతూ నౌకలోని సిబ్బంది ఫోన్ చేశారు. భారత నేవీ తక్షణమే స్పందించింది. గల్ఫ్ ఆఫ్ ఈడెన్‌లో గస్తీ నిర్వహిస్తున్న యుద్ధనౌక ఐఎన్ఎస్ విశాఖపట్నం (గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్) రంగంలోకి దిగింది. సముద్రపు దొంగల బోట్లను అడ్డుకుంది. డ్రోన్ దాడిలో ఎవరికీ ఏమీ కాలేదని, మంటలు కూడా వెంటనే అదుపు చేశామని పేర్కొంది. నేవీకి చెందిన పేలుడు పదార్థాల నిపుణులు గురువారం ఉదయమే ఆ నౌకలోకి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు. క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత పోర్టుకు వెళ్లడానికి ఆ నౌకకు అనుమతి ఇచ్చారని నేవీ ఓ ప్రకటనలో వివరించింది.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు మృతి


- పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మృత్యువాత
- అనంతపురం జిల్లాలో విషాదం



బయపరెడ్డి, రాజారెడ్డి

నార్పల, జనవరి 18: వేరుశనగ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన తండ్రీకొడుకులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటన అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బయపరెడ్డి(42)కి మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో బోరుబావి కింద వేరుశనగ సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు గురువారం తెల్లవారుజామున కుమారుడు రాజారెడ్డి(18)తో కలిసి వెళ్లాడు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ బాక్సును ముట్టుకోగానే బయపరెడ్డి తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రిని కాపాడే క్రమంలో రాజారెడ్డి కూడా షాక్‌కు గురయ్యాడు.

'అనంత'లో 1.75 కోట్ల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు

విడపనకల్లు, జనవరి 18: అనంతపురం జిల్లా విడపనకల్లు సమీపంలో కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.75 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన పందాల క్రిష్టారెడ్డి కారులో నగదు తరలిస్తుండగా పట్టుకున్నామని సెబ్ అనంతపురం జిల్లా అదనపు ఎస్పీ రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు.

బలహీనంగా భావి భారతం!

- పిల్లల్లో అత్యధికులు అన్‌ఫిట్ పరిధిలోనే
- బాలుర కంటే బాలికలే నయం.. పీటీ క్లాసులతో మంచి ఫిట్‌నెస్

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లే పిల్లల్లో అత్యధికులు శారీరక దృఢత్వం లేకుండా బలహీనంగా ఉంటున్నారని ఓ సర్వే వెల్లడించింది. అయితే, బాలుర పరంగా చూస్తే బాలికల పరిస్థితి కొంత మెరుగని పేర్కొంది. పాఠశాలలో నిర్వహించే వ్యాయామ విద్య (పీటీ) పిల్లల ఫిట్‌నెస్‌లో కీలకపాత్ర పోషిస్తుందని, వారానికి కనీసం రెండుసార్లు పీటీలో పాల్గొనే పిల్లలు శారీరకంగా ఇతరులకన్నా మెరుగ్గా ఉంటున్నారని తెలిపింది. కర్ణాటకకు చెందిన 'స్పోర్ట్ విలేజ్' క్రీడావిద్యాసంస్థ నిర్వహించిన 12వ వార్షిక ఆరోగ్య సర్వేలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా 250 పట్టణాల్లో 7 నుంచి 17 ఏళ్ల వయసున్న దాదాపు 73 వేల మంది పిల్లలపై ఈ సర్వే జరిపారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ఏరోబిక్ కెపాసిటీ, అనేరోబిక్ కెపాసిటీ, కోర్ స్ట్రెన్త్, ఫ్లెక్సిబిలిటీ, అప్పర్ బాడీ స్ట్రెన్త్, లోయర్ బాడీ స్ట్రెన్త్ వంటి పలు ఆరోగ్య సూచీల ఆధారంగా పిల్లల్లో శారీరక దృఢత్వాన్ని అధ్యయనం చేశారు. బీఎంఈ, ఫ్లెక్సిబిలిటీ, అప్పర్ బాడీ స్ట్రెన్త్‌లలో బాలుర కన్నా బాలికలు మెరుగైన ఫిట్‌నెస్‌తో ఉన్నారని ఈ సర్వే వెల్లడించటం విశేషం. తరచూ ఏదో ఒక శారీరక శ్రమ చేయటం వల్లనే బాలికలు మెరుగ్గా ఉన్నారని తెలిపింది. బాలురు ఏరోబిక్ కెపాసిటీ, లోయర్ బాడీ స్ట్రెన్త్‌లో మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారని పేర్కొంది. పీటీకి పిల్లల శారీరక ఆరోగ్యానికి మధ్య గణనీయమైన సంబంధం ఉన్నదని తెలియజేసింది.

ఇదీ పరిస్థితి..

- ప్రతీ అయిదుగురిలో ఇద్దరు తగిన బీఎంఐతో లేరు.
- ప్రతీ అయిదుగురిలో ఇద్దరికి తగిన అనేరోబిక్ కెపాసిటీ లేదు
- ప్రతీ నలుగురిలో ముగ్గురికి తగిన ఏరోబిక్ సామర్థ్యం లేదు
- ప్రతీ ముగ్గురిలో ఒకరికి ఉదర భాగం బలంగా లేదు
- ప్రతి అయిదుగురిలో ముగ్గురికి సరైన అప్పర్, లోయర్ బాడీ స్ట్రెంత్ లేదు

జగన్ సర్కారు దురుద్దేశంతోనే
22న సెలవు ఇవ్వలేదు

▸▸ పురందేశ్వరి

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో ఈనెల 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమవుతుంటే జగన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆరోజు సెలవు ప్రకటించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. ఆమె గురువారం ఒక ప్రకటనలో చేస్తూ.. 'బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్న తరుణంలో దేశంలోని చాలా రాష్ట్రాల్లో 22న విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఏపీలో జగన్ ప్రభుత్వం మాత్రం 21వ తేదీ వరకు మాత్రమే సెలవులు ఇవ్వడం వెనుక దురుద్దేశం ఉందని అర్థమవుతోంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో జగన్ ప్రభుత్వం ఈనెల 21 వరకు సెలవు ఇవ్వడం పట్ల బీజేపీ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామని, అదే సమయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అందరూ వీక్షించే వీలు కల్పిస్తూ 22న కూడా సెలవు ప్రకటించాలని పురందేశ్వరి డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, 'నాలుగు సంవత్సరాలుగా ఎస్సీలకు అన్యాయం చేసి ఇప్పుడు అంబేడ్కర్ విగ్రహం పేరుతో రాజకీయం చేయడం సరికాదు' అని విమర్శించారు. షర్మిల, జగన్ వేరు వేరు కాదని, వారిద్దరూ కూడబలుక్కుని నాటకం ఆడుతున్నారని ఆరోపించారు.

జై భారత్ పార్టీ రాయలసీమ యూత్ అధ్యక్షుడిగా శీలంశెట్టి సాయి

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జై భారత్ పార్టీ రాయలసీమ యూత్ వింగ్ అధ్యక్షుడిగా శీలంశెట్టి వెంకట భార్గవ్ సాయి నియమితులయ్యారు. విజయవాడలోని ఆ పార్టీ నేషనల్ కార్యాలయంలో గురువారం పలువురు పార్టీలో చేరారు. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ.. రాయలసీమ యూత్ వింగ్ అధ్యక్షుడిగా శీలంశెట్టి సాయిని నియమిస్తూ పార్టీ కండువా కప్పారు. ఆయనతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకట రామారావు సమక్షంలో యువ నాయకులు సుభాన్, వెంకటరమణ, సాయికిరణ్, తిరుపాల్ తదితరులు యువజన విభాగంలో చేరారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, అనంతపూర్, చిత్తూరు, కడప, కర్నూలు కేంద్రాలుగా పార్టీ యువజన విభాగాన్ని విస్తరిస్తామని సాయి చెప్పారు.

పీఐబీ డైరెక్టర్‌గా హల్లికేరి


జీడీ హల్లికేరి

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) డైరెక్టర్‌గా ఐఐఎస్ అధికారి డాక్టర్ జీడీ హల్లికేరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు న్యూస్ సర్వీసెస్ డివిజన్, ఆలిండియా రేడియో న్యూఢిల్లీ, బెంగళూరు, కర్ణాటకలోని ధార్వాడ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా, కర్ణాటకలోని బళ్లారి వద్దనున్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ)లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేశారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో రెండు దశాబ్దాలకు పైగా పనిచేసి అనేక కీలక పదవులను చేపట్టి ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న హల్లికేరి పదోన్నతిపై విజయవాడలోని పీఐబీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

అన్నమయ్య జిల్లాలో
ఆయనో అరాచకం

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది చేయాల్సిందే. ఎమ్మెల్యే కన్నుపడిన భూమి ఏదైనా.. ఆయన పరం కావాల్సిందే. ఆ భూమి రేటు కూడా ఎమ్మెల్యే ఇచ్చినంత మహాప్రసాదంగా భావించి తీసుకోవాలి. లేదు.. కాదు అని ఎవరైనా అంటే.. ఆ ఎమ్మెల్యే సొంత నియోజకవర్గానికి చెందిన రౌడీమూక(దండుపాళ్యం బ్యాచ్ వంటిదని స్థానికులు చెబుతారు) వచ్చి దాడులకు తెగబడుతుంది. ఇది సరిపోదన్నట్టు.. బాధితుల మీదే హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ వంటి తీవ్ర కేసులు నమోదవుతాయి. నియోజకవర్గంలో జరిగే కాంట్రాక్టు పనులన్నీ ఎమ్మెల్యే సోదరుని కంపెనీనే చేస్తుంది. ఈ నియోజకవర్గంలోని ఒక మండల పరిధి నుంచి ఇసుకను పక్క రాష్ట్రానికి తరలించి.. సుమారు రూ.300 కోట్లు పోగేసుకున్నారనే ప్రచారం ఉంది. నియోజకవర్గానికి వలస వచ్చిన ఈయన ఎప్పుడూ అయ్యప్ప మాలలో ఉండడం విశేషం. ఈయన సోదరుడు అధికార పార్టీలో అమాత్య శేఖరులు.

పైసా నష్టపరిహారం లేదు

నియోజకవర్గంలోని పలు మండలాలకు తాగునీరు అందించేందుకు రూ.వందల కోట్లతో పైపులైన్ పనులు జరిగాయి. ఈ పనుల్లో పలువురు రైతులు తమ భూములు కోల్పోయారు. ఇప్పటికీ ఆ రైతులకు ప్రభుత్వం నుంచి పైసా నష్టపరిహారం అందలేదు. అదే నియోజకవర్గంలో రూ.759.50 కోట్లతో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికి సుమారు 60శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, ఒక్క రైతుకు కూడా నష్టపరిహారం చెల్లించలేదు.

ఎమ్మెల్యే కన్ను పడితే..

రెండేళ్ల కిందట నియోజకవర్గ కేంద్రం పరిధిలో పలువురు రైతుల నుంచి ఎమ్మెల్యే బలవంతంగా 100 ఎకరాల భూములు ఎకరం లక్ష నుంచి లక్షన్నరతో కారుచౌకగా దక్కించుకున్నారు. అందులో ఇప్పటి వరకు సుమారు 50 నుంచి 60 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగిలిన వాళ్లకు ఒక్కొక్కరికి రూ.10 వేలు అడ్వాన్సు ఇచ్చారు. మిగిలిన డబ్బు గురించి పట్టించుకోవడం లేదు.



అరాచకాలకు అడ్డా!

▸▸ పక్క జిల్లా నుంచి నియోజకవర్గంలోకి వచ్చే మండల పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న విలువైన 11 ఎకరాల భూమిని ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కారుచౌకగా కాజేశాడు. ఈ స్థలం విషయమై అన్నదమ్ముల మధ్య సుమారు 30 సంవత్సరాలుగా వివాదం ఉంది. అన్నదమ్ముల్లో ఒకరిని లోబరుచుకుని.. ఆస్తిని కాజేశారు. రాత్రికి రాత్రే ఆన్‌లైన్ కూడా అయిపోయింది. ఇది అన్యాయమని ప్రశ్నించిన.. ఇంకో భాగస్తుడైన సోదరుడిని దారుణంగా కొట్టారు.

▸▸ ఇదే మండలంలో ఓ వైశ్య కుటుంబంలో అత్తా, కోడళ్ల మధ్య ఒక ఇంటి విషయమై విభేదాలు ఉన్నాయి.. ఎమ్మెల్యే అనుచరులు కోడలి వైపు జోక్యం చేసుకుని.. ఇంటిని కాజేశారు. అత్తను బెదిరించారు.

▸▸ నియోజకవర్గం గుండా వెళ్లే ప్రధాన రహదారిలో బీసీ కులస్థులైన ఇద్దరు అన్నదమ్ముల మధ్య స్థల వివాదం ఉంది. ఈ వివాదంలో ఒక వైపు ఎమ్మెల్యే అనుచరులు జోక్యం చేసుకుని.. మిగిలిన వాళ్లపై దౌర్జన్యానికి దిగారు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలకు దిగడంతో పోలీసులు విధిలేని స్థితిలో ఎమ్మెల్యే అనుచరులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో బెయిల్ మీద బయటకు వచ్చిన నిందితులంతా.. మళ్లీ ఎమ్మెల్యే వెంటే తిరుగుతున్నారు.

▸▸ ఈ నియోజకవర్గంలోని ఒక మండలంలో ప్రధాన రహదారికి పక్కన ఎవరైనా రియల్‌ఎస్టేట్ వెంచర్ వేస్తే.. ఎమ్మెల్యేకు కప్పం చెల్లించాల్సిందే. ఎమ్మెల్యే కోరుకున్న ఆరు ప్లాట్లు ఇచ్చినంత తీసుకుని రాసివ్వాలి. ఇక్కడే ఓ విద్యాసంస్థ సమీపంలో ఒక విలువైన భూమి తమదంటూ పులివెందుల బ్యాచ్ వచ్చి నానా రచ్చ చేసింది. యజమానులపై దాడులకు దిగింది. దాడుల విషయం తెలిసినా.. పోలీసులు స్పందించలేదు. ఆ తర్వాత ఏమైం దో? ఏమో.. ఈ విషయం ఉన్నపళంగా సద్దుమణిగిపోయింది. ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నారు. అందరికీ ముట్టాల్సింది ముట్టింది.

▸▸ పక్క నియోజకవర్గంలోని ముఖ్యపట్టణం ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే అనుచరులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి.. వెంచర్లు వేసేందుకు చదును చేశారు. స్వయంగా ఎమ్మెల్యేనే ఈ వ్యవహారం వెనుక ఉండడంతో అధికారులు ఆటువైపు కన్నెత్తి చూడలేదు.

సొంత నేతల సొమ్ముకే ఎసరు

▸▸ నియోజకవర్గంలో పలువురు దిగువ స్థాయి అధికార పార్టీ నాయకుల నుంచి ఎమ్మెల్యే రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చేబదులుగా తీసుకున్నారు. తిరిగి ఇవ్వమని వాళ్లు అడుగుతున్నా.. ఎమ్మెల్యే స్పందించడం లేదు. దీంతో ఎమ్మెల్యేను గట్టిగా అడగలేక.. రూ.లక్షలు వదులుకోలేక పలువురు అల్లాడిపోతున్నారు.

▸▸ నియోజకవర్గ వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు బినామీ పేర్లతో ఎమ్మెల్యే చేయించారు. బిల్లుల సొమ్ము ఎమ్మెల్యే చెప్పిన వాళ్ల అకౌంట్లలో పడ్డాయి. దీంతో తాము ఖర్చు పెట్టి పనులు చేసినా.. బిల్లులు ఇవ్వకపోవడంతో చోటామోటా నాయకులు లబోదిబోమంటున్నారు.

అక్రమ కేసులు.. వేధింపులు

నియోజకవర్గాన్ని సొంత జాగీరుగా భావిస్తున్న ఎమ్మెల్యే ఎదురు తిరిగిన వాళ్లపై అక్రమ కేసులు పెట్టించడంతో పాటు, దాడులు, వేధింపులకు దిగుతారు. ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధిగా తన భార్యను గెలిపించుకున్న ఒకప్పటి ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ప్రస్తుతం ఎమ్మెల్యేకు విరోధిగా ఉన్నారు. ఎమ్మెల్యేని ధిక్కరించిన ఆ నాయకుడిపై అనేక కేసులు పెట్టారు. పలుమార్లు దాడులకు పాల్పడ్డారు. చివరకు జిల్లా బహిష్కరణ కూడా చేయించారు.

సర్వే బృందాన్నీ వదల్లేదు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఒక సర్వే బృందం రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తోంది. ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో సైతం ఈ బృందం అక్కడ పనిచేసింది. ఈ బృందానికి చెందిన వాళ్లు.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పనితీరు గురించి సర్వే చేయడానికి వచ్చారు. దీంతో ఎమ్మెల్యే అనుచరులు ఆ సర్వే బృందాన్ని అడ్డుకుని కొట్టి.. ఒక గదిలో బంధించారు. ఈ విషయాన్ని బృందాన్ని పంపిన సదరు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యేకు స్వయానా బంధువైన పెద్దస్థాయి ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని వాళ్లను విడిపించారు. ఈ సంఘటనపై పోలీసులు ఎవరిపైనా కేసులు నమోదు చేయలేదు.

ఇసుక దోపిడీ 300 కోట్లు

నియోజకవర్గంలోని పక్క రాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని ఓ మండలం నుంచి ఎమ్మెల్యే గత నాలుగన్నర సంవత్సరాల కాలంలో సుమారు రూ.300 కోట్లు సంపాదించినట్లు ప్రచారంలో ఉంది. ఇక్కడి నుంచి ఇసుకను టిప్పర్లతో పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని ఓ మండల పరిధిలో రాష్ట్ర మంత్రి పేరుతో బోర్డు, ఇనుప కంచె వేసిన స్థలంలో వేల టిప్పర్ల ఇసుక నిల్వ ఉంచారు. ఇక్కడి నుంచి రేయింబవళ్లు టిప్పర్లతో ఇసుకను పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వానికి పైసా పన్ను చెల్లించకుండానే ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఇసుక తరలిస్తూ రూ.కోట్లు జేబులో వేసుకుంటున్నారు. ఇలా ఇసుకను ఎమ్మెల్యే బినామీ పేర్లతో రవాణా చేస్తున్నారని, అక్రమంగా తరలిస్తున్న వాళ్లకు అండగా ఉన్నారనే ఆరోపణలున్నాయి.

వందలమందిపై అక్రమ కేసులు

▸▸ గత ఏడాది ఆగస్టు 4న టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో ఈ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ వైసీపీ నేతలు ఆయనపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో విచిత్రంగా పోలీసులు చంద్రబాబుతో పాటు వందలాది మంది టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. ఘటనా స్థలంలో లేని వాళ్లను సైతం ఈ కేసుల్లో నిందితులుగా చేర్చారు.

▸▸ నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు సంఘీభావంగా స్థానిక నేతలు చేపట్టిన పాదయాత్రపై వైసీపీ శ్రేణులు రాళ్ల దాడికి పాల్పడ్డాయి. అయినా పోలీసులు టీడీపీ వారిపైనే కేసులు నమోదు చేశారు.

పారుతున్న పొరుగు మద్యం

నియోజకవర్గ వ్యాప్తంగా కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే ముఖ్య అనుచరులే ఈ వ్యాపారం చేస్తున్నారు. నియోజకవర్గం సహా పక్క నియోజకవర్గంలోని పోలీసుస్టేషన్లలో మద్యం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్యే అండతో యథేచ్ఛగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతుండడంతో అధికారులు చర్యలు తీసుకోలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దొంగ ఓట్లకు కుయుక్తులు

▸▸ టెన్త్ విద్యార్థుల పేరిట ఫారం-6 దరఖాస్తులు

▸▸ రాప్తాడు నియోజకవర్గంలో అధికార పార్టీ కుట్రలు

రాప్తాడు, జనవరి 18: ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని అధికార పార్టీ వారు చేస్తున్న కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండని, పదో తరగతి విద్యార్థులను కూడా ఓటరు జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నించారు. నకిలీ ఆధార్ కార్డులను ఉపయోగించి ఫారం-6 దరఖాస్తులను పంపించారు. ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బీఎల్వోలు ఇలాంటి వాటిని గుర్తించి తిరస్కరిస్తున్నారు. రాప్తాడు, ప్రసన్నాయపల్లి, అనంతపురం రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో ఎన్నికల అధికారులపై ఒత్తిడి తెచ్చి, వయసు తక్కువ ఉన్నవారిని ఓటరు జాబితాలో చేర్పించారని తెలుస్తోంది. రాప్తాడు మండలంలో ఒక గ్రామంలో ఓటు ఉన్న వారిని మరో గ్రామంలో ఓటర్లుగా చేర్చేందుకు ఫారం-6 దరఖాస్తు చేశారు. స్థానికేతరులను కూడా ఓటర్లుగా చేర్చారు. మరికొందరికి ఇంటి పట్టాల ఆధారంగా ఫారం-6 దరఖాస్తు చేయించారు. ఇలాంటి వాటిని ఓటరు జాబితాలో చేర్చాలని బీఎల్ఓలపై ఒత్తిడి తెచ్చారు. అయితే, ఉద్యోగాలు పోతాయన్న భయంతో పలువురు బీఎల్ఓలు ఇలాంటి వాటిని తిరస్కరిస్తున్నారు.

- తాడిపత్రికి చెందిన కట్లపూడి మహమ్మద్ కమల్ బాషాను రాప్తాడులో ఓటరుగా చేర్చేందుకు ఆన్‌లైన్‌లో ఫారం-6 దరఖాస్తు చేశారు. ఆధార్‌లో వయసు తక్కువగా ఉండటంతో నకిలీ ఆధార్‌ను ఉపయోగించి, రాప్తాడుకు చెందిన ఓ వలంటీర్ ఫారం-6 దరఖాస్తు చేశారు. బీఎల్ఓ క్షేత్రస్థాయిలో విచారించి.. దానిని తిరస్కరించారు.
- రాప్తాడులోని సీపీఐ కాలనీకి చెందిన ఓబిలేసు కుమారుడు బి.వేణు పదో తరగతి చదువుతున్నాడు. ఇతడికి నకిలీ ఆధార్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓ వలంటీర్ ఫారం-6 దరఖాస్తు చేశారు. బీఎల్ఓ అక్కడికి వెళ్లి విచారించారు. ఓటు కోసం తమ కుమారుడు దరఖాస్తు చేయలేదని వేణు తండ్రి ఓబిలేసు తెలపడంతో ఆ దరఖాస్తును బీఎల్ఓ తిరస్కరించారు.
- రాప్తాడు ఎంపీపీ, వైసీపీ నాయకురాలు చిట్రెడ్డి జయలక్ష్మి కుమారుడు సంతోష్‌రెడ్డి పదో తరగతి చదువుతున్నాడు. ఆధార్ కార్డులో వయసును మార్చి ఫారం-6 దరఖాస్తు చేయించారు. ఓటరు జాబితాలో చేర్చేందుకు బీఎల్ఓపై ఒత్తిడి తెచ్చారు. అయినా ఆ దరఖాస్తును బీఎవ్వో తిరస్కరించారు.


ఆధార్ - సామాన్యులకు హక్కు

పేద అక్కచెల్లెమ్మలకు అండగా వడ్డీ రాయితీ

▸▸ 12.77 లక్షల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం: జగన్

▸▸ పావలా వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.47 కోట్లు జమ

▸▸ ఇళ్ల లబ్ధిదారుల కోసం బటన్ నొక్కిన ముఖ్యమంత్రి

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తూ, వారి సొంతింటి కలను నిజం చేస్తూ ఇళ్ల లబ్ధిదారులందరికీ వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పారు. ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు రుణాలకు సంబంధించిన వడ్డీ రీయింబర్స్‌మెంట్ నిధులను గురువారం క్యాంప్ కార్యాలయంలో సీఎం బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన 12,77,373 మంది అక్కచెల్లెమ్మలకు ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున పావలా వడ్డీకే రుణాలిప్పించడమే కాకుండా, వాటికి సంబంధించి ఈ దఫాలో 4,07,323 మందికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద ఇవాళ రూ.47 కోట్లు జమచేస్తున్నామని తెలిపారు. ప్రతి ఆర్నెల్లకోసారి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో సున్నావడ్డీ డబ్బులు అక్కచెల్లెమ్మలకు విడుదల చేసినప్పుడు దాదాపుగా 5,43,140 మందికి అప్పట్లో రూ.54 కోట్లు విడుదల చేశామన్నారు. ఇంటి స్థలం విలువ, నిర్మాణం కోసం ఖర్చు చేస్తున్న రూ.2.70 లక్షలు, మౌలిక సదుపాయాల కోసం చేస్తున్న రూ.లక్ష వ్యయంతో కలిపి మొత్తం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా విలువ చేసే ఆస్తిని ప్రతి అక్కచెల్లెమ్మలకు అందిస్తున్నామని జగన్ వివరించారు.

భవానీ దీక్షల విరమణ కానుకలు
తొలిరోజు లెక్కింపులో రూ.2,70,48,680

వన్‌టౌన్, జనవరి18 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగిన భవానీ దీక్షల విరమణల కార్యక్రమంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవస్థానంలో లెక్కింపు ప్రారంభించారు. తొలి విడతగా రూ.2,70,48,680 నగదు, 280 గ్రాముల బంగారం, 18 కిలోల వెండి కానుకల రూపంలో వచ్చాయి.

కలెక్టర్‌పై వేటు సరే..
కుట్రదార్ల మాటో!

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి మునిసిపల్ కమిషనరు, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కలెక్టరు గిరిషాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఆయనను సస్పెండ్ కూడా చేసింది. అయితే.. ఇంకా సమాధానం దొరకని ప్రశ్నలు మిగిలిపోయాయి. తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు? వాస్తవానికి ఈసీ బయట పెట్టే వరకూ దొంగ ఓట్ల వ్యవహారం బయటకు రానివ్వకుండా తొక్కిపెట్టారు. ప్రతిపక్షం టీడీపీ,జనసేన, బీజేపీ నేతలు గొంతు చించుకున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకుండాపోయింది. అప్పుడే దొంగ ఓటర్ కార్డుల వ్యవహారంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

ఆ ఎన్నిక ఎలా చెల్లుతుంది?

అఫిడవిట్‌లో సరైన సమాచారం ఇవ్వనందుకే కర్ణాటకలో ఎంపీ ప్రజ్వాల్ రేవన్నను అనర్హుడుగా ఈసీ ప్రకటించింది. అలాంటిది ఒకే చోట సుమారు 35 వేల నకిలీ ఓటర్లను సృష్టించడం, నకిలీ ఓటర్ కార్డుల ద్వారా ఉప ఎన్నికల్లో ఓట్లు వేయించిన విషయం వెలుగులోకి వచ్చింది. నకిలీ ఓట్లతో గెలిచిన అభ్యర్థులపై చర్యలు తీసుకునే అధికారం ఈసీకి ఉంది. గెలిచిన అభ్యర్థిపై వేటు వేయడంతోపాటు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ఈసీ ప్రకటించవచ్చు. కానీ ఈసీ ఎందుకో ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. కేవలం గిరీషాపై చర్యలతోనే సరిపెట్టింది. నిజానికి, తిరుపతి ఉప ఎన్నికల సమయంలో అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు 25 మంది మంత్రులు అక్కడే తిష్టవేశారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వహించే ఉన్నతాధికారులు, ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. మరోవైపు 'వైనాట్ 175' అంటున్న అధికార పార్టీ నేతలు ఒక నమూనాగా తిరుపతి ఉప ఎన్నికలను తీసుకున్నారని భావిస్తున్నారు. దొంగ ఓట్లు వేయించుకుని 2024లో తిరిగి అధికారంలోకి వచ్చేద్దామన్న వ్యూహంతో జగన్ ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో కేంద్ర ఎన్నికల కమిషన్ మరింత కఠినంగా వ్యవహరించాలన్న భావనను ఎక్కువమంది వ్యక్తం చేస్తున్నారు. గిరీషా సస్పెన్షన్ అనేది ఒక చిన్న చర్య మాత్రమే అని, దీని వెనుక కర్త, కర్మ, క్రియ మొత్తం స్థానిక ప్రజాప్రతినిధులే ఉన్నారని వాదిస్తున్నారు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

ఏప్రిల్ 17వ తేదీన తిరుపతి ఉప ఎన్నిక జరిగింది. తిరుపతి అర్బన్ ఎస్పీ కార్యాలయం ఎదుటే దొంగ ఓటర్లతో వెళుతున్న రెండు బస్సులను టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అడ్డుకున్నారు. దొంగ ఓటర్లను అడ్డుకోలేదంటూ పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ అభ్యర్థి రత్నప్రభ ధర్నాకు దిగారు. డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో కాంగ్రెస్ అభ్యర్థి చింతా మోహన్ ఐదు బస్సుల్లో వచ్చిన దొంగ ఓటర్లను అడ్డుకున్నారు. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో, ఆవరణలో భారీగా జనం కనిపించారు. ఆవరణలోనూ, వెలుపలా కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు పార్కు చేసి ఉండడం కనిపించింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సమీకరించిన ఆ జనమంతా దొంగ ఓట్లు వేయడానికి వచ్చినవారేనని ఆరోపిస్తూ సుగుణమ్మ తదితరులు ఉదయం 8 గంటలకు అక్కడే రోడ్డుపై బైఠాయించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అరెస్టు చేయాలని ధర్నాచేయగా, పోలీసులు వారినే అరెస్టు చేసి తొలుత ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తర్వాత అక్కడ నుంచీ తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు.. తిరుపతి ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా అధికార పార్టీ నేతల చేతుల్లో పెద్దసంఖ్యలో ఓటరు కార్డులు కనిపించాయి.వాటిని పోలింగ్ కేంద్రాల ఎదుటే బహిరంగంగా దొంగ ఓటర్లకు పంపిణీ చేసి క్యూలైన్లలో నిలిపి ఓట్లు వేయించారు. శ్రీకాళహస్తి మండలం పోలి గ్రామంలో వెంకటేశ్వరరెడ్డి అనే వృద్ధుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తన ఓటు టీడీపీకి వేయాలని సిబ్బందిని కోరారు. అయితే పోలింగ్ అధికారిణి వైసీపీకి ఓటు వేయడంతో గొడవ జరిగింది. తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాలపై టీడీపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బీజేపీ అభ్యర్థి, రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. అయినా ఫలితం కనిపించలేదు. అయితే, రత్నప్రభ ఆ తర్వాత కూడా తన పోరాటం కొనసాగించారు. ఈ క్రమంలో అప్పటి తిరుపతి సెగ్మెంట్ ఈఆర్వోగా ఉన్న ఆయన తన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను స్థానికంగా ఉన్న ఓ అధికార పార్టీ నేతకు అప్పగించారని, ఆ నేత ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో సుమారు 30వేల మంది ఓటర్ల ఐడీ కార్డులను డౌన్‌లోడ్ చేసి వాటికి నకిలీ కార్డులను తయారు చేశారని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో బయటపడింది. దీంతో గిరీషాపై సస్పెన్షన్ వేటు పడింది.


తిరుపతి ఉప ఎన్నిక రోజు దొంగ ఓటర్లను ప్రశ్నిస్తున్న బీజేపీ సీనియర్ నాయకురాలు శాంతారెడ్డి

నకిలీ ఓటరు కార్డులు చూపిస్తున్న శాంతారెడ్డి (ఫైల్)

మరికొందరిపైనా వేటు?

తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాల వ్యవహారంలో మరికొందరిపైనా వేటు పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఎవరెవరు గిరిషాకు అనుకూలంగా వ్యవహరించారు...ఎవరు డూప్లికెట్ ఓటర్ కార్డుల స్కామ్‌లో ఉన్నారన్న దానిపై ఈసీ ఆరా తీస్తోంది. ప్రాథమిక విచారణలో కొంత మంది అధికారుల పేర్లు కూడా బయటపడ్డారు. వారిపై కూడా ఈసీ నిఘా పెట్టింది. రెండు, మూడు రోజుల్లో మరి కొంత మంది అధికారులపై కూడా సస్పెన్షన్ వేటు పడబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక ఆర్డీవోపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.


ఆమరణదీక్షకు కూర్చున్న శ్రీను తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు


శ్రీనుకు మద్దతుగా విశాఖ సెంట్రల్ జైలు బయట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం నాయకులు

విశాఖ జైలులో కోడికత్తి శ్రీను నిరాహార దీక్ష!

▸▸ విజయవాడలో రహస్య ప్రదేశంలో తల్లి, సోదరుడి దీక్ష

▸▸ సీఎం జగన్ కోర్టుకు వచ్చే వరకు ఆపేది లేదని ప్రతిన

▸▸ ప్రాణం ఉన్న మనిషిని బయటకు తీసుకురండి.. శ్రీను తల్లి

▸▸ జైలు అధికారుల నుంచి రక్షణ కల్పించాలని శ్రీను వినతి

విశాఖపట్నం/ఆరిలోవ, విజయవాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో జరిగిన దాడి కేసుకు సంబంధించి ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా జైలులో మగ్గిపోతున్న దళిత యువకుడు జనుపల్లి శ్రీనివాసురావు(కోడికత్తి శ్రీను).. తనను జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ సెంట్రల్ జైలులో గురువారం నిరాహార దీక్ష చేపట్టాడు. అదే సమయంలో ఆయన తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు విజయవాడలోని ఓ రహస్య ప్రదేశంలో దీక్షకు పూనుకున్నారు. శుక్రవారం విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో తల్లీ కొడుకులు దీక్షకు దిగడం గమనార్హం. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో దీక్ష చేపట్టిన శ్రీనివాసరావును దళిత సంఘాల నాయకులు ములాఖత్ ద్వారా గురువారం కలిశారు. అనంతరం.. విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక(విదసం) రాష్ట్ర సమన్వయకర్త బూసి వెంకటరమణ మాట్లాడుతూ.. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇచ్చేంత వరకూ జైలులో శ్రీను దీక్షను కొనసాగిస్తాడన్నారు. దీక్షకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని, జైలు అధికారులు ఏక్షణమైనా తన దీక్షను భగ్నం చేసే అవకాశం ఉన్నందున తగిన రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తమను శ్రీను కోరినట్టు చెప్పారు. ఇటీవల సీఎం జగన్.. ఎస్సీలపై పెట్టిన కేసుల్లో పంతొమ్మిదింటిని కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, తన కేసును కూడా అలాగే కొట్టేయాలని కోరాడన్నారు. అనంతరం జైలు బయట శ్రీనుకు మద్దతుగా విదసం నాయకులు నినాదాలు చేశారు. శ్రీనుపై ఉన్న కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ప్రాణంపోయే వరకూ దీక్ష!

మరోవైపు .. "ప్రాణం లేని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం కాదు. ప్రాణం ఉన్న దళిత యువకుడు జనుపల్లి శ్రీనివాసరావును బెయిల్‌పై బయటకు రప్పించండి" అని కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు సీఎం జగన్‌ను డిమాండ్‌చేశారు. శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపిస్తూ వారు విజయవాడలో గురువారం నుంచి ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. ధర్నాచౌక్‌లో దీక్ష చేయాలనుకున్నామని, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో రహస్య ప్రదేశంలో దీక్షకు దిగాల్సి వచ్చిందని వారు తెలిపారు. ఇప్పుడు ఇక తన కుమారుడి కోసం ప్రాణాలకు తెగించే ఆమరణదీక్ష చేస్తున్నానని తల్లి సావిత్రమ్మ స్పష్టం చేశారు. ఈ కేసులో జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి దళిత, మైనారిటీ, గిరిజనులు అండగా నిలవాలని కోరారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి రావాల్సిందే
స్వయం సహాయక సంఘాలకు ఫోన్‌కాల్స్ వాట్సాప్ సందేశాలు

విజయవాడ : విజయవాడ స్వరాజ్యమైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి స్వయం సహాయక సంఘాల మహిళలను బలవంతంగా తరలిస్తున్నారు. దీనికి సంబంధించి యానిమేటర్లు ఆయా సంఘాల ప్రతినిధులకు వాట్సాప్‌లో సందేశాలు పంపారు. ఈ ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సభకు స్వయం సహాయక సంఘాల సభ్యులంతా తప్పక హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు.

స్కిల్ కేసు విచారణ 23కు వాయిదా

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో సీఐడీ అధికారులు కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను అందజేయాలని కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణతోపాటు కొంతమంది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. కేసులో అప్రూవర్‌గా మారిన శిరీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదు చేసే క్రమంలో ఈ డాక్యుమెంట్లను అందజేయాలని వారు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో గురువారం విచారణ సాగింది. తదుపరి విచారణను ఈ నెల 23కి కోర్టు వాయిదా వేసింది.

వెటర్నరీ అసిస్టెంట్స్ పరీక్ష ఫలితాలు విడుదల

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులకు గత నెల 31న ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. పరీక్ష ఫలితాలను సీఎం జగన్ విడుదల చేస్తారని పశుసంవర్ధకశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది 'ఎక్స్'లో వెల్లడించారు. కానీ వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షల్లో ఎంత మంది ఉత్తీర్ణులయ్యారో మీడియాకు సమాచారం ఇవ్వలేదు. ఫలితాలను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ వెబ్‌సైట్‌లో మాత్రమే అందుబాటులో ఉంచారు.

రామానాయుడు స్టూడియోపై సుప్రీంలో పిటిషన్

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమిలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనువుగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయడం, లేఅవుట్‌కు ఆమోదం తెలపడంపై విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్వీకరించింది. మధురవాడ రెవెన్యూ గ్రామ పరిధిలో గల కొండపై 34 ఎకరాలను 2002లో అప్పటి ప్రభుత్వం రామానాయుడుకు స్టూడియో నిర్మాణం నిమిత్తం కేటాయించింది. దానిని సినిమా షూటింగ్‌లకు మాత్రమే వినియోగించాలి. రెవెన్యూ చట్టాలకు సంబంధించి బీఎస్‌వో-24 ప్రకారం ఏ అవసరానికైతే భూమి కేటాయించారో అందుకు తప్ప ఇతరత్రా పనులకు వినియోగించకూడదు. ఒకవేళ తప్పనిసరైతే భూ వినియోగ స్వరూపాన్ని మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలి. కానీ అవేమీ లేకుండా రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమి వినియోగానికి సంబంధించి వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్‌లో మిక్స్‌డ్ యూజ్ అని మార్పులు చేసి, లేఅవుట్ ఏర్పాటుచేశారని వెలగపూడి పిటిషన్‌లో పేర్కొన్నారు. తక్షణమే రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూమి వినియోగ మార్పిడికి సంబంధించి వీఎంఆర్‌డీఏ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు.

ఊపిరాగినా.. నలుగురికి ప్రాణదానం!

▸▸ బ్రెయిన్‌డెడ్ అయిన విద్యార్థి నుంచి గుండె, లివర్, కిడ్నీల సేకరణ

▸▸ స్విమ్స్‌లో ఏక కాలంలో నలుగురికి అమర్చిన వైనం


గొల్లపల్లి హేమకుమార్

తిరుపతి సిటీ, జనవరి 18: బ్రెయిన్ డెడ్ అయిన ఓ యువకుడు.. తన ప్రాణం పోయినా మరో నలుగురి ప్రాణాలను నిలబెట్టాడు. అతడి నుంచి సేకరించిన అవయవాలను ఏక కాలంలో నలుగురికి అమర్చిన అరుదైన సంఘటన గురువారం తిరుపతి స్విమ్స్ వైద్యశాల, శ్రీపద్మావతి హృదయాలయంలో జరిగింది. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం సామనత్తం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి హేమకుమార్(24) ఈనెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వైద్యులు వారి తల్లిదండ్రుల అనుమతితో హేమకుమార్ అవయవాలను సేకరించి ఒకేసారి ముగ్గురికి తిరుపతిలోనే అమర్చారు. గుంటూరుకు చెందిన 29 ఏళ్ల వ్యక్తికి హృదయాలయంలో గుండెను అమర్చారు. లివర్‌ను పలమనేరు మండలం గంగవరానికి చెందిన 53 ఏళ్ల మహిళకు అమర్చారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలానికి చెందిన 51 ఏళ్ల మహిళకు ఒక కిడ్నీని అమర్చగా, మరొక కిడ్నీని నెల్లూరు జిల్లాకు చెందిన 37 ఏళ్ల మహిళకు అమర్చారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో దేశంలోనే ఎక్కడా చేయనటువంటి అరుదైన అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలను ఏకకాలంలో విజయవంతంగా స్విమ్స్‌లో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా టీటీడీ జేఈవో సదా భార్గవి మీడియాకు వెల్లడించారు. బుధవారం రాత్రి మొదలుకుని గురువారం తెల్లవారుజామున 3.44 గంటల్లోపు ఈ శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు.

యాంటీబయాటిక్స్ రాస్తే.. కారణం చెప్పాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా మరణించారని, 49 లక్షల మంది ఔషధ నిరోధకత ఇన్ఫెక్షన్లతో చనిపోయారని గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఔషధాలకు లొంగని రోగ కారక సూక్ష్మక్రిములు పుట్టటానికి యాంటీబయాటిక్‌ల దుర్వినియోగం, అదుపు లేని వాడకమే ప్రధాన కారణం. ఇవి కలిగించే ఇన్ఫెక్షన్లకు సమర్థవంతమైన చికిత్స లేకుండా పోతోంది. దానివల్ల రోగులు చాలారోజుల పాటు ఇన్ఫెక్షన్లతో సతమతమవుతున్నారు. విపరీతమైన అధిక ధరలుండే ఈ ఔషధాలు (యాంటీబయాటిక్‌లు) రోగులను ఆరోగ్యపరంగా నాశనం చేస్తున్నాయి. దీర్ఘకాలంపాటు రోగాల బారిన పడి వారు ప్రాణాలు కోల్పోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, వివేకవంతంగా యాంటీబయాటిక్‌లను వాడాలని దేశంలోని వైద్యులకు హితవు పలికారు. ఈ మేరకు యాంటీబయాటిక్‌లను సిఫార్సు చేసే ముందు దానికి గల కచ్చితమైన కారణాలను ప్రిస్క్రిప్షన్‌లో పేర్కొనాలని స్పష్టం చేశారు. అర్హతలున్న వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల వాళ్లు ఎవరికీ యాంటీబయాటిక్‌లను విక్రయించకూడదని ఈ లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఎంఆర్ సమస్య మరింత తీవ్రరూపం దాల్చితే దానిని ఎదుర్కోవాల్సింది రాబోయే తరం వైద్యులే కాబట్టి, డాక్టర్లను తయారు చేసే మెడికల్ కాలేజీలకు ఈ లేఖ పంపించామని తెలిపారు. 'యాంటీ మైక్రోబియల్ నిరోధకత ఒక నిశ్శబ్ద మహమ్మారి. దీనివల్ల 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా కోటి మందికిపైగా మరణించే ప్రమాదం ఉంది' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గతంలోనే హెచ్చరించింది.

పెన్సిల్ ముల్లుపై హనుమంతుడు

▸ అయోధ్య రామాలయానికి బహూకరణ





నక్కపల్లి, జనవరి 18: సూక్ష్మ కళలో అనేక అద్భుతాలు చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన గట్టెం వెంకటేశ్ తాజాగా పెన్సిల్ ముల్లుపై హనుమంతుడిని అద్భుతంగా చెక్కారు. 2 సెంటీమీటర్ల పొడవు, 1.2 సెంటీమీటర్ల వెడల్పుతో హెచ్‌బి పెన్సిల్ ముల్లుపై హనుమంతుడి రూపాన్ని తయారు చేయడానికి నాలుగు గంటల సమయం పట్టిందని చెప్పారు. ఈ కళారూపాన్ని అయోధ్య రామాలయానికి పంపిస్తున్నానని వెంకటేశ్ చెప్పారు.

జనన ధ్రువీకరణకు ఆధార్ చెల్లదు: ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, జనవరి 18: ఈపీఎఫ్‌ఓ ఖాతాదారులకు జనన ధృవీకరణకు ఇకపై ఆధార్ చెల్లుబాటు కాదని ఆ సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆధార్ సంస్థ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఆధార్ చట్టం 2016 ప్రకారం... 'ఆధార్ సంఖ్య కేవలం ప్రత్యేక గుర్తింపు మాత్రమే. అది ఎంత మాత్రమూ జనన ధృవీకరణ పత్రం కాదు.' అనేక కోర్టులు తమ తీర్పుల్లో, తాజాగా ముంబయి హైకోర్టు ఓ తీర్పులోనూ ఈ విషయాన్ని స్పష్టం చేయడంతో ఆధార్ సంస్థ ఆమేరకు విస్పష్టమైన సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అనుమతితో ఈపీఎఫ్‌ఓ తన వెబ్‌సైట్‌లో ఆమేరకు మార్పులు చేయాలంటూ అంతర్గత ఆదేశాలు జారీ చేసింది. జోనల్, రీజనల్ కార్యాలయాలు సవరించిన నిబంధనలను తప్పనిసరిగా వెంటనే అమల్లోకి తీసుకొని రావాలంటూ ఆదేశాలు జరీ చేసింది. ఇక నుంచి జనన ధృవీకరణకు చెల్లుబాటు అయ్యే పత్రాల జాబితాను ప్రకటించింది. జనన, మరణాల రిజిస్ట్రార్ జారీ చేసే జనన ధృవీకరణ పత్రం, విశ్వవిద్యాలయం ఇచ్చే మార్కుల జాబితా, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, స్కూల్ టీసీ, సర్వీసు రికార్డుల ఆధారంగా ఇచ్చే పత్రం, పాన్ కార్డు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే పెన్షన్ ఆర్డర్, ప్రభుత్వం జారీ చేసిన నివాస ధృవీకరణ పత్రం, సివిల్ సర్జన్ జారీ చేసిన సర్టిఫికెట్ మాత్రమే ఈపీఎఫ్‌లో జనన ధృవీకరణకు అంగీకరిస్తారు.

లొంగిపోయేందుకు గడువు పెంచండి

▸ సుప్రీంకోర్టులో బిల్కిస్ కేసు ముద్దాయిల పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 18: లొంగిపోయేందుకు గడువును పెంచాలని కోరుతూ బిల్కిస్ బానో కేసులోని అయిదుగురు ముద్దాయిలు గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్ అల్లర్ల సందర్భంగా బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేయడంతో పాటు ఆమె కుటుంబంలోని ఏడుగుర్ని హత్య చేసినందుకు 11 మందికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే గుజరాత్ ప్రభుత్వం వారి శిక్షను తగ్గించి 2022లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున విడుదల చేసింది. దీన్ని సవాలు చేస్తూ బాధితురాలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేస్తూ ఈ నెల 8న ఆదేశాలు ఇచ్చింది. ముద్దాయిలంతా రెండు వారాల్లో లొంగిపోయి జైలు శిక్షను అనుభవించాలని తెలిపింది. ఆ మేరకు వారు ఈ నెల 21లోగా లొంగిపోవాల్సి ఉంది. కానీ వివిధ వ్యక్తిగత కారణాలను చూపుతూ తాము లొంగిపోయేందుకు గడువు పెంచాలని కోరుతూ వారిలో అయిదుగురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. లొంగిపోయేందుకు సమయం దగ్గర పడుతుండడంతో శుక్రవారమే విచారణ జరపాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వి.చితంబరేశ్ కోరారు.

తరగతి గదిలో ఆగిన విద్యార్థి గుండె

▸ పాఠాలు వింటూ గుండెపోటుతో 18 ఏళ్ల యువకుడి మృతి

ఇండోర్, జనవరి 18: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దారుణం జరిగింది. తరగతి గదిలో పాఠాలు వింటున్న ఓ 18 ఏళ్ల యువకుడు గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణం వదిలాడు. ఇండోర్‌కు చెందిన మాధవ్(18) మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమవుతూ స్థానికంగా ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం ఇతర విద్యార్థులతో కలిసి తరగతి గదిలో పాఠాలు వింటున్న మాధవ్ ఒక్కసారిగా తన డెస్క్‌పై వాలిపోయాడు. వెంటనే స్పందించిన పక్క సీటులోని విద్యార్థి మాధవ్ వీపుపై రుద్దుతూ ఉపాధ్యాయుడిని పిలిచాడు. ఆ తర్వాత కొన్ని సెకండ్లకే మాధవ్ తన సీటులో నుంచి కుప్పకూలిపోయాడు. వెంటనే మాధవ్‌నుసమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మాధవ్ కార్డియాక్ అరెస్ట్ లేదా గుండెపోటుకు గురై ఉంటాడని భావిస్తున్నారు.

యాసిన్ మాలిక్ స్వయంగా కాల్చాడు

▸ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగుల హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి

న్యూఢిల్లీ, జనవరి 18: శ్రీనగర్ శివారులో 1990లో నలుగురు భారత వైమానిక దళ సిబ్బందిని కాల్చిచంపిన సంఘటనలో కశ్మీరు వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్ స్వయంగా పాల్గొన్నాడని వైమానిక దళ మాజీ ఉద్యోగి ఒకరు సాక్ష్యం చెప్పారు. యాసిన్ మాలిక్ నేతృత్వంలో రావల్‌పోరా ప్రాంతంలో 1990 జనవరి 25న ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 22 మంది గాయపడ్డారు. ఈ కేసులో తిహాడ్ జైల్లో ఉన్న యాసిన్ మాలిక్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీనగర్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. సంఘటన ప్రత్యక్ష సాక్షి, వైమానిక దళం మాజీ ఉద్యోగి రాజ్వార్ ఉమేశ్వర్‌సింగ్ గురువారం న్యాయస్థానంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యాసిన్ మాలిక్‌ను చూసి ఆయన స్వయంగా దాడిలో పాల్గొన్నారని, కాల్పులు జరిపారని ధ్రువీకరించారు. 1990లో జేకేఎల్‌ఎఫ్ నాయకుడిగా ఉన్న యాసిన్ మాలిక్ ఈ కాల్పుల ఘటన తర్వాత అరెస్టయ్యారు. అభియోగపత్రం నమోదైనా ఇప్పటివరకు విచారణ జరగలేదు. 2018 నుంచి వివిధ కేసుల్లో జైల్లో ఉన్న యాసిన్ మాలిక్‌ను 2019 ఏప్రిల్‌లో ఉగ్రవాదులకు నిధులు సరఫరా చేస్తున్నారన్న అభియోగంపై ఎన్ఐఏ అరెస్టు చేసింది. తిహాడ్ జైలుకు తరలించింది.

ఐఐటీ కాన్పూర్‌లో విద్యార్థిని ఆత్మహత్య

కాన్పూర్, జనవరి 18: ఐఐటీ కాన్పూర్‌లో మరో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మరణించింది. 29 సంవత్సరాల ప్రియాంక జైస్వాల్ గురువారం తన గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. ఝార్ఖండ్‌కు చెందిన ప్రియాంక గత ఏడాది డిసెంబరు 29న ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కాన్పూర్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ కోర్సులో చేరింది. ఆమె మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. త్వరలో ఓ ఫోరెన్సిక్ బృందాన్ని వర్సిటీ క్యాంప్‌ఎకు పంపిస్తామని, విద్యార్థుల ఆత్మహత్యలకు గల కారణాలపై పూర్తి దర్యాప్తు చేస్తామని కాన్పూర్ పశ్చిమ డీజీపీ అకాశ్ పటేల్ వెల్లడించారు. నెల రోజుల్లో ఈ క్యాంపస్‌లో జరిగిన మూడో సంఘటన ఇది. డిసెంబర్ 19న రీసెర్చ్ స్కాలర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా, జనవరి 11 వికాస్ కుమార్ అనే మరో విద్యార్థి ఉరి వేసుకొని మరణించాడు.



రాముడొచ్చాడు!



అయోధ్య గర్భాలయంలోకి రాముడి విగ్రహం

- నదీ జలాలతో అభిషేకించిన అర్చకులు
- అనుష్ఠాన నియమాలు పాటిస్తున్న ప్రధాని
- ఐదు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు
- సైబర్ ముప్పుపై నిపుణుల బృందం

న్యూఢిల్లీ/అయోధ్య, జనవరి 18: రామమందిరం ప్రతిష్ఠా మహోత్సవానికి అయోధ్య సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. నగర వీధులన్నీ తీర్చిదిద్దిన రంగవల్లులతో భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. రామమందిరం గర్భగుడిలో బాల రాముడి విగ్రహాన్ని బుధవారం అర్ధరాత్రి తర్వాత వేద మంత్రోచ్చారణల నడుమ శుభ ముహూర్తంలో ప్రవేశపెట్టారు. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కిన విగ్రహాన్ని లాంఛనంగా సింహాసనంపైకి చేర్చారు. గురువారం ఉదయం రాముడి విగ్రహాన్ని పవిత్ర నదీజలాలతో అభిషేకించారు. అనంతరం గణేశాంబికా పూజ, వరుణ పూజ, చతుర్వేదోక్త పుణ్యాహవచనం తదితర క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మోదీకి బదులుగా ట్రస్టు సభ్యుడు డాక్టర్ అనిల్ విశ్రా దంపతులు పూజల్లో పాల్గొంటున్నారు. 22న ప్రాణప్రతిష్ఠలో భాగంగా శ్రీరాముడి విగ్రహం కళ్లకు ఉన్న గంతలను విప్పనున్నారు. ఆ తర్వాత మోదీ స్వామివారిని దర్శించుకొని హారతి ఇస్తారని ఆలయ వర్గాలు తెలిపాయి.

కొబ్బరి నీళ్లు.. భూ శయనం

బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొననున్న ప్రధాని నరేంద్ర మోదీ కఠిన నియమాలు, ఆచారాలను పాటిస్తున్నారు. అనుష్ఠానంలో భాగంగా నేలపై ఒకే దుప్పటి వేసుకొని నిద్రిస్తున్నారని, కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మనసును, శరీరాన్ని శుద్ధి చేసుకోవడంతో పాటు ఉల్లిపాయ, వెల్లుల్లి, మసాలా దినుసులు లేకుండా ప్రత్యేకంగా వండిన సాత్వికాహారం తీసుకుంటారు.

తిరుమల, ఉజ్జయిని లడ్డూలు సిద్ధం

అయోధ్యలో భక్తులకు ప్రసాదంగా ఇచ్చేందుకు 25 గ్రాముల బరువు కలిగిన లక్ష లడ్డూలను టీటీడీ సిద్ధం చేసింది. గురువారం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్-1లో 350మంది శ్రీవారి సేవకులు ఒక్కో కవర్‌లో రెండు లడ్డూల చొప్పున ప్యాక్ చేశారు. ఇక మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాలేశ్వరుడి ఆలయం నుంచి అయోధ్యకు 5లక్షల లడ్డూలు కానుకగా పంపడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. మరోవైపు.. సైబర్ ముప్పును దృష్టిలో ఉంచుకుని కేంద్ర హోంశాఖ ఓ అత్యున్నత స్థాయి బృందాన్ని అయోధ్యకు పంపింది. బాలరాముని ప్రాణప్రతిష్ఠ ఉత్సవాన్ని దేశ ప్రజలంతా చూసేలా డీడీ న్యూస్, డీడీ నేషనల్ చానెళ్లు ప్రత్యక్ష ప్రసారంచేయనున్నాయి.

ప్రపంచ దేశాల్లో వేడుకలు

రామమందిర ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఒక్క అమెరికాలోని ఆలయాల్లోనే డజనుకు పైగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 20న వాషింగ్టన్ డీసీలోని భక్త ఆంజనేయ ఆలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహణకు వీహెచ్‌పీ ఏర్పాట్లు చేస్తోంది. అలాగే, న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ వద్ద 22న సామూహిక వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో భారీగా శ్రీరాముడి రథ యాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 21న విశ్వకల్యాణ యజ్ఞం, పూజల అనంతరం చారిత్రక డెలకెపెల్లె ప్రాంతం నుంచి ఈఫిల్ టవర్ తదితర అనేక ముఖ్యమైన ప్రాంతాలకు రథయాత్ర జరుపనున్నారు. ఈఫిల్ టవర్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలాపన, ప్రసాదం పంపిణీ నిర్వహించనున్నారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని కింగ్‌స్లే పార్కు, సిడ్నీలోని పర్రమట్ట పార్కుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఆఫ్రికా ఖండంలోని కెన్యా, టాంజానియా, ఉగాండా, మారిషస్, ఘనా, నైజీరియా, మొజాంబిక్ తదితర దేశాల్లోనూ వేడుకలకు వీహెచ్‌పీ సన్నాహాలు చేస్తోంది. కాగా, దాయాది దేశమైన పాకిస్థాన్ ఎక్స్ వేదికగా రామమందిరానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతూ, బాబ్రీ మసీదుకు మద్దతు తెలుపుతోంది. అసలైన రామమందిరానికి 3కిలోమీటర్ల దూరంలో ఈ రామమందిరాన్ని నిర్మిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది. మరోవైపు.. ఈనెల 22న తాను గొప్ప పార్టీ ఇవ్వనున్నట్లు పాక్ సీనియర్ జర్నలిస్టు ఆర్జూ కజ్మీ ప్రకటించారు. దీంతోపాటు రెండు హిందూ కుటుంబాలను తాను దత్తత తీసుకోనున్నట్లు ఆమె ప్రకటించారు.

స్టాంపుల పుస్తకం ఆవిష్కరణ

అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన స్మారక పోస్టల్ స్టాంపులను ప్రధాని మోదీ గురువారం విడుదల చేశారు. ఇందులో రామమందిరం, వినాయకుడు, హనుమంతుడు, జటాయువు, గుహుడు, శబరి చిత్రాలతో కూడిన ఆరు స్టాంపులు ఉన్నాయి. ఈ డిజైన్‌లో రామమందిరం నమూనా, 'మంగళ్ భవన్ అమంగళ్ హారీ' పంక్తులు, సూర్యుడు, సరయూ నది, ఆలయం లోపల, చుట్టుపక్కల ఉండే శిల్పాలు ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే ప్రపంచ వ్యాప్తంగా శ్రీరాముడిపై విడుదలైన స్టాంపులతో రూపొందించిన పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించారు. 48 పేజీల ఈ పుస్తకంలో అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కంబోడియా వంటి 20కి పైగా దేశాలతో పాటు ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన స్టాంపులను పొందుపర్చారు.

22న కేంద్ర ఉద్యోగులకు సగం రోజు సెలవు

అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ నెల 22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నిటికీ సగం రోజు సెలవు ఇవ్వనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగులు వేడుకలను వీక్షించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర సంస్థలు 22న మధ్యాహ్నం 2.30 గంటల వరకూ మూసి ఉంటాయని ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సైతం 22న సగం రోజు మూసి ఉంటాయి. 22న సుప్రీంకోర్టుతో పాటు దేశంలో అన్ని న్యాయస్థానాలకు సెలవు ప్రకటించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కాగా, 22న యూపీలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. గోవా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణాల్లోనూ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

లోకం తీరు



అయోధ్యకు సిరిసిల్ల బంగారు చీర!

▸ హరిప్రసాద్ దంపతుల ప్రతిభ

సిరిసిల్ల/భద్రాచలం/హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో రూపుదాల్చిన ప్రత్యేక పట్టు వస్త్రం అయోధ్య రామాలయానికి చేరనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత కళాకారుల దంపతులు యెల్ది హరిప్రసాద్, రేఖ 20 రోజుల పాటు చేనేత మగ్గంపై శ్రమించి బంగారం, వెండితో కలిపి నేసిన పట్టు చీరపై అయోధ్య రామమందిరం, రామాయణ ఘట్టాల ఇతివృత్తాలను ఆవిష్కరించారు. గతంలో హరిప్రసాద్ జీ20 లోగోను వస్త్రంపై రూపొందించి ప్రధాని మోదీకి కానుకగా పంపారు. మన్‌కీబాత్‌లో ఈ విషయాన్ని మోదీ ప్రస్తావిస్తూ హరిప్రసాద్ కృషిని మెచ్చుకున్నారు. ఈనేపథ్యంలోనే ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హరిప్రసాద్ దంపతులను ఆహ్వానించారు. బంగారు చీరను 26న మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా అయోధ్య రాముడి పాదాల చెంత చీరను ఉంచనున్నారు. ఈనెల 22న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. కాగా, రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో 22న ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రభుత్వాన్ని కోరింది. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌ను కలిసి వీహెచ్‌పీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



పట్టు చీరను పరిశీలిస్తున్న బండి సంజయ్

16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవద్దు

తప్పుదోవ పట్టించే హామీలు, ప్రకటనలు వద్దు

▸ కోచింగ్ సెంటర్లకు కేంద్రం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జనవరి 18: 'మీ పిల్లలను మా కోచింగ్ సెంటర్‌లో చేర్పించండి. మంచి మార్కులు వచ్చేలా చేస్తాం. అద్భుతమైన ర్యాంకు సాధించేలా శిక్షణ ఇస్తాం' అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చే అవకాశం ఇకపై కోచింగ్ సెంటర్లకు ఉండదు! అంతేకాదు.. కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన కొత్త మార్గదర్శకాల ప్రకారం కోచింగ్ సెంటర్లు 16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవడానికీ వీల్లేదు! విద్యార్థుల ఆత్మహత్యలుపెరిగిపోతుండడం, అగ్నిప్రమాదాల ఘటనలు, కోచింగ్ సెంటర్లలో సౌకర్యాలు లేకపోవడం, బోధనా పద్ధతులూ సరిగా లేకపోవడం వంటి అంశాలపై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లను నియంత్రించడంతో పాటు చట్టపరమైన విధివిధానాల రూపకల్పన కోసం కేంద్ర విద్యాశాఖ నూతన మార్గదర్శకాలను ప్రకటించింది. "డిగ్రీ కంటే తక్కువ విద్యార్హత ఉన్నవారిని కోచింగ్ సెంటర్లు ట్యూటర్లుగా నియమించుకోకూడదు. ర్యాంకు గ్యారెంటీ, మంచి మార్కులు సాధించడం ఖాయం వంటి తప్పుదోవ పట్టించే హామీలు ఇవ్వకూడదు. 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న విద్యార్థులను చేర్చుకోరాదు. సెకండరీ స్కూల్ పరీక్షలు పూర్తయిన విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాలి" అని నూతన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. కోచింగ్‌లో నాణ్యత లేదా కోచింగ్ సెంటర్‌లోని సౌకర్యాలు లేదా సెంటర్ సాధించిన ఫలితం వంటి తప్పుదోవ పట్టించే ప్రకటనలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కూడా ప్రచురించరాదని తేల్చిచెప్పింది. అలాగే దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరాల్లో శిక్ష అనుభవించిన వారిని ట్యూటర్లుగా నియమించుకోరాదని తెలిపింది. ట్యూటర్ల విద్యార్హతలు, కోర్సులు/పాఠ్యాంశాలు, కోర్సు గడువు, హాస్టల్ సౌకర్యాలు, వసూలు చేసే రుసుముల వివరాలను కోచింగ్ సెంటర్లు తమ వెబ్‌సైట్లలో తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని.. ఈ క్రమంలో వారి మానసిక ఆరోగ్యం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. కోర్సులో చేరే ముందే మొత్తం ఫీజు చెల్లించిన విద్యార్థులు మధ్యలో వెళ్లిపోవాల్సి వస్తే.. వారికి కోర్సు గడువుకు అనుగుణంగా ఫీజును లెక్కించి, తిరిగి ఇవ్వాల్సిన మొత్తాన్ని 10 రోజుల్లోపు చెల్లించాలని తెలిపింది. ఇక విపరీతమైన ఫీజుల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై విద్యార్థుల ఆత్మహత్యలు సహా ఇతర అవకతవకలకు కారణమైతే కోచింగ్ సెంటర్లకు రూ.లక్ష జరిమానా విధించాలని కేంద్రం సూచించింది. కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన మూణ్నెల్లలోపు కోచింగ్ సెంటర్లన్నింటినీ (ఇప్పటికే ఉన్నవి, కొత్తవి) రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపింది. కోచింగ్ సెంటర్ల పర్యవేక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకూ ఉంటుందని స్పష్టం చేసింది.

ఇరాన్‌పై పాక్ ప్రతీకారం

సిస్తాన్-బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై వైమానిక దాడులు.. తొమ్మిది మంది మృతి!

ఇస్లామాబాద్, జనవరి 18: ఓవైపు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలపై అమెరికా దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత. ఇరాన్-పాకిస్థాన్ వివాదం చినికిచినికి గాలివానలా మారింది. తమ దేశంలోని బలూచిస్థాన్‌పై దాడికి దిగిన ఇరాన్ మీద పాక్ ప్రతీకారం తీర్చుకుంది. గురువారం ఇరాన్‌లోని సిస్థాన్-ఓ-బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై దాడులకు పాల్పడింది. ఏడు ప్రదేశాల్లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించింది. ఈ ఘటనల్లో నలుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ప్రాణాలు కోల్పోయారు. సిస్థాన్-ఓ-బలూచిస్థాన్.. ఇరాన్ సరిహద్దుల్లో 80కిలోమీటర్ల లోపలకు ఉంటుంది. టెహ్రాన్‌లోని తమ రాయబారిని వెనక్కుపిలిచి ఉన్నత స్థాయి ద్వైపాక్షిక పర్యటనలను రద్దుచేసి.. ప్రతీకారం తప్పదని హెచ్చరించిన మరుసటి రోజే పాక్ దాడులకు దిగడం గమనార్హం. నిఘా వర్గాల సమాచారం మేరకు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని.. ఈ రెండు సంస్థల సభ్యులు గెరిల్లా తరహాలో తమ దేశంలో పలు దాడులకు పాల్పడ్డాయని పాక్ తెలిపింది. కొందరు ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొంది. మరోవైపు తమ దేశానికి చెందిన గెరిల్లా ఉగ్రవాదులు ఇరాన్‌ను సురక్షితస్థావరంగా చేసుకుని అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని పలుమార్లు హెచ్చరించినా చర్యలు తీసుకోలేదని..తమను తాము రక్షించుకోవాల్సినరీత్యా స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ పేర్కొంది. తాజా పరిణామా లతో సరిహద్దుల్లో భారీయుద్ధ విన్యాసాలు చేపట్టాలని ఇరాన్ నిర్ణయించింది. కాగా దాడులను ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తూ పాక్ చార్జ్ డి అఫైర్స్‌కు సమన్లు జారీచేసింది. వివరణ ఇవ్వాలని కోరింది. పాక్ దాడుల్లో తమ పౌరులు 9మంది చనిపోయినట్లు ఇరాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి అహ్మద్ వాహిది, సిస్తాన్-ఓ-బలూచిస్తాన్ డిప్యూటీ గవర్నర్ అలీ రెజా మర్హమతి ధ్రువీకరించారు. కాగా, పాక్‌లోని ఇరాన్ రాయబారి ప్రస్తుతం స్వదేశంలో ఉన్నారు. ఆయనను తిరిగిరావొద్దంటూ పాక్ విదేశాంగ శాఖ ఆదేశించింది. ఇరాన్‌తో తమది సోదర బంధం అని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటామని.. జాతీయ భద్రత, సార్వభౌమత్వంపై మాత్రం రాజీ పడే ప్రసక్తేలేదని పాక్ అధ్యక్షుడు అరిఫ్ అల్వీ తెలిపారు. ఇదిలా ఉండగా తాజా ఉద్రిక్తతలు ఇరాన్-పాక్ మధ్య సమస్యగా భారత్ అభివర్ణించింది. ఆయా దేశాలు ఆత్మరక్షణ చర్యలను అర్థం చేసుకోగలమని పేర్కొంటూ, ఉగ్రవాదంపై పోరాటంలో తమది రాజీలేని ధోరణి అని స్పష్టం చేసింది. ఇరాన్ ఉల్లంఘనలే ఈ పరిస్థితికి కారణమని.. ఆ దేశానిదే తప్పని అమెరికా వ్యాఖ్యానించింది. ఉద్రిక్తతలు మరింత పెరిగేలా వ్యవహరించవద్దని చైనా సూచించింది.

మణిపూర్‌లో ఆగని హింస

▸ పలు జిల్లాల్లో సాయుధ మూక కాల్పులు

▸ ఐదుగురి మృతి, ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బందికి గాయాలు

ఇంఫాల్, జనవరి18: మణిపూర్‌లో రెండు తెగల మధ్య కొన్ని నెలల క్రితం మొదలైన హింసాత్మక ఘటనలు ఆగడంలేదు. మోరెలో బుధవారం ఇద్దరు పోలీసులను హత్య చేసిన సాయుధ మూక.. అర్ధరాత్రి వరకు పలు చోట్ల కాల్పులకు పాల్పడింది. ఈ కాల్పుల్లో ఓ వాలంటీర్‌తోపాటు ఐదుగురు పౌరులు మృతిచెందగా.. ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బందికి గాయాలయ్యాయి. మొదటగా థౌబాల్ జిల్లాలోని ఖాంగబాక్‌లో 3వ ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ లక్ష్యంగా దుండగులు ఆయుధాలతో కాల్పులు జరిపారు. కనీస సిబ్బందితోనే బలగాలు వారిని తిప్పికొట్టాయి. ఆ తర్వాత సాయుధ మూక థౌబాల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడికి పాల్పడింది. మూకలోని పలువురు ఆయుధాలతో సిబ్బందిపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో బీఎస్ఎఫ్‌కు చెందిన ఇద్దరు ఏఎస్ఐలు, ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో పోలీసులు జిల్లాలో కర్ఫ్యూ విధించారు. అత్యవసరమున్న వారినే బయటకు అనుమతిస్తున్నారు. అలాగే ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పి, బిష్ణుపూర్ జిల్లాల్లోనూ కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో తండ్రీకొడుకులతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. అలాగే కాంగ్‌పోక్పి జిల్లా కాంగ్‌చుప్ గ్రామంలో జరిగిన కాల్పుల్లో గ్రామ వాలంటీర్ మృతి చెందాడు. పౌరుల మృతిని నిరసిస్తూ మహిళలు ఇంఫాల్‌లో గురువారం సీఎం బంగ్లా మీదుగా, రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. భద్రతా బలగాల యూనిఫైడ్ కమాండ్ అధికారిని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. రాజ్‌భవన్‌కు 300మీటర్ల దూరంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు.



సహాయక చర్యలు చేపడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

బోటు బోల్తా.. 16 మంది మృతి

▸ వారిలో 14 మంది పాఠశాల విద్యార్థులు.. గుజరాత్‌లో ఘోరం

వదోదరా, జనవరి18: గుజరాత్‌లో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో విహార యాత్ర విషాదంగా మారింది. వదోదరాలోని హర్ణీ సరస్సులో గురువారం పడవ బోల్తా పడడంతో కనీసం 16మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 14 మంది పాఠశాల విద్యార్థులు, ఇద్దరు వారిని తీసుకొచ్చిన ఉపాధ్యాయులు ఉన్నారు. పిక్నిక్‌కు వచ్చిన వారంతా మధ్యాహ్నం సరస్సులో బోటు షికారుకు బయలుదేరారు. ఆనందంగా సాగుతున్నామని అనుకుంటున్న సమయంలో అది బోల్తాపడింది. సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడం వల్లనే ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. తొలుత ప్రమాదాన్ని చూసిన స్థానికులు విద్యార్థులను రక్షించే ప్రయత్నాలు చేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ జవాన్లు వచ్చి సహాయ చర్యల్లో పాల్గొన్నారు. ఒడ్డుకు తీసుకువచ్చిన వారందర్నీ హుటాహుటిన సమీపంలోని ఎస్ఎస్‌జీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సరికే 15 ఏళ్ల వయసున్న ఒక బాలుడు, ఇద్దరు బాలికలు, 45 ఏళ్ల వయసున్న ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు విడిచారు. చికిత్స పొందుతూ మిగిలిన వారు కన్నుమూశారు. దీనిపై వదోదరా జిల్లా కలెక్టర్ ఎ.బి.గోర్ మాట్లాడుతూ బోటులో 27 మంది పాఠశాల విద్యార్థులు ప్రయాణించారని చెప్పారు. అయితే వారెవరి దగ్గరా లైఫ్ జాకెట్లు లేవని తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఇదే కారణంగా కనిపిస్తోంది. మరణించిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.6 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించాయి. గాయపడ్డ వారికి రూ.లక్ష వంతున పరిహారం ఇవ్వనున్నాయి. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల వంతున, గాయపడ్డ వారికి రూ.50వేల వంతున సహాయం ప్రకటించారు. ఈ ప్రమాదం హృదయ విదారకరమని రాష్ట్ర ప్రభుత్వం వ్యాఖ్యానించింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల వంతున, గాయపడ్డవారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించింది. ప్రమాదానికి బాధ్యులైన వారిని శిక్షిస్తామని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే కేయూర్ రొకాడియా చెప్పారు. బోటు సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని తెలిపారు.



హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న రామకృష్ణ, బాలకృష్ణ, భువనేశ్వరి, జూ.ఎన్టీఆర్, కల్యాణ్ రామ్

ప్రజల మనిషి.. ఎన్టీఆర్!

» వర్ధంతి సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడికి ఘన నివాళులు

» జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం..

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు 28 వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబసభ్యులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ప్రజల మనిషి ఎన్టీఆర్ అని.. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వేకువజామునే ఎన్టీఆర్ ఘాట్ వద్ద సోదరుడు కల్యాణ్‌రామ్‌తో కలసి జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పించారు. అనంతరం టీడీపీ చీఫ్ చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, ఆమె సోదరులు బాలకృష్ణ, రామకృష్ణ తదితరులు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి నివాళులర్పించారు. ఎన్టీఆర్ అంటేనే గుర్తుకు వచ్చేది క్రమశిక్షణ.. ఆయన ప్రజల మనిషి అని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన 'లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇటు బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులతో బ్రాహ్మణి ఆస్పత్రిలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం..

ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆయన ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే... వర్ధంతి సందర్భంగా ఇలాంటి హంగామా సరికాదనే అభిప్రాయంతో ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల సూచన మేరకు బాలకృష్ణ అభిమానులు వాటిని తొలగించారు. దీనిపై సోషల్ మీడియాలో వివాదం చెలరేగింది.

టీడీపీలోకి రూపానందరెడ్డి

» గడ్డె బాబూరావు సహా పలు నియోజకవర్గాల నేతలు కూడా..

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వైసీపీ నేత ముక్కా రూపానందరెడ్డి గురువారం భారీ జనసందోహం నడుమ తెలుగుదేశం పార్టీలో చేరారు. రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆయన అనుచర గణంతో ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయం కిటకిటలాడింది. ఎంతో దూరంలో ఉన్నప్పటికీ వారంతా వాహనాల్లో తరలివచ్చారు. వారి రాక ఆలస్యం కావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా కొంతసేపు వేచి ఉండాల్సి వచ్చింది. ఇదే సమయంలో మరి కొన్ని నియోజకవర్గాల నేతలు కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిలో చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, ఆయన కుమారుడు అనురాగ్, శ్రీకాకుళం నగరానికి చెందిన రెడ్డి చిరంజీవి, మడకశిర నియోజకవర్గానికి చెందిన రమేశ్, ఆదినారాయణ, కదిరి నియోజకవర్గానికి చెందిన నేతలు ఉన్నారు.



టీడీపీలో చేరిన రూపానంద రెడ్డికి పార్టీ కండువా కప్పుతున్న బాబు

జగన్‌కు.. అధికారం అంటే దోపిడీ!



గుడివాడ సభలో చంద్రబాబు ప్రసంగానికి మద్దతుగా కార్యకర్తల కోలాహలం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న పోరాటమంటూ మాట్లాడతాడని ధ్వజమెత్తారు. గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు తదితరుల నేతృత్వంలో గురువారం సాయంత్రం కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 'రా.. కదలిరా' సభలో చంద్రబాబు పాల్గొన్నారు. మచిలీపట్నం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 100 పథకాలను జగన్ ఆపేశారని చంద్రబాబు ఈ సందర్భంగా విమర్శించారు. ఇందులో బీసీలకు 30 పథకాలు, ఎస్సీలవి 27, ఎస్టీ, మైనారిటీలకు చెందిన 43 పథకాలు ఉన్నాయన్నారు. 'జగన్ పనికిమాలిన పనులు తప్ప పనికి వచ్చే ఒక్క పని కూడా చేయడు.. దానికి పథకాల నిలిపివేతే నిదర్శనం. భూరక్ష చట్టమని తీసుకొచ్చాడు. అది భూరక్ష కాదు.. భూభక్ష. రేపు మీ భూములను లాగేసుకునే చట్టం టీడీపీ అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం' అని ప్రకటించారు. ఎన్నికలు రానున్న తరుణంలో జగన్ మళ్లీ అధికారం కోసం మీ బిడ్డనంటూ వస్తాడని.. బిడ్డ కాదు.. రాష్ట్రానికి కేన్సర్ గడ్డ అని ముఖం మీదే చెప్పాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

బాబాయిని చంపించి..

బాబాయిని చంపించిన వ్యక్తి.. కేసు నుంచి బయటపడేందుకు ఆయన కూతురిపై కేసులు పెట్టించాడు.. సీబీఐపై కేసులు పెట్టాడు. కోడి కత్తి శీను పరిస్థితి ఏమైందో మనమంతా చూశాం. తన అధికారం కోసం ఓ దళిత యువకుడిని ఐదేళ్లుగా జైలుకే పరిమితం చేశాడు. ఎన్టీఆర్ మహిళలకు సమాన ఆస్తి హక్కు చట్టం తీసుకొస్తే, జగన్ సొంత చెల్లికి ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వలేదు. నిన్నటి వరకు జగనన్న బాణం అంటూ తిరిగిన షర్మిల.. నేడు ఏం చేస్తున్నారో మీరంతా చూస్తున్నారు.

బూతులు తిడితే పదవులు..

వైసీపీకి అభివృద్ధి పట్టదు. బూతుశ్రీ బిరుదు ఉంటే ఎమ్మెల్యే పదవి, బూతురత్నకు ఎంపీ పదవి. బూతు స్మార్ట్‌కు ఏకంగా మంత్రి పదవి ఇస్తారు. సీఎంగా అర్హత లేని వ్యక్తి ఆ పదవిలో కూర్చున్నాడు. ఎంపీగా గెలిచిన వ్యక్తి ఢిల్లీ నుంచి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తేవాలి. కానీ ఇక్కడ సీఎం సీటులో కూర్చున్న సైకో మాత్రం ఎంపీలను అవేవీ అడగడు... చంద్రబాబును తిట్టావా.. లోకేశ్‌ను తిట్టావా... పవన్ కల్యాణ్‌ను తిట్టావా అని మాత్రమే అడుగుతాడు. దానికి సాక్ష్యంగా వీడియోలు చూపించమంటాడు. ఇలాంటి సీఎం మనకు అవసరమా? కర్నూలు నుంచి గెలిచిన ఓ వైసీపీ ఎంపీ ఐదేళ్లలో తనకు జగన్ అపాయింట్‌మెంటే ఇవ్వలేదని వాపోయాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బూతుల మంత్రులూ.. జాగ్రత్తగా ఉండండి.

ప్యాలెస్‌లో సెట్టింగ్..

నా సతీమణి భువనేశ్వరి.. తల్లి పిలుస్తోంది రా అనే పిలుపుతో వచ్చారు. ప్రతి ఒక్కరూ పండగులకు సొంత ఊళ్లకు వచ్చి తల్లిదండ్రులతో సొంత ఊరి వారితో గడపాలన్న లక్ష్యంతో ఆ పిలుపు ఇచ్చాం. దానికి స్పందించి అందరూ సొంత ఊరికి వస్తే.. జగన్ మాత్రం ఇంటి పక్కనే ప్రజల సొమ్ముతో కోట్లు ఖర్చు పెట్టి గుడి సెట్టింగ్ వేసి అక్కడకు వెళ్లారు.



ఇప్పటి వరకు అధికార పార్టీ వేధింపులను చవిచూసిన టీడీపీ, జనసేన కార్యకర్తలు ఇక ఎవరైనా ఎదురొస్తే బడితపూజ చేసే పరిస్థితికి వచ్చారు.

చక్రవడ్డీతో చెల్లిస్తాం

వైసీపీ ప్రభుత్వంలో తప్పులు చేసిన వారెవరినీ వదలం. ప్రతి ఒక్కరికీ చక్రవడ్డీతో చెల్లిస్తాం. మొన్న తిరుపతిలో దొంగ ఓట్లు చేర్చారని ఎన్నికల కమిషన్ ఓ ఐఏఎస్ అధికారిపై వేటు వేసింది. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు చేసే పని ఇదా? మీ వద్దకు ఓటు కోసం వచ్చే వైసీపీ నేతలను నిలదీయండి.. బూతుల నేతలు కాదు.. అభివృద్ధి నేతలు కావాలని అడగండి.

తప్పు చేశాడు కాబట్టే..

గత ఎన్నికల సమయంలో ఊరూరా ముద్దులు పెడుతూ.. బుగ్గలు నిమురుతూ తిరిగాడు. ఇప్పుడు పరదాలు కట్టుకుని వాటి మాటున తిరుగుతున్నాడు. తప్పు చేసిన వాడే తప్పించుకుని తిరుగుతాడు. టీడీపీ తప్పు చేయదు. అందుకే ధైర్యంగా తిరుగుతున్నాం.

మహామహులు పుట్టిన గడ్డపై..

భోగరాజు పట్టాభి సీతారామయ్య, చంద్ర రాజేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు, కేఎల్ రావు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, పింగళి వెంకయ్య, ఘంటసాల వీరంతా కృష్ణా జిల్లాలోనే పుట్టారు. బ్రిటిష్ కాలంలో ఇండియన్ క్రికెట్ టీం కెప్టెన్‌గా పనిచేసిన సీకే నాయుడు బందరువాసి. ఎన్టీఆర్ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డ గుడివాడ. ఇలాంటి మహామహులు పుట్టిన తులసీవనంలాంటి కృష్ణా తీరంలో నేడు గంజాయి మొక్కలు పుడుతున్నాయి. వాటిని ఏరివేయాలి. ఎమ్మెల్యేల్లో ఒకరేమో సంక్రాంతి సంబరాలంటూ పింఛను డబ్బులను పేదల నుంచి గుంజుకుంటాడు.. మరొకరు కేసినోలు పెట్టి ప్రజలను దోచుకుంటారు. ఇలాంటి వారా మనకు ఎమ్మెల్యేలు? టీడీపీ ఎవ్వరినీ వదిలిపెట్టదు. ముందు ముందు అందరి కథా తేలుస్తాం. త్వరలోనే అందరి పని పడతాం. ఇంకో మంత్రి అప్పులు చేయడానికే ఆర్థిక మంత్రి. ఆ అప్పులను మళ్లీ ప్రజలే తీర్చాలి.

నేడు కమలాపురంలో..

చంద్రబాబు శుక్రవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. కడప పార్లమెంటు పరిధిలోని కమలాపురంలో 'రా.. కదలిరా' బహిరంగసభలో పాల్గొంటారు.

సిగ్గులేని పార్టీ..

ఎవరికో పుట్టిన బిడ్డను నా బిడ్డ అని ఎవరైనా చెప్పుకొంటారా? మా హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లకు తన రంగులేసుకున్న సిగ్గులేని పార్టీ వైసీపీ. 90 శాతం కట్టిన ఇళ్లను పూర్తి చేసి ఇవ్వడం చేత కాదు.. రంగులేసుకోవడం మాత్రం వచ్చు. 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేనివారు మూడు రాజధానులు కడతారంటే ఎవరైనా నమ్ముతారా? గుడివాడ బూతుల ఎమ్మెల్యేది అభివృద్ధి నిల్ అవినీతి ఫుల్. ఈ ఎమ్మెల్యే వేధింపులకు ఆయన అనుచరుడు వంకా విజయ్ ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దమల్లు ఆంజనేయులు అనే వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. గుడివాడకు ప్రధానసమస్య మీఎమ్మెల్యేనే.చిత్తుచిత్తుగా ఓడించండి.



ఉండవల్లిలోని నివాసంలో రక్తదానం చేస్తున్న లోకేశ్

పేదరికం లేని సమాజమే లక్ష్యం

» ఎన్టీఆర్ సార్మక ట్రస్టు ద్వారా పూర్ టు రిచ్ కార్యక్రమం

» తొలివిడతగా 19 కుటుంబాలకు ప్రయోజనం: చంద్రబాబు

మచిలీపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా గురువారం నిమ్మకూరులో ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక పేదరికం లేని సమాజం చూడాలని నిరంతరం పరితపించేవారన్నారు. నిమ్మకూరునుంచి పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేసి ప్రారంభించామన్నారు. పూర్ టు రిచ్ ప్రాజెక్టు ద్వారా పేదరికం లేకుండా చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయా కుటుంబాల ఆదాయాన్ని ఎలా పెంచాలి, ప్రస్తుతం చేస్తున్న వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించడం ఎలా అనే అంశాలపై ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిరంతర పర్యవేక్షణ తాను చేస్తానన్నారు. నిమ్మకూరును ప్రపంచానికి అనుసంధానం చేసి స్థానికంగానే సంపదను సృష్టిస్తామన్నారు. నిమ్మకూరులో ఈప్రాజెక్టు విజయవంతమైతే రానున్న రోజులలో రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తానని చెప్పారు. నారావారిపల్లెనూ పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. పీ ఫోర్(పూర్‌టు రిచ్) కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులను మంచి పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. తొలివిడతగా నిమ్మకూరులో ఈ ప్రాజెక్టు కింద 19 కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. కాగా, గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఎక్స్ వేదికగా చంద్రబాబు నివాళులర్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. కాగా, ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఉండవల్లిలోని తన నివాసంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో గురువారం లోకేశ్ రక్తదానం చేశారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఎన్టీఆర్, ఎమ్మెస్సెస్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు.



నిమ్మకూరులో ఎన్టీఆర్ దంపతులకు నివాళులర్పిస్తున్న బాబు

ఎన్‌హెచ్‌ఎంలో అవినీతి 'కిరణం'!

» అర్హత లేని అధికారికి అందలం.. క్రిమినల్ కేసులున్నా కీలక పదవి

» సీఎంవో, మంత్రి పేషీ అండదండలు

» డీఎంఈ అభ్యంతరాలు పట్టని ఆరోగ్యశాఖ

» సర్వీసు రెగ్యులరైజ్ కాకపోయినా ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్‌కు సిద్ధం

» 'సురక్ష' సంచుల కొనుగోళ్లలో చేతివాటం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏడాదికి రూ.2,100 కోట్ల బడ్జెట్... 56 కేంద్ర పథకాలు... వేలాది మంది ఉద్యోగులు.. గ్రామీణారోగ్యానికి పట్టుకొమ్మ... ఆరోగ్యశాఖకు వెన్నెముక అయిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగాన్ని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అర్హత లేని అవినీతి అధికారి చేతుల్లో పెట్టారు. జాయింట్ డైరెక్టర్ కేడర్ అధికారిని నియమించాల్సిన చోట ఒక డాక్టర్‌ను కూర్చోబెట్టారు. ఒకవైపు క్రిమినల్ కేసులు, మరోవైపు సర్వీస్ రెగ్యులరైజేషన్ కాని ఆయన్ను ఈ విభాగానికి కీలక అధికారిగా నియమించారు. సీఎంవో, మంత్రి పేషీ అండదండలతో ఆయన చేయని అక్రమాలు లేవు. నిబంధనల ప్రకారం సదరు అధికారి ఆ పోస్టుకు అర్హుడు కారు. నాలుగేళ్ల క్రితం డాక్టర్‌గా వచ్చిన అయనకు ఇప్పటికీ సర్వీస్ రెగ్యులరైజ్ కాలేదు. ఇలాంటి వారికి ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించవు. అయినా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఎన్‌హెచ్‌ఎంలోని కీలకమైన పోస్టును ఆయనకు కట్టబెట్టారు. ఇప్పుడు ఆయన 'ఎవరైతే నాకేంటి.. నేను చేయాల్సింది చేస్తా' అన్నట్లుగా వ్యవహరిస్తూ వారికే పెద్ద తలనొప్పిగా మారారు. ఆయన తీరుతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉండటంతో ఏం మాట్లాడలేని పరిస్థితి నెలకొంది.

డీఎంఈపై తీవ్ర ఒత్తిడి

గత డిసెంబరులో ఏడాది సర్వీస్ డిప్యుటేషన్ పూర్తిచేసుకున్న సదరు అధికారి, అదే సీటులో మరో ఏడాది కొనసాగేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ కొనసాగింపు ఫైల్ డీఎంఈకి చేరింది మొదలు సీఎంవోలోని కీలక అధికారితో ఫోన్లు చేయించి మరీ తీవ్రఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అధికారులు ఫైల్‌ను ఆయన సొంత జిల్లాకు పంపి, పోలీసు విచారణ చేయించారు. విచారణలో ఆయనపై క్రిమినల్ కేసు ఉన్నట్లు తేలింది. పోలీస్ కేసు ఉన్న ఉద్యోగులకు సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసే అవకాశం లేదు. అయినా సీఎంవో, మంత్రి పేషీ నుంచి మళ్లీ ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ విషయంలో డీఎంఈ అధికారులు చేతులెత్తేసినా పట్టువదలకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అదే ఫైల్‌ను రెండోసారి పోలీస్ విచారణకు పంపినా కేసు కొనసాగుతుందని రిపోర్టు రావడంతో తామేం చేయలేమని అధికారులు తేల్చిచెప్పేశారు. అయనకు ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ కొనసాగింపునకు అవకాశం లేదని స్పష్టంగా ఫైల్‌లోనూ నమోదు చేశారు. కానీ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మాత్రం ఆయన సర్వీస్‌ను మరో ఏడాది ఎన్‌హెచ్‌ఎంలోనే కొనసాగించేందుకు ఫైల్ నడిపిస్తున్నారు. విషయాన్ని శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ.కృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్లకుండా కింద నుంచే ఫైల్ ఆమోదించడానికి సిద్ధమవుతుండటంపై విమర్శలొస్తున్నాయి.

సంచుల్లో గోల్‌మాల్...

ఏపీఎంఎస్ఐడీసీ ఎంపిక చేసిన కాంట్రాక్టర్‌తో సదరు అధికారి ముందుగానే పర్సంటేజీలు మాట్లాడుకొని, అవసరం ఉన్నా, లేకున్నా అత్యధికంగా ప్రింటింగ్ ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ సమయంలో కొన్ని ఇబ్బందులతో సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్ చేయమని మెడికల్ కార్పొరేషన్ సూచించింది. దీన్ని లెక్క చేయని అధికారి... కమీషన్లకు కక్కుర్తి పడి రూ.కోట్ల వర్క్‌లు అదే కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తున్నారు. మరోవైపు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆయనకు కాసుల వర్షం కురిపించింది. సురక్ష కేంద్రాలకు వచ్చే రోగులకు ఇచ్చే సంచి ఖరీదు రూ.10 నుంచి రూ.12 వరకూ ఉంటుంది. ఆరోగ్య సురక్ష తొలి విడత కోసం 6లక్షల సంచులను ఒక్కోదానికి రూ.20 చెల్లించి కొనుగోలు చేశారు. దీనికోసమే దాదాపు రూ.12కోట్లు ఖర్చు చేశారు. ఈ వ్యవహారంలో సదరు అధికారికి భారీగా ముడుపులు ముట్టాయి. ఫోల్డర్ల కొనుగోలులో కూడా అవకతవకలకు పాల్పడ్డారు. మరి ఈ అవినీతి అధికారిని ఇంటికి పంపిస్తారో.. లేదా మరో ఏడాది పొడిగింపు ఇచ్చి కొనసాగిస్తారో చూడాలి.

దూరం... దూరంగానే!

» అన్నతో కలివిడిగా ఉండలేని షర్మిల

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'యాంటికబ్బా ఇప్పుడు ఆమె రావడం!'.. అంటూ సోదరి షర్మిలను కలిసేందుకు ఇష్టపడని జగన్! 'అయితే, నా కుమారుడి పెళ్లి కార్డు గేటు దగ్గర సెక్యూరిటీకి ఇచ్చి పోతా' అని చెల్లి షర్మిల స్పందన! దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లెలిని కలిసి, మేనల్లుడి వివాహ పత్రికను జగన్ అందుకున్నారు. ఇది.. మొన్నటి చిత్రం! ఇక.. గురువారం హైదరాబాద్ శివారులోని ఓ రిసార్టులో జరిగిన నిశ్చితార్థ వేడుకలోనూ ఇద్దరి మధ్య విభేదాలు బయటపడ్డాయి. తన భార్య భారతితో కలిసి జగన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు తనకు ఎదురైన అనుభవం వల్ల కాబోలు... జగన్ వేదికపైన ఉన్న ఆ ఒక్క నిమిషం కూడా షర్మిల ఆయనతో కలివిడిగా ఉండలేకపోయారు. స్వయానా సోదరుడు, అందునా రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు రెండు అడుగులు ముందుకు వేసి, ఆహ్వానించి.. కాబోయే కోడలిని పరిచయం చేయడం వంటివి జరగాలి. కానీ... జగన్ దంపతులు వస్తున్నా ఎక్కడున్న షర్మిల అక్కడే నిల్చున్నారు. జగనే ఆమె దగ్గరికి వచ్చి, అలా పలకరిస్తూ ముందుకెళ్లి... మేనల్లుడైన వరుడు రాజారెడ్డికి, వధువు ప్రియా అట్లూరికి పుష్పగుచ్ఛం ఇచ్చారు. తర్వాత అంతా కలిసి ఫొటో దిగుదామంటూ జగన్ పదేపదే షర్మిలను, బావ అనిల్‌నూ పిలిచారు. రెండుమూడుసార్లు చేతులు ఊపినా షర్మిల స్పందించలేదు. అనిల్ అలా రెండు అడుగులు ముందుకు వేసి.. ఇలా వెనక్కి వచ్చారు. చివరికి.. తల్లి విజయలక్ష్మి పిలవడంతో షర్మిల, అనిల్ వచ్చి ఫొటో కోసం నవ్వుతూ నిలబడ్డారు. మొత్తంగా నిమిషం కూడా జగన్ వేదికపై ఉండలేదు!

హాజరైన పలువురు ప్రముఖులు

నిశ్చితార్థ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కాబోయే వధూవరులకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రులు రఘువీరారెడ్డి, జానారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పళ్లం రాజు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, నటుడు మంచు విష్ణు, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు వచ్చారు.

ఐదుగురు సిటింగ్‌లు ఔట్

» హోం మంత్రి వనిత బదిలీ!

» వైసీపీ నాలుగో జాబితా విడుదల

అమరావతి/ఒంగోలు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాలుగో జాబితా గురువారం రాత్రి విడుదలైంది. 8 అసెంబ్లీ, ఒక లోక్‌సభ ఇన్‌చార్జిని మార్చారు. వీరిలో హోం మంత్రి తానేటి వనితను కొవ్వూరు (ఎస్సీ) నుంచి గోపాలపురం (ఎస్సీ) స్థానానికి బదిలీ చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు ఇన్‌చార్జిగా నియమించారు. ఉపముఖ్యమంత్రి, గంగాధర నెల్లూరు (ఎస్సీ) ఎమ్మెల్యే కె.నారాయణస్వామిని చిత్తూరు లోక్‌సభకు పోటీచేయించనున్నారు. అక్కడి ఎంపీ రెడ్డెప్పను గంగాధర నెల్లూరు (ఎస్సీ) ఇన్‌చార్జిగా నియమించారు. తిరువూరు (ఎస్సీ) ఎమ్మెల్యే రక్షణనిధికి సీఎం జగన్ మొండిచేయి చూపారు. ఆయన స్థానంలో ఇటీవలే టీడీపీ నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసుకు అవకాశమిచ్చారు. విజయవాడ లోక్‌సభ ఇన్‌చార్జి కేశినేని నాని స్వామిదాసు పేరును సిఫారసు చేశారు. తాజా జాబితాలో టికెట్లు దక్కని సిటింగ్‌లలో జొన్నలగడ్డ పద్మావతి (శింగనమల-ఎస్సీ), ఆర్థర్ (నందికొట్కూరు-ఎస్సీ), బుర్రా మధుసూదన్ యాదవ్ (కనిగిరి), తిప్పేస్వామి (మడకశిర-ఎస్సీ) కూడా ఉన్నారు. దళితులంటే ప్రభుత్వానికి చులకనంటూ వ్యాఖ్యలు చేసిన శింగనమల (ఎస్సీ) ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని పక్కనపెట్టారు. ఆమె స్థానంలో ఎం.వీరాంజనేయులును ఇన్‌చార్జిగా ప్రకటించారు. నందికొట్కూరులో సిటింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌ను మార్చాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పట్టుబట్టడంతో జగన్ అంగీకరించారు. ఆయన స్థానంలో డాక్టర్ దారా సుధీర్‌ను నియమించారు. తిప్పేస్వామికే మడకశిర (ఎస్సీ) టికెట్ ఇవ్వాలని ఆయన అనుచరులు ఇటీవల వెలగపూడి సచివాలయం వద్ద ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఘెరావ్ చేశారు. దీంతో ఆయనపైనా వేటు పడింది. ఆయన స్థానంలో జక్కప్ప పేరును ప్రకటించారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు కూడా టికెట్ ఇవ్వలేదు. ఆయన బదులు నారాయణ యాదవ్‌కు అవకాశమిచ్చారు. మొత్తంగా నలుగురు ఎస్సీ ఎమ్మెల్యేలను, ఒక బీసీ ఎమ్మెల్యేలను తప్పించారు.



కందుకూరు వెళ్లనన్న బుర్రా!

కనిగిరి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి వియ్యంకుడైన బుర్రా మధుసూదన్ యాదవ్‌కు జగన్ షాకిచ్చారు. గురువారం సాయంత్రం ఆయన్ను తాడేపల్లికి పిలిచి.. నెల్లూరు లోక్‌సభ పరిధిలో ఉన్న కందుకూరు నుంచి బరిలోకి దిగాలని సూచించారు. ఇందుకు బుర్రా ససేమిరా అన్నారు. ఇప్పటి వరకూ కనిగిరి నీదేనని చెప్పి.. జగన్ మాట మార్చడంతో తీవ్ర అసంతృప్తితో బయటకు వచ్చేశారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సిఫారసుతోనే బుర్రాను తప్పించి హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ యాదవ్‌కు జగన్ అవకాశం ఇచ్చినట్లు భావిస్తున్నారు. కాగా.. కందుకూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎం.మహీధర్‌రెడ్డితో కూడా జగన్ గురువారం సాయంత్రం మాట్లాడారు. అన్నీ ఆలోచించి తానొక నిర్ణయం తీసుకుంటానని సీఎం చెప్పగా.. ఏ నిర్ణయం తీసుకున్నా తన వైపు నుంచి ఇబ్బంది ఉండదని మహీధర్‌రెడ్డి కూడా చెప్పినట్లు తెలిసింది. నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాత్రం మహీధర్‌రెడ్డినే రంగంలో ఉంచాలని గట్టిగా కోరుతున్నారు. బాలినేని కూడా కందుకూరులో ఆయనే గట్టి అభ్యర్థి అవుతారని చెప్పినట్లు తెలిసింది. మార్కాపురంలో బాలినేని సిఫారసు చేసిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు, టీటీడీ సభ్యుడు సుధీర్‌కు అవకాశం ఇచ్చి.. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు బదిలీ చేయాలని తొలుత భావించారు. అయితే బాలినేనిని సుధీర్ కలిసి మార్కాపురంలో పోటీచేయడం ఇష్టంలేదని చెప్పి సీఎంవోకు వెళ్లకుండా వెనుదిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గురువారం సాయంత్రం జగన్‌ను కలిశారు. 'జాగ్రత్తగా పనిచేసుకో.. అందరినీ కలుపుకొని పోవాలి' అని సీఎం చెప్పినట్లు తెలిసింది. బాలినేని డిమాండ్ మేరకు ఒంగోలులో నివాస స్థల భూముల కొనుగోలుకు రూ.180 కోట్లు విడుదల చేస్తూ గురువారం మధ్యాహ్నం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఒంగోలులో పోటీకి ఆయన అంగీకరించారు. ఒంగోలు ఎంపీ, గిద్దలూరు, కందుకూరు అభ్యర్థులపై శుక్రవారం తుది నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది.

4వ జాబితాలో ఇన్‌చార్జులు వీరే..

స్థానం	ప్రస్తుత	కొత్త ఇన్‌ఛార్జీ
చిత్తూరు ఎంపీ (ఎస్సీ)	ఎన్.రెడ్డెప్ప	కె.నారాయణస్వామి
గంగాధర నెల్లూరు (ఎస్సీ)	కె.నారాయణస్వామి	ఎన్.రెడ్డెప్ప
శింగనమల (ఎస్సీ)	జొన్నలగడ్డ పద్మావతి	ఎం.వీరాంజనేయులు
నందికొట్కూరు (ఎస్సీ)	టి.ఆర్థర్	డాక్టర్ దారా సుధీర్
తిరువూరు (ఎస్సీ)	కొక్కిలగడ్డ రక్షణ నిధి	నల్లగట్ల స్వామిదాసు
మడకశిర (ఎస్సీ)	తిప్పేస్వామి	ఈర లక్కప్ప
కొవ్వూరు (ఎస్సీ)	తానేటి వనిత	తలారి వెంకట్రావు
గోపాలపురం (ఎస్సీ)	తలారి వెంకట్రావు	తానేటి వనిత
కనిగిరి	బుర్రా మధుసూదన్ యాదవ్	దద్దాల నారాయణ యాదవ్

ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం

» రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ సమావేశాలు

» 25న భీమిలిలో తొలి మీటింగ్... జగన్ హాజరు: వైవీ

ఎండాడ(విశాఖపట్నం), జనవరి 18: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించబోతున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్రకు చెందిన ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలను గెలుపొందడమే లక్ష్యంగా సీఎం జగన్ కార్యాచరణ రూపొందించారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఐదుచోట్ల ప్రాంతీయ సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఈ సమావేశాలకు ఆ పరిధిలోని నియోజకవర్గాల నుంచి క్రియాశీలక కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు హాజరు కావాల్సి ఉంటుంది. పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఏ విధంగా పనిచేయాలో సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారు. అభ్యర్థులను మార్చడానికి గల కారణాలను వివరిస్తారు. అందులో భాగంగా మొదట ఈనెల 25న భీమిలిలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమావేశం జరుగుతుంది. దీనికోసం ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గం నుంచి ఐదు వేలకు తగ్గకుండా క్రియాశీలక కార్యకర్తలు, పార్టీ నాయకులు హాజరవుతారు' అని తెలిపారు. కాగా, అంతకుముందు సమావేశానికి ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బీశెట్టి సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఉత్తరాంధ్రలోని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సచివాలయంలో ధర్నాలు, ర్యాలీలపై నిషేధం

» మా గొంతు నొక్కేస్తున్న సర్కారు: ఉద్యోగుల ధ్వజం

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ ఉద్యోగులపైనా జగన్ సర్కారు నిర్బంధకాండకు దిగింది. అన్యాయంపై గొంతెత్తడానికి వీల్లేకుండా వారిని నిబంధనల చట్రంలో బిగించింది. అమరావతి సచివాలయం ప్రాంగణంలో ధర్నాలు, ర్యాలీలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి సర్క్యులర్ మెమో జారీ చేశారు. సచివాలయం ప్రాంగణంలో కొంతమంది ఉద్యోగులు తరచుగా ధర్నాలు, ర్యాలీలు చేస్తున్నారని, సీఎస్ కాన్వాయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించారని, భద్రతా సిబ్బందిని ఇబ్బంది పెట్టారని మెమోలో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం కూడా లేకుండా జగన్ ప్రభుత్వం నిర్బంధాలు విధిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే చిరుద్యోగులైన అంగన్వాడీలపై ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది. అదేవిధంగా రాష్ట్ర సచివాలయంలోనూ ఉద్యోగులు నిరసనలు వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఉద్యోగులు శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేయాలని భావిస్తున్నారు. ఈ తరుణంలో సచివాలయంలో ధర్నాలు, ర్యాలీలు నిషేధిస్తూ ఆదేశాలు ఇవ్వడం పై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలనకు గుండెకాయ అయిన సచివాలయంలోనూ ఉద్యోగుల గొంతు నొక్కేశారని మండిపడుతున్నారు.

అలుపెరుగని పోరాటం

- 38వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- ఎస్మా, షోకాజ్‌లకు బెదిరేదిలేదని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో దీక్షలు
- విజయనగరంలో ఐసీడీఎస్ కార్యాలయ ముట్టడి
- విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు.. శ్రీకాకుళంలో భారీ ర్యాలీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని 38రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా జగన్ సర్కార్ కనికరం చూపడం లేదు. మరోవైపు ఎస్మా ప్రయోగించినా, షోకాజు నోటీసులు ఇచ్చినా తగ్గేదేలేదంటూ అంగన్వాడీలు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం వల్లే సమ్మె చేస్తున్నామంటూ షోకాజ్ నోటీసులకు దీటుగా సమాధానం ఇస్తున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, ఐసీడీఎస్ ప్రాజెక్టుల వద్ద ఆందోళనలు నిర్వహించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాకేంద్రంలోని గుజరాతీపేట నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. షోకాజ్ నోటీసులపై అధికారులకు సమాధానం అందజేశారు. పార్వతీపురం జిల్లా సాలూరులో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కళ్లు, చెవులు మూసుకుని అంగన్వాడీ సిబ్బంది నిరసన తెలిపారు. ఏలూరులోని కలెక్టరేట్ వద్ద గురువారం 24 గంటల రిలే దీక్షలు ప్రారంభించారు. విజయనగరం జిల్లా ఐసీడీఎస్ కార్యాలయాన్ని గురువారం అంగన్వాడీలు ముట్టడించారు. తొలుత కలెక్టరేట్ నుంచి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తమకు ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులకు సమాధాన పత్రాలు సిద్ధం చేసి వాటితో నిరసన తెలిపారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపై 'భస్మాసుర హస్తం' పెట్టుకుని నిరసన తెలిపారు. అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు జగన్ మాస్క్ ముఖానికి వేసుకుని, కార్యకర్తలు, ఆయాల తలపై పెట్టి.. సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెన్నేకొత్తపల్లిలో వేపాకు తింటూ నిరసన తెలిపారు. గుత్తిలో రోడ్లపై భిక్షాటన చేశారు. గార్లదిన్నెలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువులో ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులు చూపిస్తూ నిరసన తెలిపారు. ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాలో అంగన్వాడీల 24గంటల నిరవధిక దీక్షలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో కార్యకర్తలు, ఆయాలు శిబిరాల్లోనే నిద్రిస్తున్నారు. అంగన్వాడీలకు మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాలు శుక్రవారం రాస్తారోకోలకు పిలుపునిచ్చాయి.



విజయవాడలో నిరవధిక నిరాహారదీక్షలో కూర్చున్న అంగన్వాడీలు


అంబేడ్కర్ స్మృతివనం లోపల రూపుదిద్దుకున్న గార్డెన్, గోడలపై అంబేడ్కర్ జీవిత ఘట్టాలకు సంబంధించి ఏర్పాటు చేసిన చిత్రాలు

18 ఎకరాలు 210 అడుగులు 400 కోట్లు

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం నేడే

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రూపశిల్పి, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ స్మారకంగా విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లో తలపెట్టిన 'అంబేడ్కర్ స్మృతి వనం' శుక్రవారం ప్రారంభం కాబోతోంది. ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం సాయంత్రం దీన్ని ప్రారంభించనున్నారు. ఇందిరా గాంధీ స్టేడియంలో బహిరంగ సభ అనంతరం..స్వరాజ్య మైదానానికి చేరుకొని విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. రూ.400 కోట్ల పైబడి వ్యయంతో అంబేడ్కర్ స్మృతివనాన్ని రాష్ట్రప్రభుత్వం తలపెట్టింది. ఇందులో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కేపీసీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దీని పనులను కూడా చేపట్టింది. తెలంగాణలో 50 అడుగుల పీఠంపై 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. 85 అడుగుల ఎత్తైన పీఠంపై 125 అడుగుల ఎత్తులో దీనిని నిర్మించింది. స్మృతివనంలోని అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం 400 మెట్రిక్ టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్, 120 మెట్రిక్ టన్నుల కాంస్యాన్ని ఉపయోగించారు. స్టెయిన్‌లెస్ స్టీల్ అంబేడ్కర్ విగ్రహభాగాలపై కంచు తాపడం వేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం కోసం కింద నిర్మించిన భవన పటిష్ఠత కోసం భూగర్భంలో 30 మీటర్ల లోతున 539 పైల్స్ వేశారు. యాభై డిగ్రీల కోణంలో కాంక్రీటు బీములు వేశారు. హైదరాబాద్‌లో 11.7 ఎకరాల విస్తీర్ణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా.. విజయవాడలో 18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన బిల్డింగ్‌ను అంబేడ్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా పిలుస్తారు. కాలచక్ర మహా మండపం తరహాలో దీనిని ఏర్పాటు చేశారు. ఇందులో అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలుసుకునే విధంగా మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. గోడలపై అంబేడ్కర్ ఛాయాచిత్రాలు, ఆయన జీవిత ఘట్టాలకు సంబంధించిన చిత్రాలను ఏర్పాటుచేశారు. ప్రధాన భవనం రెండువైపులా కొలనేడ్ ఉంటుంది. కొలనేడ్‌ను 166 పిల్లర్లతో 388 మీటర్ల పొడవున నిర్మించారు. ఈ గోడలపై అంబేడ్కర్ జీవితగాథలను తెలిపేలా..ఛాయాచిత్రాలను ఏర్పాటుచేశారు. ప్రధానమైన భవన్‌లో అంబేడ్కర్ చదివిన పుస్తకాలతోపాటు, అనేక పుస్తకాల సమాహారంతో కూడిన లైబ్రరీ, ఆర్ట్ గ్యాలరీ, మినీ థియేటర్ వంటివి కూడా ఉన్నాయి. వెనుక భాగంలో 2000 సీటింగ్ సామర్థ్యంతో కూడిన కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫుడ్‌కోర్టును కూడా ఎనిమిది వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో తలపెట్టారు. పార్కింగ్ ప్లేస్‌ను ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉంది. స్మృతి వనాన్ని అందమైన ఉద్యానవనంగా తీర్చిదిద్దారు. మ్యూజికల్ ఫౌంటెయిన్లు, ల్యాండ్ స్కేపింగ్, లైటింగ్ పాత్‌వేలు ఏర్పాటు చేశారు. విజయవాడ నడిబొడ్డున చక్కటి ఆహ్లాదకరంగా అంబేడ్కర్ స్మృతి వనం ప్రాజెక్టును తీర్చిదిద్దారు.

విగ్రహం విశేషాలు..

- స్మృతివనం విస్తీర్ణం 18 ఎకరాలు... విగ్రహం 125 అడుగులు...పీఠం 85 అడుగులు..వ్యయం రూ.400 కోట్లుపైగానే..
- విగ్రహ నిర్మాణానికి 400 మెట్రిక్ టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్, 120 మెట్రిక్ టన్నుల కాంస్యం ఉపయోగించారు.
- విగ్రహాన్ని ప్రధానంగా నిలిపి ఉంచే పెడెస్ట్రియల్ భవనం కోసం 11,140 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్, 1445 మెట్రిక్ టన్నుల స్టీల్ వాడారు. విగ్రహాన్ని చేరుకోవటానికి పెడస్ట్రియల్‌కు రెండు లిఫ్టులు ఏర్పాటుచేశారు.
- తెలంగాణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కేపీసీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థే విజయవాడ అంబేడ్కర్ విగ్రహం పనులు కూడా చేపట్టింది.

జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని

ప్రారంభించే అర్హత లేదు!

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



నెల్లూరు, జనవరి 18: 'సీఎం జగన్మోహన్‌రెడ్డి పలు ఆర్థిక కేసుల్లో నిందితుడు. పేద, బలహీన వర్గాలను దోచుకున్న దోపిడీదారుడు. దేశంలోనే అత్యంత అవినీతిపరుడు. ఆయనకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదు' అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ స్పష్టం చేశారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'జగన్ గెలిచింది వైఎస్ఆర్ చరిష్మాతో కాదు. ఆయన మృతిపై వచ్చిన సానుభూతితో. అన్ని వర్గాల విశ్వాసం కోల్పోయిన జగన్, నీతి నిజాయతీలకు నిలువుటద్దమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభించడం బాధగా ఉంది. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలను స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఉన్న నటుడు చిరంజీవిని తిరుపతి నుంచి పోటీ చేయమని ఆహ్వానిస్తున్నా. ఆయన్ను గెలిపించుకోవడంతోపాటు ముఖ్యమంత్రిని చేసేందుకు అధిష్ఠానంతో పోరాడతాను. ఇక జనసేనాని పవన్‌కల్యాణ్‌కు ముఖ్యమంత్రి అయ్యే అర్హత లేదు' అన్నారు.

ఏపీకి 'కరోనా' టెర్రర్!

- జేఎన్ 1 సబ్ వేరియంట్ కేసులు 189 గుర్తింపు
- తెలంగాణలో 32 కేసులు నమోదు
- అప్రమత్తంగా ఉండాలి: కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 18 : కరోనా జేఎన్.1 సబ్-వేరియంట్ కేసులు దేశంలో పెరుగుతున్నాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు కనిపిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో వరుసలో ఉంది. ఈ రకం వైరస్ వ్యాప్తిలో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఈ మేరకు 'ఇన్సాకోగ్' (సార్స్-కొవిడ్-2 జెనోమిక్స్ కన్సార్టియం) సంస్థ గురువారం గణాంకాలు విడుదల చేసింది. కర్ణాటకలో కరోనా జేఎన్. 1 సబ్-వేరియంట్ కేసులు 234 బయటపడగా, ఏపీలో 189 కేసులు గుర్తించారు. ఇక.. మహారాష్ట్ర 170, కేరళ 156, పశ్చిమ బెంగాల్ 96, గోవా 90, తమిళనాడు 88, గుజరాత్ 76 కేసులతో ఈ రెండు రాష్ట్రాల తర్వాతి వరుసలో ఉన్నాయి. ఇక.. రాజస్థాన్‌లో 37, తెలంగాణ 32, ఛత్తీస్‌గఢ్ 25, ఢిల్లీ 16, ఉత్తరప్రదేశ్ 7, హరియాణా ఐదు, ఒడిశా మూడు, ఉత్తరాఖండ్, నాగాలాండ్‌లో చెరో ఒక్క కేసు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 1,226 కేసులు నమోదయ్యాయని ఈ సంస్థ తెలిపింది. నిరంతర అప్రమత్తతను పాటించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం హెచ్చరించింది.

ఇదేనా న్యాయం?

నాలుగున్నరేళ్లుగా బడుగుల హక్కులను కాలరాశారు. ఎస్సీ, ఎస్టీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టారు. వారిపైనే దాడులు చేసిన వారికి, హత్యలు చేసిన వారికి కొమ్ముకాస్తున్నారు. దళిత డ్రైవర్‌ను హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత్‌బాబుపై చర్యలేవీ? కోడికత్తి కేసులో ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్న శ్రీనుకు ఎందుకు విముక్తి కల్పించలేదు? బడుగులకు జగన్ సర్కారు చేసే న్యాయం ఇదేనా?

ఓట్ల రాజకీయం కాదా?

నిజంగా బడుగుల పట్ల ప్రేమ ఉంటే నాలుగున్నరేళ్లుగా వారి అభ్యున్నతికి ఎందుకు కృషి చేయలేదు? వారి హక్కులను ఎందుకు కాపాడలేదు? ఎన్నికల ముందు ఇప్పుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం పేరుతో రాజకీయం చేయడం ఓట్ల కోసం కాదా?

బడుగులను బుగ్గిచేసి..

(మొదటి పేజీ తరువాయి)

హక్కులను సైతం కాలరాసి వారి జీవితాలతో ఆడుకున్న ప్రభుత్వానికి అంబేడ్కర్ పేరు ఉచ్చరించే అర్హత ఉందా?.. దళితులు, గిరిజన వర్గాల నుంచి వినిపిస్తున్న ప్రశ్నలివి. నాలుగున్నరేళ్లుగా బడుగులకు అన్ని విధాలా వంచన చేసిన జగన్ సర్కారు ఇప్పుడు వారి ఓట్ల కోసం బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరును వాడుకుంటోంది. అంబేడ్కర్ స్మృతివనం పేరుతో హడావుడి చేస్తోంది. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలు విద్య, ఉపాధి పరంగా ఎంతో నష్టపోయారు. వారికి సంబంధించి గతంలో అమలు చేసిన సుమారు 28 పథకాలను అటకెక్కించారు. అభివృద్ధికి వారిని ఆమడదూరంలో ఉంచారు. దళితులు ఎక్కువగా ఉన్న అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసి వారి అభివృద్ధిని కాలరాశారు. దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్‌భూములను సైతం లాక్కొన్నారు. బడుగులపై ఎన్నో దాడులు జరిగాయి. అయినా వారిపైనే ఎదురు కేసులు బనాయించారు. పైగా బడుగులపై దాడులు చేసిన వారిని వెనకేసుకొస్తున్నారు. ఇన్ని రకాలుగా దళితులు, గిరిజనులకు అన్యాయం చేసిన జగన్.. ఎన్నికల ముందు విజయవాడ నడిబొడ్డులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పేరిట ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆ వర్గాల నుంచే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. విశాలమైన అమరావతి రాజధానిలో సర్వహంగులతో నెలకొల్పాల్సిన అంబేడ్కర్ స్మృతివనాన్ని పక్కనబెట్టి, విజయవాడలోని బందర్ రోడ్డులో ఇరుకు ప్రాంతాల్లో నెలకొల్పడం అంబేడ్కర్‌ను సైతం చిన్నచూపు చూడటమేనని దళిత సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు జగన్ సర్కారు ఎంత హడావుడి చేసినా ఇన్నాళ్లూ దళితులు, గిరిజనులకు చేసిన అన్యాయాన్ని మరచిపోలేరని అంటున్నారు.

అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ?

- అంబేడ్కర్ స్ఫూర్తితో దళితుల కోసం రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా దశాబ్దాలుగా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, స్వయం ఉపాధి పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, అంబేడ్కర్ విదేశీ విద్య తదితర 28కి పైగా పథకాలను జగన్ సర్కారు రద్దు చేసింది.
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే తూట్లు పొడిచారు. లబ్ధిదారుల సంఖ్య సగానికి తగ్గించేందుకు సర్వే చేయించి దళితవాడల్లో నివాసమున్న దళితులకు మాత్రమే అమలు చేశారు.
- దళిత యువకులు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడే ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఎలాంటి సంక్షేమం అందకుండా నిలిపేశారు.
- ఎస్సీలకు మాదిగ, మాల, రెల్లి అనే మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ సలహాదారులకు ఇచ్చినంత గౌరవవేతనం మొత్తాన్ని కూడా ఆయా కార్పొరేషన్లకు కేటాయించలేదన్న ఆరోపణలున్నాయి.
- మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయాల్సిన మెడికల్ కళాశాల సీట్లను కూడా దళితులకు కేటాయించకుండా అన్యాయం చేశారు. 17 మెడికల్ కళాశాలల ద్వారా దళిత విద్యార్థులకు దక్కాల్సిన 544 మెడికల్ సీట్లను జగన్ సర్కార్ విక్రయించి దళిత విద్యార్థులకు ద్రోహం చేసింది.
- ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం, విదేశీ విద్యను ఆంక్షలతో అటకెక్కించడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జాప్యం చేయడం వంటి చర్యలతో విద్యను దళితులకు దూరం చేశారనే ఆరోపణలున్నాయి.
- దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ భూములు సైతం ప్రభుత్వం బలవంతంగా లాక్కొంటోంది. గత ఐదేళ్లలో 12 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని దళిత కుటుంబాలను రోడ్డున పడేసింది. స్థానిక నేతలు దళితులను బెదిరించి వారి భూముల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు.

దళితులపైనే కేసులు

1989 నుంచి అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ చట్టం కింద జాప్యం చేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ ఐదేళ్లలో దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే దళితులపై దాడులు జరిగాయి. పోలీసులు అట్రాసిటీ చట్టాన్ని ఎస్సీ, ఎస్టీ వర్గాలపైనే ప్రయోగించారు. దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హతమార్చి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంత్‌బాబుపై చర్యలు తీసుకోకపోగా.. జగన్ తన పక్కన కూర్చోబెట్టుకుని సన్మానాలు చేయించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం కోడికత్తి కేసులో శ్రీను అనే దళిత యువకుడిని ఐదేళ్లుగా బెయిల్ కూడా రాకుండా వేధించడం జగన్ పెత్తందారీ పోకడలకు నిదర్శనమంటూ శ్రీను కుటుంబ సభ్యులు విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్దే దీక్షకు సిద్ధం కావడం ప్రభుత్వ ద్వంద్వవైఖరిని స్పష్టం చేస్తోందంటున్నారు. ఇక మాస్క్ అడిగినందుకు విశాఖలో డాక్టర్ సుధాకర్‌ను, అక్రమాలను ప్రశ్నించినందుకు చిత్తూరులో డాక్టర్ అనితారాణిని, వేధింపులపై ప్రశ్నించినందుకు చీరాలలో కిరణ్‌ను, మద్యం రేట్లపై పెద్దిరెడ్డిని ప్రశ్నించిన ఓంప్రతాప్‌ను, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చినందుకు కరుణాకర్‌ను... ఇలా ఎంతోమంది దళిత, గిరిజనుల ప్రాణాలను బలిగొన్నారు.

సబ్‌ప్లాన్ నిర్వీర్యం

ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు, విద్య, ఉపాధి ప్రమాణాలు పెంచేందుకు ఏర్పాటు చేసిన సబ్‌ప్లాన్‌ను జగన్ సర్కార్ నిర్వీర్యం చేసింది. టీడీపీ హయాంలో ఐదేళ్లలో రూ.7 లక్షల కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తే.. అందులో రూ.37 వేల కోట్లు దళితుల కోసం కేటాయించింది. వైసీపీ సర్కారు ఈ ఐదేళ్లలో రూ.9.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, అందులో దళితుల కోసం రూ.30 వేల కోట్లు మాత్రమే కేటాయించింది.

విగ్రహం పేరుతో వంచన: ఆనంద్



రాష్ట్రం నడిబొడ్డున ఉన్న ప్రజా రాజధాని అమరావతిలో 25 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన అంబేడ్కర్ స్మృతివనాన్ని అర్ధాంతరంగా నిలిపేసి, రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా విజయవాడలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జగన్ పెత్తందారీ విధానానికి నిదర్శనమని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. దళితులకు ఈ మేరకు బహిరంగ లేఖ రాశారు. జగన్‌రెడ్డిపై దళితుల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకే అంబేడ్కర్ విగ్రహం పేరుతో మరో వంచనకు కుట్ర పన్నారన్నారు. దళితుల హక్కుల కోసం, చట్టాల కోసం, నిధుల కోసం కలిసికట్టుగా పోరాడి జగన్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 19 జనవరి 2024

నిట్ సూరత్‌కల్‌లో ఎంబీఏ



సూరత్‌కల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక (నిట్ కే) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. క్యాట్/మ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 32, ఎస్సీలకు 12, ఎస్టీలకు 6, ఓబీసీ అభ్యర్థులకు 22, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 8 సీట్లు ప్రత్యేకించారు. దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రేడింగ్ సిస్టంలో పది పాయింట్ల స్కేల్ మీద కనీసం 5.5 సీజీపీఏ ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు లేదా 5 సీజీపీఏ చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 15 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023/మ్యాట్ (సెప్టెంబరు 2023/డిసెంబరు 2023)/గేట్ 2023/2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం; జీడీ, ఇంటర్వ్యూ, అనుభవాలకు ఒక్కోదానికి 10 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తూ అభ్యర్థుల తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 3
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 8
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్; డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు; టీసీ, సీసీ; జాతీయ పరీక్షకు సంబంధించిన ఒరిజినల్ స్కోర్ కార్డ్; కులం, ఆదాయం, వైకల్యం, అనుభవం, స్పాన్సర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు; ఆధార్ కార్డ్; రెండు ఫొటోలు.
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 22 నుంచి 25 వరకు
- **దరఖాస్తు హార్డ్ కాపీ పంపాల్సిన చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకడమిక్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటక, సూరత్‌కల్, శ్రీనివాస్ నగర్, మంగళూరు - 575025
- **వెబ్‌సైట్:** www.nitk.ac.in

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్) - 'రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' విభాగంలో పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. వివిధ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒకే స్పెషలైజేషన్‌లో ఒక ప్రోగ్రామ్ నుంచి రెండోదానిలోకి మారే అవకాశం ఉంది. అకడమిక్ ప్రతిభ, ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 'రిజల్ట్ అవైటెడ్' కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ విభాగాలు, యూనివర్సిటీలు, ఫండెడ్ యూనివర్సిటీలు, అటానమస్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. వీరికి ట్రావెలింగ్ అలవెన్స్, డెయిలీ అలవెన్స్, కంటింజెంట్ గ్రాంట్, మెడికల్ అలవెన్స్ తదితరాలను స్పాన్సర్ సంస్థలు చెల్లిస్తాయి.

ఐఐఆర్ఎస్‌లో పీజీ, పీజీ డిప్లొమా



స్పెషలైజేషన్‌లు: అగ్రికల్చర్ అండ్ సాయిల్స్, ఫారెస్ట్ రిసోర్సెస్ అండ్ ఎకో సిస్టం అనాలిసిస్, జియోసైన్సెస్, మెరైన్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, నేచురల్ హజార్డ్స్ అండ్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్, శాటిలైట్ ఇమేజ్ అనాలిసిస్ అండ్ ఫొటోగ్రామెట్రీ, స్పేషియల్ డేటా సైన్స్, అర్బన్ అండ్ రీజనల్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మూడు మాడ్యూల్స్ ఉంటాయి. మొదటి మాడ్యూల్ అన్ని స్పెషలైజేషన్‌లకు కామన్‌గా ఉంటుంది. దీనిలో జియోస్పేషియల్ టెక్నాలజీస్, రిమోట్ సెన్సింగ్ అండ్ ఫొటోగ్రామెట్రీ, జీఐఎస్‌లకు సంబంధించిన ఫండమెంటల్స్, బేసిక్స్ బోధిస్తారు. రెండో మాడ్యూల్‌లో అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌కు జియోస్పేషియల్ టెక్నాలజీ అప్లికేషన్ విధానాలు వివరిస్తారు. చివరి మాడ్యూల్‌లో పైలెట్ ప్రాజెక్ట్ ఉంటుంది.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పేషియల్ డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లో ఆరు సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో మూడు సీట్లు ఉన్నాయి.

కోర్సు ఫీజు: ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది. మిగిలిన అభ్యర్థులు రూ.72,000; విదేశీ అభ్యర్థులు 7,200 యూఎస్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

పీజీ: ఎంటెక్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్ అన్ని స్పెషలైజేషన్‌లకు కామన్‌గా ఉంటుంది. ఇందులో రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్, జీఐఎస్, ఫొటోగ్రామెట్రీ, కార్టోగ్రఫీ, జీఎన్ఎస్ఎస్ అంశాలకు సంబంధించిన ఫండమెంటల్స్ వివరిస్తారు. రెండో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన కోర్ కోర్సులు, కామన్ కోర్సులు, కేస్ స్టడీస్ ఉంటాయి. చివరి రెండు సెమిస్టర్లలో ఎంచుకొన్న అంశంపై సెమినార్, మిడ్ టర్మ్ ప్రజంటేషన్, డిజర్టేషన్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఎంటెక్ డిగ్రీని ప్రదానం చేస్తుంది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

సీట్లు: ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో అయిదు సీట్లను ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు కేటాయించారు.

కోర్సు ఫీజు: ప్రభుత్వం స్పాన్సర్ చేసిన అభ్యర్థులు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ కింద రూ.20,000 చెల్లిస్తే చాలు. మిగిలినవారు రూ.1,64,000 చెల్లించాల్సి ఉంటుంది. విదేశీ అభ్యర్థులు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజుతోపాటు అదనంగా 14,400 యూఎస్ డాలర్లు చెల్లించాలి.


అర్హత వివరాలు: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, బయాలజీ, కంప్యూటర్ సైన్స్‌లలో కనీసం రెండు ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు ఎంచుకొన్న స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు కోర్సు ప్రారంభం నాటికి 45 ఏళ్లు మించకూడదు. గేట్ అర్హత పొందిన అభ్యర్థులకు ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ఏఐసీటీఈ ఫెలోషిప్ లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఒక కోర్సుకు దరఖాస్తు ఫీజు:** భారతీయులకు రూ.1000; విదేశీయులకు 100 యూఎస్ డాలర్లు
- **రెండు కోర్సులకు దరఖాస్తు ఫీజు:** భారతీయులకు రూ.1500; విదేశీయులకు 150 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://admissions.iirs.gov.in

ఢిల్లీ ఎయిమ్స్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పీహెచ్‌డీ 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంట్రెన్స్ ఎగ్జామ్, డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. గవర్నమెంట్ ఫెలోషిప్ ఉన్న అభ్యర్థులకు 69 సీట్లు ప్రత్యేకించారు.



విభాగాలు-సీట్లు: అనాటమీ 7, బయోకెమిస్ట్రీ 6, బయోఫిజిక్స్ 6, బయోటెక్నాలజీ 6, కార్డియాక్ బయోకెమిస్ట్రీ 2, క్లినికల్ న్యూరోసైకాలజీ 3, కమ్యూనిటీ మెడిసిన్ 4, ఆప్తల్మాలజీ 2, డెర్మటాలజీ&వెనెరాలజీ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, గ్యాస్ట్రోఎంటరాలజీ 1, హెమటాలజీ 1, ల్యాబొరేటరీ మెడిసిన్ 3, ల్యాబొరేటరీ అంకాలజీ 3, మెడికల్ అంకాలజీ 7, మైక్రోబయాలజీ 7, న్యూరాలజీ 3, ఆర్‌పీసీ 12, పీడియాట్రిక్స్ 2, పాథాలజీ 4, ఫార్మకాలజీ 6, ఫిజియాలజీ 9, ప్రివెంటివ్ అంకాలజీ 2, సైకియాట్రీ 3, ఎన్‌డీడీటీసీ 5, రీప్రొడక్టివ్ బయాలజీ 2, స్టెమ్ సెల్ 3, సర్జికల్ విభాగాలు 2.

అర్హత: విభాగాన్ని అనుసరించి నిర్దేశించిన స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంఈ/ఎంటెక్/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ/ఎంవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. డిస్టెన్స్ విధానంలో మాస్టర్స్ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఎన్‌బీహెచ్ఎం స్క్రీనింగ్ టెస్ట్/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హత ఉన్న నాన్ మెడికల్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: దీనిని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో రెండు స్టేజ్‌లు ఉంటాయి. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి స్టేజ్‌లో ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, ల్యాబ్ టెక్నాలజీ తదితర అంశాల నుంచి 30 ప్రశ్నలు; రెండో స్టేజ్‌లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

- ఎగ్జామ్‌లో అర్హత పొందినవారిని సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని ఎంపిక చేసి స్టేజ్ 3 కింద డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్‌కు అనుమతిస్తారు. దీనికి 20 మార్కులు ఉంటాయి. ఫెలోషిప్ అర్హత/ప్రొఫెషనల్ డిగ్రీకి పది మార్కులు కేటాయించారు.
- మూడు స్టేజీల్లో కలిపి మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 26
- **కరెక్షన్ విండో ఓపెన్:** జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఫిబ్రవరి 9న
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫలితాలు విడుదల:** ఫిబ్రవరి 19న
- **డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్:** మార్చి 1
- **తుది ఫలితాలు విడుదల:** మార్చి 11
- **ప్రోగ్రామ్‌లో జాయినింగ్ తేదీ:** మార్చి 30
- **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఏపీపీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ


మానవ విసర్జక వ్యవస్థ

మూత్రం ఏర్పడే విధానం

మూత్రపిండంలో మూత్రం ఏర్పడే విధానాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. అవి.. సూక్ష్మగాలనం, నాళికాయుత పునఃశోషణ, నాళికాస్రావం.

సూక్ష్మగాలనం: మొదటి దశలో రక్త నాళికాగుచ్ఛంలో ఉండే రక్తం వడపోతకు గురై బౌమన్స్ గుళికలోకి చేరుతుంది. ఈ విధానాన్నే సూక్ష్మగాలనం లేదా రక్తనాళికా గుచ్ఛగాలనం అంటారు. అభివాహి ధమని కలిగించే పీడనం వలన రక్తకేశ నాళికాగుచ్ఛంలోకి వడపోతకు గురైన రక్తం చేరుతుంది. గుచ్ఛగాలనం ద్వారా ఏర్పడిన ద్రవాన్ని గాలిత ద్రవం లేదా ప్రాథమిక మూత్రం అంటారు. ప్రాథమిక మూత్రంలో వ్యర్థ పదార్థాలు, పోషకపదార్థాలు, నీరు ఉంటాయి. ప్రాథమిక మూత్రం రసాయనికంగా రక్తంతో సమానం. దీనిలో కణాలు ఉండవు. ఆరోగ్యవంతమైన మానవుడిలో నిమిషానికి దాదాపు 125 మి.లీ. ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది.

నాళికాయుత పునఃశోషణ: దీనినే వరణాత్మక పునఃశోషణ అంటారు. ఈ దశ సమీపస్థ సంవళిత నాళికకు, వ్యాసారెక్టాకు మధ్య జరుగుతుంది. సమీపస్థ సంవళిత నాళికకు మరోపేరు పూర్వ సంవళిత నాళిక. వ్యాసారెక్టా అంటే నెఫ్రాన్ నాళిక చుట్టూ విస్తరించి ఉండే వల లాంటి రక్తకేశ నాళికల సమూహం. దీనిని పరినాళికా రక్తకేశ నాళికలు అంటారు. ప్రాథమిక మూత్రం సమీపస్థ సంవళిత నాళాన్ని చేరినప్పుడు 75 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది. ప్రాథమిక మూత్రంలో ఉపయోగ పదార్థాలైన గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, కాల్షియం, సోడియం క్లోరైడ్ మొదలైనవి సమీపస్థ సంవళిత నుంచి వ్యాసారెక్టాలోకి శోషింపబడతాయి.



నాళికా స్రావం: ఈ దశ వ్యాసారెక్టాకు, దూరాగ్ర సంవళిత నాళానికి మధ్య జరుగుతుంది. సమీప సంవళిత నాళంలో పునఃశోషణ తరవాత మూత్రం హెన్లీ శిక్యం ద్వారా దూరాగ్ర సంవళితనాళంలోకి చేరుతుంది. వ్యాసారెక్టా నుంచి దూరాగ్ర సంవళితనాళంలోకి ప్రవేశించిన పదార్థాలు యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్, సోడియం, పొటాషియం, క్లోరైడ్, హైడ్రోజన్ అయాన్లు మూత్ర గాఢతను, pHను నియంత్రిస్తాయి. ఈ విధంగా అధిక గాఢత గల మూత్రం ఏర్పాటులో హెన్లీశిక్యం, సంగ్రహణ నాళాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. హెన్లీశిక్యం ప్రాంతంలో ఉన్న మూత్రం నుంచి 10 శాతం నీరు ద్రవాభిసరణ ద్వారా దానిని ఆవరించి ఉన్న కణజాలంలోకి శోషింపబడుతుంది. సంగ్రహణనాళంలో వాసోప్రెస్సిన్ హార్మోన్ సహాయంతో నీటి పునఃశోషణ జరిగి మూత్రం అతి గాఢతను పొందుతుంది. గాఢతలో గరిష్ఠ స్థాయికి చేరిన ఈ ద్రవమే మూత్రం. రక్తం కంటే మూత్రం అధిక గాఢతలో ఉంటుంది.

మూత్ర పిండం మార్పిడి

దీర్ఘకాలికంగా కిడ్నీలు పనిచేయని వారికి మూత్రపిండ మార్పిడి ప్రక్రియను చేపడతారు. 1954లో చార్లెస్ హాప్‌నగెల్(అమెరికా) అనే వైద్యుడు మొట్ట మొదట మూత్రపిండ మార్పిడికి రూపకల్పన చేశాడు. మనదేశంలో 1971 డిసెంబరు 1 వేలూరు(తమిళనాడు)లోని క్రిస్టియన్ మెడికల్ కళాశాలలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు.

మూత్ర సంఘటన

ఆరోగ్యవంతమైన మానవుడు ప్రతి రోజూ 1 నుంచి 1.8 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. దీనితోపాటు 25 నుంచి 30 గ్రాముల యూరియా కూడా విసర్జితమవుతుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ విచ్ఛిన్నమైనప్పుడు ఏర్పడే యూరోక్రోమ్ అనే పదార్థం కారణంగా మూత్రం పసుపు రంగులోకి మారుతుంది. యూరియా విచ్ఛిన్నం చెంది అమ్మోనియా ఏర్పడటం వలన మూత్రం మొదట ఆమ్లయుతంగా(pH=6.0) ఉన్నప్పటికీ క్రమంగా క్షారయుతంగా మారుతుంది. మూత్రంలో 96 శాతం నీరు, 2.5 శాతం కర్బన పదార్థాలు(ఆక్సలేట్స్, హార్మోన్స్, యూరియా, యూరికామ్లం, క్రియాటిన్, క్రియాటినైన్ నీటిలో కలిగే విటమిన్స్), 1.5% అకర్బన పదార్థాలు(అయోడిన్, మెగ్నీషియం, క్లోరైడ్, కాల్షియం, సోడియం, ఫాస్పేట్, సల్ఫేట్) మొదలైన పదార్థాలు ఉంటాయి. 24 గంటల మూత్ర పరీక్ష అంటే..ఒక వ్యక్తి నుంచి 24 గంటలలో సేకరించిన మొత్తం మూత్రంలో నుంచి 100-15 మి.లీ. మూత్రాన్ని నమూనాగా తీసుకొని పరీక్షిస్తారు. ప్రోటీన్లు అధికంగా తీసుకుంటే మూత్రంలో యూరియా అధికంగా, కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే చక్కెరలు ఎక్కువగా ఉంటాయి.

కృత్రిమ మూత్రపిండం

డాక్టర్ విలియం కాఫ్‌ను డయాలసిస్ పితామహుడిగా పిలుస్తారు. మానవుడి మూత్ర పిండాలు పనిచేయని స్థితిలో రక్తాన్ని వడపోయడానికి తోడ్పడే యంత్రమే కృత్రిమ మూత్ర పిండం లేదా డయలైజర్. ఈ పద్ధతిని హీమోడయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని ధమని నుంచి తీసి సిర ద్వారా ఎక్కిస్తారు. దీనికి దాదాపు మూడు నుంచి ఆరు గంటల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలోని డయలైజర్ పరికరంలో వడపోతకు అనుకూలంగా ఉండే సెల్లోఫేన్‌తో తయారైన గొట్టాలను వాడుతారు. హెపారిన్, ఆంటిహెపారిన్‌ను ఉపయోగిస్తారు. హెపారిన్ అనేది రక్తంలో యాంటికొయాగ్యులెంట్‌గా పనిచేస్తుంది. ఈ ప్రక్రియ యురేమియా వ్యాధిగ్రస్తులకు ఒక వరం లాంటిది. యూరేమియా అంటే మూత్ర పిండాలు సరిగా పనిచేయని వారి శరీరంలో నీరు, వ్యర్థ పదార్థాలు నిండిపోయే దశ. ఈఎస్ఆర్‌డి(ఎండ్ స్టేజ్ రెనాల్ డిసీజ్) అంటే మూత్రపిండాలు పనిచేయక పోవడమని అర్థం.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

లిటిల్స్



ఆత్మ సంతృప్తి

ఒక రాజ్యంలో ఓ అత్యంత తెలివైనవాడుండేవాడు. అతని పేరు సుబ్బన్న. తెలివైనవాడే కానీ తృప్తి, ఆనందం అనే మాట తెలీని వాడు. ఎవరిని చూసినా తానే వాడికంటే గొప్ప అనుకుండే నైజం. దీంతో సుబ్బన్న అహంభావి అనేవారు కొందరు. ఇవేమీ పట్టించుకునేవాడు కాదు సుబ్బన్న.

రాజ్యంలో ఓ గుడి కట్టారు. అది రాముల వారి ఆలయం. ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు వెళ్లి ఆనందించాలని సుబ్బన్న అనుకున్నాడు. తన ఊరు దూరం అయినా కాలిబాటన, బండిలో ఇలా ఉత్సవ స్థలానికి చేరుకున్నాడు. మొదటి రోజు రాజుగారు వచ్చారు. అందరూ ఆసీనులై ఉండగా.. ఇద్దరు కళాకారులు వచ్చి పాటలు పాడారు. ఆ పాటలు విని తన్మయత్వం చెందాడు. తాను కూడా అలా పాడితే బావుండునని




అనుకున్నాడు. ఎంతో బాధపడ్డాడు. తానూ అలా గాయకుడిని అయితే బావుండును అనుకున్నాడు.


రెండో రోజు రాజుగారి ముందు కవులు వచ్చి పద్యాలు పాడారు. పండితులు మాట్లాడారు. వారిలా పద్యాలు రాయలేకపోతినే అనుకున్నాడు. కొన్ని పద్యాలు అర్థమై ఎంతో సంతోషపడ్డాడు. నేను కూడా పండితుడిని అయితే వీరి భాష వచ్చి ఉండేది కదా అని వగచాడు. రానే చివరి రోజు వచ్చింది. మూడో రోజు రామాలయం దగ్గర రామాయణం బొమ్మలు, ఎన్నో విశేషాలను కళాకారులు చిత్రించారు. కాన్వాసుల మీద రాళ్లమీద రామాయణగాథ వివరించబడింది. ఆ బొమ్మలు చూసి నేను కూడా ఇలా గీసి ఉంటే అందరి మెప్పు పొందేవాడిని కదా.. అనుకున్నాడు సుబ్బన్న.

బాధతో కోపంతో ఇంటికి పయనమయ్యాడు. మూడోరోజు రాత్రి ఓ ఆశ్రమంలో బస చేశాడు. అక్కడ ముగ్గురు కనపడ్డారు. ఒకడు గుడ్డివాడు, రెండోవాడు చెవిటి, మూడో వాడికి కళ్లు లేవు. అది చూసి సుబ్బన్న ఆశ్చర్యపోయాడు. 'వీళ్లు ఈ రాముడి గుడి ఉండే ఊరిలోనే ఉన్నారు. అయితే ఏ కళలనూ ఆస్వాదించలేకపోతున్నారే. వారి కంటే నేనే నయం కదా' అనుకున్నాడు. వెంటనే అతనికి ఆత్మసంతృప్తి కలిగింది. ఎంతో ఆనందపడ్డాడు.

దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 207

	1		4	7				6
3			1					
	8				6	7		
	5					2		
	7	2				4	3	
		3					6	
		6	7				4	
					4			2
9				6	5		8	

సుడోకు - 206 సమాధానం

8	2	7	3	9	4	6	5	1
1	4	6	8	5	2	7	3	9
5	9	3	1	7	6	8	4	2
9	1	8	6	2	5	4	7	3
7	5	4	9	3	1	2	6	8
6	3	2	7	4	8	9	1	5
2	6	1	5	8	7	3	9	4
3	8	5	4	6	9	1	2	7
4	7	9	2	1	3	5	8	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.